రెడ్ సెల్యూట్ కామ్రేడ్

సీతారాం ఏచూరి అస్తమయం

- నేటి సాయంత్రం ఢిల్లీలోని ఆయన నివాసానికి భౌతిక కాయం
- రేపు ఉదయం సిపిఎం కేంద్ర కార్యాలయానికి
- సాయంత్రం ఎయిమ్స్‌కు అప్పగింత



భారత కమ్యూనిస్టు ఉద్యమ ముద్దుబిడ్డ ఇక లేరు. మార్క్సిజాన్ని భారతీయ పరిస్థితులకు వర్తింపచేసి విప్లవ శక్తులను కొత్త పుంతలు తొక్కించడానికి విరామమెరుగక కృషి చేసిన నిత్య శ్రామికుడు అస్తమించాడు. సామ్రాజ్యవాదం,మతోన్మాదంపై రాజీ లేని యుద్ధం చేసిన పోరాట యోధుడు విశ్రమించాడు. కార్మిక-కర్షక పోరాటాల మార్గదర్శి , వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర శక్తుల సమన్వయ రథ సారధి సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి (72) కన్నుమూశారు. మూడు దశాబ్దాలుగా ఏన్నో పోరాటాలకు ఊపిరి పోసిన ఆయన తుదిశ్వాస విడిచారు. ఢిల్లీలోని ఎయిమ్స్‌లో కొద్దిరోజులుగా చికిత్స పొందుతున్న ఆయన ఆరోగ్యం గురువారం తీవ్రంగా విషమించింది. ఆయనను కాపాడటానికి చివరిక్షణం వరకు వైద్యులు చేసిన కృషి ఫలించలేదు. ఎన్నో గడ్డు పరిస్థితులను అధిగమించి పోరాట జెండాను పదేపదే ఎగుర వేసిన ఏచూరి ఈ పోరాటంలోనూ విజయం సాధిస్తారని దేశ వ్యాప్తంగా వామపక్ష శ్రేణులు, అభ్యుదయ శక్తులు ఆశించాయి. అయితే, ఆ ఆశలు ఫలించలేదు. సీతారాం ఏచూరి గురువారం మధ్యాహ్నం తుది శ్వాస విడిచినట్లు ఎయిమ్స్ వైద్యులు చేసిన ప్రకటన దేశ వ్యాప్తంగా దిగ్భ్రాంతిని కలిగించింది. విషయం తెలిసిన వెంటనే సమావేశమైన సిపిఎం పొలిట్‌బ్యూరో ఏచూరి మృతికి ప్రగాఢ సంతాపం ప్రకటించింది. దేశ వ్యాప్తంగా మూడు రోజుల పాటు పార్టీ కార్యక్రమాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. వామపక్షాలతో పాటు, అన్ని లౌకిక, ప్రజాతంత్ర పార్టీలు సంతాపం ప్రకటించాయి. భారత రాష్ట్రపతి, ప్రధానమంత్రి ప్రభృతులు సంతాపం తెలిపారు. ఏచూరి భౌతిక కాయాన్ని ఢిల్లీలోని వసంత కుంజ్‌లోని ఆయన నివాసానికి శుక్రవారం సాయంత్రం ఎయిమ్స్ నుండి తీసుకువెడతారు. శనివారం ఉదయం 11 గంటలకు సిపిఎం కేంద్ర కార్యాలయం ఎకెజి భవన్‌లో ప్రజల సందర్శనార్థం ఉంచుతారు. మధ్యాహ్నం మూడు గంటల తరువాత వైద్య పరిశోధనల కోసం ఏయిమ్స్‌లో ఆయన భౌతిక కాయాన్ని అప్పగిస్తారు.

నిబద్ధత కలిగిన సిద్ధాంతకర్త

- రాష్ట్రపతి ద్రౌపది ముర్మ



సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణవార్త తెలిసి విచారం చెందాను. తొలుత విద్యార్థి నాయకుడిగా, ఆ తరువాత జాతీయ రాజకీయాల్లో, పార్లమెంటేరియన్‌గా ఆయన తనదైన ప్రత్యేకతను చాటుకున్నారు. నిబద్ధత కలిగిన సిద్ధాంతకర్త అయినప్పటికీ, పార్టీలకు అతీతంగా ఏచూరి స్నేహితులను కలిగియున్నారు. ఆయన కుటుంబ సభ్యులకు, సహచరులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను.

వామపక్షాల వెలుగు రేఖ

- ప్రధాని మోడీ సంతాపం



సిపిఎం నేత సీతారాం ఏచూరి మృతి విచారకరం. రాజకీయాలతో నిమిత్తం లేకుండా అందరినీ కలుపుకుని పోయే స్వభావం ఆయన స్వంతం. వామపక్షాలకు మార్గనిర్దేశనం చేసే వెలుగు రేఖ. సమర్థవంతమైన పార్లమెంటేరియన్. ఈ విషాద సమయంలో ఆయన కుటుంబానికి, అభిమానులకు సంతాపం తెలియచేస్తున్నా.

అక్షర నివాళి

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి కన్నుమూయడం అత్యంత బాధాకరం. విద్యార్థి ఉద్యమంలోకి 1974లో అడుగిడి ఐదు దశాబ్దాలపాటు మొక్కవోని దీక్షతో ఎర్రబాటలో అగ్రభాగాన నిలిచిన యోధుడు 2024 సెప్టెంబర్ 12న అస్తమించాడు. చిన్ననాటి నుండి అధ్యయనానికి ఇచ్చిన ప్రాధాన్యతే జీవితంలో ఆయనను అగ్రస్థానానికి చేర్చింది. గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడు కావడంతోపాటు మార్క్సిస్టు సిద్ధాంతాన్ని ఔపోసన పట్టడానికి కీలకంగా నిలిచింది.

దేశాన్ని పెద్ద బందిఖానాగా మార్చిన ఎమర్జెన్సీ విధించిన ఆనాటి ప్రధాని ఇందిరిగాంధీని 'మీరు జెఎన్‌యు ఛాన్సలర్‌గా రాజీనామా చేయండి' అని విద్యార్థి దశలోనే జెఎన్‌యు అధ్యక్షునిగా ఆమెకు నేరుగా మెమోరాండం సమర్పించిన ధీరోదాత్తుడు ఏచూరి. శ్రమజీవుల సమస్యలపై ప్రజాక్షేత్రంలో పోరాడటంతోపాటు పార్లమెంటులోనూ ప్రజావాణిని సాధికారికంగా వినిపించి పాలకులను నిలదీశాడు. విద్యార్థి దశలోనే నిరంకుశత్వానికి ఎదురు తిరిగిన నాటి నుండి భారత రాజ్యాంగ మౌలిక స్వభావానికే ముప్పు వాటిల్లుతున్న నేటి వరకూ ఆయా కేంద్రంలోని ప్రజాకంటక ప్రభుత్వాలను గద్దె దించేందుకు జరిగిన అనేక ప్రయత్నాల్లో ఆయన కీలకపాత్ర వహించారు. యునైటెడ్ ఫ్రంట్ నుండి ఇటీవలి ఇండియా వేదిక వరకు వాటిని సమన్వయం చేయడంలో ఏచూరి కృషి ఆధునిక భారతదేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. ప్రజాస్వామ్యం, సెక్యులరిజం పరిరక్షణకు జరిగిన పోరాటాలు, ఉద్యమాల్లో ఏచూరి పాత్ర అద్వితీయమైనది. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) అగ్రనేతగా మాత్రమే గాక దేశంలోని యావత్ వామపక్ష శ్రేణులకూ ఆయన పెద్ద దిక్కు.

పన్నెండేళ్ల రాజ్యసభ సభ్యునిగా విశేష కృషి చేసిన ఆయనను ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు వరించింది. రాజ్యసభ చరిత్రలో ఎన్నడూలేని విధంగా రాష్ట్రపతి ప్రసంగానికి సవరణకు పట్టుబట్టి సాధించడం ఆయన నిబద్ధతకు, కార్యదక్షతకు నిదర్శనం. అంతర్జాతీయంగా సోషలిజం ఎదురుదెబ్బతిన్న నేపథ్యంలో మద్రాసులో జరిగిన సిపిఐ(ఎం) 14వ మహాసభలో సిద్ధాంత సమస్యలపై తీర్మానాన్ని ప్రవేశపెట్టడం సైద్ధాంతిక విషయాల్లో ఆయన ఎంత నిష్ణాతుడో విదితపరుస్తుంది. అనేక దేశాలు పర్యటించడం, అక్కడి విధానాల్ని అవగాహన చేసుకోవడం, వారి నుండి నేర్చుకోవడంతోపాటు వారికి అవసరమైన సాయం అందించడమూ ఆయన ప్రత్యేకత. నేపాల్ సంక్షోభ పరిష్కారానికి ఏచూరి సలిపిన కృషి ప్రపంచానికి ఎరుకే!

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన 'ఏచూరి సీతారాం మా తెలుగువాడు' అని చెప్పుకోవడం తెలుగు జాతికి గర్వకారణం. కాకినాడ నుండి ఢిల్లీ వరకు సాగిన ఆయన ప్రయాణం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలతోనూ ముడివడి వుంది.

ప్రజాశక్తి పురోగమనంలో సీతారాం ఏచూరికి ఎంతో అనుబంధం. తిరుపతి ఎడిషన్ ప్రారంభించింది ఆయనే. ఉమ్మడి రాష్ట్రంలో ప్రజాశక్తి (నేడు నవతెలంగాణ) ప్రధాన కార్యాలయం మోటూరు హనుమంతరావు భవనం ప్రారంభోత్సవంలో ముఖ్యఅతిథి ఆయనే! ప్రజాశక్తి దినపత్రికను చదవడంతోపాటు వివిధ సందర్భాల్లో వెలువరించిన ప్రత్యేక సంచికలనూ ఆయన పరిశీలించి కొన్నిసార్లు సూచనలు చేసేవారు.

ప్రజల శ్రేయస్సు కోసం అహరహం కృషి చేసిన కమ్యూనిస్టు యోధునికి ఇదే మా అక్షరాంజలి. ఆయన ఆశయాల సాధన కోసం సాగే ప్రజా ఉద్యమాలకు బాసటగా నిలవడమే 'ప్రజాశక్తి' ఆ విప్లవ యోధునికిచ్చే నివాళి.

సంపాదకుడు

సైద్ధాంతికవేత్త ఏచూరి

- సిపిఎం పొలిట్‌బ్యూరో ఘన నివాళి
- దోపిడీ రహిత సమాజం కోసం పోరాటాలను మరింత ముందుకు తీసుకెళ్ళాలని పిలుపు

న్యూఢిల్లీ : భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పట్ల పార్టీ పొలిట్‌బ్యూరో ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేసింది. తీవ్రమైన ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌తో పోరాడుతూ ఇక్కడి ఎయిమ్స్‌లో ఆయన గురువారం కన్నుమూశారు.

పార్టీ అగ్ర నేతల్లో ఒకరైన ఏచూరి వామపక్ష ఉద్యమ విశిష్ట నేతల్లో అగ్రగణ్యులు. ప్రముఖ మార్క్సిస్ట్ సిద్ధాంతకర్త కూడా. ఆర్థిక శాస్త్రంలో అండర్ గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్ రెండింట్లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైన తెలివైన విద్యార్థి. 1974లో జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీలో విద్యార్థి ఉద్యమంలో ఆయన చేరారు. ఆ తర్వాత ఎస్‌ఎఫ్‌ఐ నాయకుడయ్యారు. కేవలం రెండు సంవత్సరాల వ్యవధిలోనే జెఎన్‌యు విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా మూడు పర్యాయాలు ఎన్నికయ్యారు. 1984 నుండి 1986 వరకు ఎస్‌ఎఫ్‌ఐ అఖిల భారత అధ్యక్షుడిగా పనిచేశారు. విద్యార్థి సంఘాన్ని అఖిల భారత స్థాయిలో ఒక శక్తిగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర



ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రకాశ్ కరత్, ఎంఎ బేబి, సుభాషిణి ఆలీ ఇతర నాయకులు

పోషించారు.

1975లో సీతారాం ఏచూరి సిపిఎంలో చేరారు. ఆయన చేపట్టిన రాజకీయ కార్యకలాపాల కారణంగా ఎమర్జన్సీ సమయంలో అరెస్టయ్యారు. 1985లో పార్టీ 12వ మహాసభల్లో కేంద్ర కమిటీకి ఎన్నికైన ఆయన చివరి వరకు కొనసాగారు. 1989లో కేంద్ర కార్యదర్శివర్గానికి ఎన్నికయ్యారు. 1992లో పార్టీ 14వ మహాసభల్లో పొలిట్‌బ్యూరోకు ఎన్నికయ్యారు.

2015లో పార్టీ 21వ మహాసభల్లో సిపిఎం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ఏచూరి చివరి వరకు అదే పదవిలో కొనసాగారు. మూడు దశాబ్దాలకు పైగా కేంద్ర పార్టీ నాయకత్వ బృందంలో భాగంగా ప్రతీసారీ పలు అంశాలపై పార్టీ రాజకీయ వైఖరులను రూపొందించడంలో ముఖ్య భూమిక పోషించారు. సైద్ధాంతిక విభాగంలో సీతారాం ఏచూరి విశిష్టమైన పాత్ర పోషించారు. సోషలిజానికి ఎదురుదెబ్బలు తగలడంతో పార్టీ సైద్ధాంతిక వైఖరులను రూపొందించిన 14వ మహాసభల్లో నిర్దిష్టమైన సైద్ధాంతిక అంశాలపై పార్టీ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఈ తీర్మానాన్ని కామ్రేడ్ సీతారాం ఏచూరి రూపొందించి మహాసభ ముందుంచారు. ఆ తర్వాత, 2012లో పార్టీ 20వ మహాసభల్లో సైద్ధాంతిక వైఖరులను సవరించిన తీర్మానాన్ని మొదటగా బలపరిచింది కూడా ఏచూరే. తదనంతరం ఆ తీర్మానాన్ని మహాసభ

మిగతా2లో

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 43 | విజయవాడ, శుక్రవారం 13 సెప్టెంబర్ 2024 | 10 +8 పేజీలు : 5.50

Vol No | Vijayawada, Friday 13 September 2024 | Rs

కమ్యూనిస్టు దిగ్గజం ఏచూరి అస్తమయం

- ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌కు చికిత్స పొందుతూ ఎయిమ్స్‌లో తుదిశ్వాస
- పలువురు నేతల దిగ్భ్రాంతి
- భౌతికకాయం ఎయిమ్స్‌కు అప్పగింత



పార్టీ 21వ అఖిల భారత మహాసభ సందర్భంగా విశాఖలో నిర్వహించిన బహిరంగ సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఏచూరి, ఇతర అగ్రనేతలు

న్యూఢిల్లీ : కమ్యూనిస్టు పోరాట యోధుడు, సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఇక లేరని తెలియజేయడానికి చింతిస్తున్నాం. గత కొంతకాలంగా ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న ఏచూరి గురువారం న్యూఢిల్లీలోని ఎయిమ్స్‌లో తుదిశ్వాస విడిచారు. ఆయన వయస్సు 72 సంవత్సరాలు. ఏచూరి భౌతికకాయాన్ని ఆయన అభీష్టం మేరకు కుటుంబ సభ్యులు ఎయిమ్స్‌కు బోధన, పరిశోధన నిమిత్తం అప్పగించనున్నారు. న్యుమోనియాతో బాధపడుతున్న ఏచూరిని గత నెల 19వ తేదీన ఎయిమ్స్‌లో చేర్చారు. ఊపిరితిత్తులకు ఇన్‌ఫెక్షన్ సోకడంతో ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో ఉంచి చికిత్స అందించారు. ఆయన గత కొన్ని రోజులుగా వెంటిలేటర్ పై ఉన్నారు. వివిధ విభాగాలకు చెందిన వైద్య నిపుణులు ఏచూరికి మెరుగైన చికిత్స అందించినప్పటికీ పరిస్థితి విషమించి మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో కన్నుమూశారు. ఏచూరి భార్య సీమా చిస్తీ 'ది వైర్' పోర్టల్ సంపాదకురాలు. ఏచూరికి కుమార్తె అఖిల, కుమారుడు దానిష్ ఉన్నారు. ఏచూరి పెద్ద కుమారుడు ఆశీష్ కోవిడ్ బారీన పడి చనిపోయారు.

ప్రకాశ్ కరత్ స్థానంలో 2015లో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ఏచూరి అప్పటి నుండి ఆ బాధ్యతలలోనే కొనసాగుతున్నారు. పార్టీ నేత హరికిషన్ సింగ్ సూర్జిత్ నుండి ఎన్నో విషయాలు నేర్చుకున్న ఏచూరి సంకీర్ణ శకంలో ప్రధాన భూమిక పోషించారు. తొలుత విపి సింగ్ నేతృత్వంలోని నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం, ఆ తర్వాత 1996-97లో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం ఏర్పాటులో ఆయన క్రియాశీలక పాత్ర పోషించారు. ఈ రెండు ప్రభుత్వాలకూ సిపిఎం బయట నుండి మద్దతు ఇచ్చిన విషయం తెలిసిందే.

కాంగ్రెస్ నేతృత్వంలో తొలి యుపిఎ ప్రభుత్వం ఏర్పడినప్పుడు విధాన నిర్ణయాలలో ఏచూరి ముద్ర స్పష్టంగా కన్పించింది. అనేక ప్రజా సమస్యలపై ఆయన ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే వారు. భారత్-అమెరికా అణు ఒప్పందానికి వ్యతిరేకంగా ప్రభుత్వంతో జరిగిన చర్చలలో ఏచూరి కీలక పాత్ర పోషించారు. ఆ ఒప్పందం కారణంగానే యూపీఏ-1 ప్రభుత్వానికి వామపక్షాలు మద్దతు ఉపసంహరించాయి.

ప్రజలు, నేతల సందర్శనార్థం ఏచూరి భౌతికకాయాన్ని శనివారం గోల్ మార్కెట్‌లో ఉన్న సిపిఎం కేంద్ర కార్యాలయానికి తరలిస్తామని పార్టీ వర్గాలు వివరించాయి.

ప్రముఖుల దిగ్భ్రాంతి

ఏచూరి మృతిపై పలువురు నేతలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సీపీఐ (ఎం)కు ఏచూరి మూలస్తంభం వంటి వారని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ అభివర్ణించారు. తమ ఇద్దరి మధ్య మూడు దశాబ్దాల అనుబంధం ఉన్నదని గుర్తు చేశారు. రాజకీయ రంగం అంతటా ఆయనకు స్నేహితులు ఉన్నారని, ఆయన వ్యక్తిత్వాన్ని ఎందరో మెచ్చుకున్నారని తెలిపారు. 'మీరు త్వరగా మమ్మల్ని వదిలి వెళ్లారు. కానీ ప్రజా జీవితాన్ని సుసంపన్నం చేసుకున్నారు' అని అన్నారు.

ఏచూరి మృతి బాధాకరమని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ట్వీట్ చేశారు. ఆయన మృతి జాతీయ రాజకీయాలకు తీరని లోటని తెలిపారు. కమ్యూనిస్టు ఉద్యమంలో ఏచూరి అసమాన నాయకుడని ఏచూరి మరణంపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సంతాపం వ్యక్తం చేస్తూ ఆయన గొప్ప పార్లమెంటేరియన్ అని, ఆయన మేధస్సు, వాక్చాతుర్యం అందరికీ తెలిసినవేనని కొనియాడారు. ఆయనతో అనేక పర్యాయాలు ముచ్చటించానని గుర్తు చేసుకున్నారు. పీడీపీ అధినేత మెహబూబా ముఫ్తి కూడా ఏచూరి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

అభిషేక్ మను సింఘ్వి, నితిన్ గడ్కరీ, మనీష్ సిసోడియా, విజయ్ ప్రసాద్, పవన్ ఖెరా, షబ్నమ్ హష్మి, డాక్టర్ కఫీల్ ఖాన్, అభిషేక్ బెనర్జీ తదితర ప్రముఖులు కూడా ఏచూరి మృతికి సంతాపం తెలిపారు.

అతడు అస్తమించాడు

జీవించిన కాలమంతా ఉదయించి అతడు అస్తమించాడు. ఎత్తుకున్న ఎర్రజెండా సాక్ష్యం. ఈ దేశపు ప్రజలు సాక్ష్యం. ఈ దేశమే సాక్ష్యం. ఏనుగు కాళ్ల సామ్రాజ్యవాద కుంభ స్థలాన్ని గురి చూసి బద్దలుకొట్టడానికి బతికిన ఎర్ర జింక పిల్ల కామ్రేడ్ ఏచూరి.

అతడు దోపిడీ రహిత సమసమాజాన్ని కాగితాల నుంచి జీవితాల్లోకి తెచ్చేందుకు రాజకీయ యుద్ధం చేసిన ప్రజా నాయకుడు. మతోన్మాదులు, కార్పొరేట్లు పొత్తు కట్టి ప్రజల మీద పడుతుంటే అడ్డం పడ్డాడు. ప్రజల్ని ఎర్రజెండా నీడకు తెచ్చి రానివ్వండి చూసుకుందాం అని ధైర్యం చెప్పిన కాకలు తీరిన కమ్యూనిస్టు యోధుడు. పెట్టుబడి లూటీ చేసిన ప్రతి చోట, " దాస్ కేపిటల్" తట్టలోని రొట్టె ముక్కను పంచిపెట్టిన మార్క్సిస్టు సిద్ధాంత వేత్త. ఈ దేశం నెత్తిమీదకెక్కిన ఆరెస్సెస్, బిజెపిలను పక్కన కూర్చోబెట్టడానికి చివరి రోజుల్లోను లౌకిక, ప్రజాతంత్ర శక్తులను ఏకం చేసి "ఇండియా బ్లాక్" ఏర్పడడానికి చురుకైన పాత్ర వహించాడు.

ఈ దేశపు చరిత్ర పట్ల, సంస్కృతి పట్ల లోతైన అవగాహన ఉన్నవాడు. అర్థం చేసుకున్నవాడు. ఈ దేశపు ప్రజల పట్ల, ఈ దేశం పట్ల నిజమైన ప్రేమ ఉన్నవాడు కామ్రేడ్ సీతారాం ఏచూరి. తన అయిదు దశాబ్దాల రాజకీయ జీవితానికి డెబ్బయి రెండేళ్ల వ్యక్తిగత జీవితానికి సెలవు చెప్పాడు. గురువారం మధ్యాహ్నం గం.3.03 నిమిషాలకు కన్నుమూశాడు. ఆ మహాయోధుని అంతిమ యాత్ర శనివారం సాయంత్రం ఎకెజి భవన్ నుంచి ఎయిమ్స్ ఆస్పత్రి వరకు సాగుతుంది. అదే ఆస్పత్రికి తను కోరుకున్నట్లుగా కుటుంబ సభ్యులు ఆయన భౌతిక కాయాన్ని అప్పగిస్తారు.

బోధన, పరిశోధనకు ఏచూరి భౌతిక కాయం

రేపు ఎయిమ్స్‌కు అప్పగింత

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి భౌతిక కాయాన్ని బోధన, పరిశోధన నిమిత్తం ఎయిమ్స్‌కు అప్పగించనున్నారు. సీతారాం ఏచూరి భౌతిక కాయానికి ఎయిమ్స్ వైద్యులు ఎంబామింగ్ చేసిన అనంతరం నేడు (శుక్రవారం) సాయంత్రం గంటలకు కుటుంబ సభ్యులకు అప్పగిస్తారు. ఎయిమ్స్ నుంచి వసంత్ కుంజ్‌లోని ఆయన నివాసానికి భౌకతిక కాయాన్ని తీసుకెళ్తారు. కుటుంబ సభ్యులు, బంధువుల సందర్శనార్థం అక్కడ ఉంచుతారు. శనివారం ఉదయం 11 గంటలకు సిపిఎం కేంద్ర కార్యాలయం (ఎకెజి భవన్) ఏచూరి భౌతిక కాయాన్ని తీసుకు వస్తారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, వివిధ పార్టీల నేతలు, శ్రేయోభిలాషుల సందర్శనార్థం మధ్యాహ్నం 3 గంటల వరకు అక్కడే ఉంచుతారు. అక్కడ నుంచి ఎయిమ్స్‌కు అంతిమ యాత్రగా తరలించి వైద్యులకు అప్పగిస్తారు.

ఏచూరి ఘన నివాళి

సీతారాం ఏచూరికి సిపిఎం నేతలు ఘన నివాళు లర్పించారు. గురువారం పార్టీ కేంద్ర కార్యాలయం (ఎకెజి భవన్)లో ఏచూరి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్, బృందా కరత్, బివి రాఘవులు, సుభాషిణీ అలీ, తపన్ సేన్, ఎంఎ బేబి, ఎ.విజయరాఘవన్, కేంద్ర కమిటీ సభ్యులు కె.హేమలత, ఆర్. అరుణ్ కుమార్, బి.వెంకట్, ఎఆర్ సింధూ, మురళీధరన్, విక్రమ్ సింగ్, పార్టీ కార్యాలయ సిబ్బంది తదితరులు నివాళు లర్పించారు.

మూడు రోజుల పాటు సంతాప దినాలు
వారం రోజులు పాటు పార్టీ జెండా అవనతం

సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి సంతాపం తెలుపూ మూడు రోజుల పాటు సంతాప దినాలు, వారం రోజులు పాటు పార్టీ జెండా అవనతం చేయాలని దేశంలో అన్ని రాష్ట్ర కమిటీలకు సిపిఎం కేంద్ర కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్ ప్రకటన విడుదల చేశారు. పార్టీ కార్యక్రమాలన్నింటిని రద్దు చేసుకోవాలని సూచించారు.

కమ్యూనిస్టు, ప్రజాతంత్ర, లౌకిక ఉద్యమాలకు తీరని లోటు

ఏచూరి మరణంపై వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సీతారాం ఏచూరి అకాల మరణం భారత కమ్యూనిస్టు ఉద్యమానికి, ప్రజాతంత్ర-లౌకిక ఉద్యమాలకు తీరని లోటు అని సిపిఎం రాష్ట్రకార్యదర్శి వి.శ్రీనివాసరావు తన ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు కలిగిన కొద్దిమంది కమ్యూనిస్టునాయకులలో ఆయన ఒకరు. శ్రీనివాసరావు తన సంతాప సందేశంలో 'కామ్రేడ్ ఏచూరి గారిని 1977లో మొదటిసారి ఢిల్లీలో ఏచూరిని చూశాను. అప్పటికీ ఆయన విద్యార్థి నాయకుడిగా అందరికీ సుపరిచితులు.

1984 నుంచి ప్రత్యక్ష పరిచయం ఉంది. 2005 నుంచి ఢిల్లీలో సెంట్రల్ సెక్రటేరియట్ సభ్యునిగా ఆయనతో సన్నిహితంగా కలిసి పనిచేసే అవకాశం లభించింది. ఆయన నాయకత్వంలో పలు ప్రజా రంగాలకు నేను సహాయపడ్డాను. ఆయన ప్రత్యక్ష మార్గదర్శకత్వంలో కేంద్ర బాధ్యతల్లో పనిచేశాను. ఆయనతో కలిసి పనిచేసిన అన్ని సందర్భాల్లో పలు జ్ఞాపకాలు, అనుభవాలు నన్ను వెన్నంటి ఉన్నాయి. వారికి నా జోహార్లు. వారి సతీమణి సీమా చిష్టి, కుమార్తెలకు సానుభూతి' అని పెర్కొన్నారు.

ప్రజాసమస్యలపై రాజీ లేని పోరాటం

గవర్నర్, సిఎం ప్రభృతుల సంతాపం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేశ రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్న సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి మరణం పట్ల పలువురు ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దేశ రాజకీయాల్లో ఆయన పాత్రను కొనియాడుతూ, ఆయనతో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకొంటూ 'ఎక్స్'లో పోస్టులు పెడుతున్నారు.

రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ సంతాపం

రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ సీతారాం ఏచూరి మరణం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఏచూరి కుటుంబ సభ్యులు మనోధైర్యంతో వుండాలని తన ప్రగాఢ సంతాపాన్ని ఎక్స్ ద్వారా ట్వీట్ చేశారు.

ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేసిన మేధావి : సిఎం చంద్రబాబునాయుడు

సీతారాం ఏచూరి మరణం తీవ్రంగా కలచివేసింది. భారత రాజకీయాల్లో ఆయన గౌరవస్థానం పొందారు. ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేసిన మేధావి. అట్టడుగు వర్గాల ప్రజలతో మంచి అనుబంధం ఉన్న నేత. విశాల దృక్పథంతో కూడిన రాజకీయ చర్చలు పార్టీలకు అతీతంగా ఆయనకు గుర్తింపు తీసుకొచ్చాయి.

ఉత్తమ పార్లమెంటేరియన్‌ను కోల్పోవడం తీరని లోటు - హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ

దేశ రాజకీయాలలో విలువలతో పాటు రాజ్యసభ సభ్యునిగా దేశాభివృద్ధికి, ప్రజల జీవన ప్రమాణాల పెంపు కోసం సీతారాం ఏచూరి చేసిన కృషి చాలా గొప్పది. దేశం ఒక ఉత్తమ పార్లమెంటేరియన్‌ను కోల్పోయింది. అట్టడుగు వర్గాల జీవన ప్రమాణాలు పెరగాలని పరితపించిన గొప్ప నాయకుడు.

దేశంలో ప్రతిపక్షాల ఐక్యతకు కృషి చేసిన గొప్ప నాయకుడు : సుప్రీం కోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎన్‌వి రమణ

విద్యావేత్త, నిగర్వి, మృధు స్వభావి, బలహీన వర్గాల గొంతుకగా తను నమ్మిన సిద్ధాంతం కోసం రాజీలేని పోరాటం చేసిన సీతారాం ఏచూరి దేశంలో ప్రతిపక్షాల ఐక్యతకు కృషి చేయడంలో అగ్రపీఠాన నిలిచారు. ఆయన మృతి జాతీయ రాజకీయాలకు తీరని లోటు. తెలుగు ప్రజల సమస్యల పరిష్కారానికి ముందుండి గళం విప్పేవారు, ఆయన మరణం తెలుగు రాష్ట్రాలకు తీరని నష్టం.

అట్టడుగు వర్గాల జీవన ప్రమాణాలు పెరగాలని పరితపించే నాయకుడు : అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు

దేశంలో నీతివంతమైన పరిపాలన, అట్టడుగు వర్గాల జీవన ప్రమాణాలు పెరగాలని పరితపించిన గొప్ప నాయకుడు సీతారాం ఏచూరి. దేశాభివృద్ధిని కాంక్షించే యువతరం రాజకీయాల్లో వుండాలని కోరుకునే వారు. ఆర్థిక వేత్తగా, సామాజిక వేత్తగా దేశంలో బలమైన ముద్ర వేసుకున్న ఏచూరి లేని లోటు పూడ్చలేనిది.

వామపక్ష యోధుడు ఏచూరి : ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

విద్యార్థి దశ నుండే వామపక్ష భావజాలంతో మొదలైన ఏచూరి రాజకీయ ప్రస్థానంలో ప్రతి అడుగు పేద ప్రజలు, బాధితులు, కార్మికుల పక్షాన నిలిచారు. దేశ విదేశాంగ విధానం, విద్యావిధానం, ఆర్థిక అంశాలు లాంటి వాటిపై తన ఆలోచనలకు అక్షర రూపం ఇచ్చి ఆదర్శనీయులయ్యారు. ఆయన మరణం పేదవారికి, కార్మిక వర్గానికి తీరని లోటు

అమర్ రహే కామ్రేడ్ సీతారాం ఏచూరి : రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్

సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం తీవ్ర విషాదం నింపింది. ప్రజా పోరాట యోధుడిని కోల్పోయాం. ప్రజా ఉద్యమాలకే జీవితం అంకితం చేసిన వారికి కన్నీటి నివాళులర్పిస్తున్నాను. అమర్ రహే కామ్రేడ్ సీతారాం ఏచూరి అంటూ నారా లోకేష్ ఎక్స్‌లో ట్వీట్ చేశారు.

దేశ ప్రగతి కోసం పరితపించిన ఏచూరి : వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

జీవితాంతం వామపక్ష భావాలతో గడిపిన సీతారాం ఏచూరి దేశ ప్రగతి కోసం నిర్విరామంగా చొరవ చూపారు. కాకినాడకు చెందిన ఏచూరి అంచెలంచెలుగా ఎదిగి సిపిఎం పార్టీలో అత్యున్నత విధాన నిర్ణాయక పొలిట్‌బ్యూరో సభ్యులుగా, పార్టీ ప్రధాన కార్యదర్శిగానూ ఎదిగారు. ఆయన మృతి దేశరాజకీయాలకు తీరని లోటు.

ఇండియా వేదిక ఏర్పాటులో ఏచూరిది కీలక పాత్ర : పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల

దేశంలో 2004లో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటులోగాని, ఇప్పుడు ఇండియా వేదిక ఏర్పాటులోగాని సీతారాం ఏచూరి పాత్ర అద్వితీయం. ఆయన మరణం ఇండియా వేదికకు తీరని నష్టం.

సీతారాం ఏచూరి పేదల పక్షపాతి : మాజీ కేంద్ర మంత్రి చింతామోహన్

సీతారాం ఏచూరి తనకు వ్యక్తిగతంగా మంచి స్నేహితుడు. ఆయన అనుక్షణం పేదల సంక్షేమానికి పాటు పడుతూ పేదల పక్షపాతిగా మిగిలారు. ఆయన మృతి దేశరాజకీయాలకు తీరని లోటు

ప్రముఖ సినీ హీరో హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, తెలుగుదేశం రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు, మాజీ ఎంపి కంభంపాటి రామ్మోహన్‌రావు, సత్తెనపల్లి మాజీ ఎమ్మెల్యే పుతుంబాక భారతి, సాహితీ స్రవంతి గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి, రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్, సత్యరంజన్‌లు సీతారాం ఏచూరి మృతి పట్ల తమ ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు.

స్థితప్రజ్ఞుడిని కోల్పోయాం

సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు

సీతారాం ఏచూరిని కోల్పోవడం బాధాకరం. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. దేశ రాజకీయాల్లో ఒక స్థిత ప్రజ్ఞుడిని కోల్పోయాం. అలాంటి నేతలను మళ్లీ తయారు చేసుకోవడమే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి.

దూరదృష్టి గల నాయకుడు

సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా

ఏచూరి నిష్ఠాతుడైన నాయకుడు, రచయిత, దూరదృష్టి గల నాయకుడు. ఆయన మరణం వామపక్ష, ప్రజాతంత్ర ఉద్యమానికి తీరని లోటు. దేశంలో వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల ఐక్యతను బలోపేతం చేసేందుకు కృషి చేశారు. సమకాలీన కాలంలో వామపక్ష ఉద్యమంలో అత్యుత్తమ నాయకుల్లో ఒకరు.

ఏచూరి లేని కొరత పూడ్చలేనిది

సిపిఎం రాష్ట్రకమిటీ సంతాపం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సీతారాం ఏచూరి లేని కొరత పూడ్చలేనిదని సిపిఎం రాష్ట్రకమిటీ తీవ్ర సంతాపం ప్రకటించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మరింత బలమైన ప్రజా ఉద్యమాల ద్వారా ఏచూరి లేని కొరతను అధిగమించేలాగా కృషి చేస్తామని రాష్ట్రకమిటీ వెల్లడించింది. సీతారాం భారతదేశంలోని కమ్యూనిస్టులకే కాదని, దేశంలోని వామపక్ష ప్రజాస్వామ్య, లౌకికశక్తులందరికీ స్ఫూర్తిప్రదాత అని తెలిపింది. పార్లమెంటు సభ్యుడిగా ఆయన చేసిన ఉపన్యాసాలు దేశాభివృద్ధికై అందులో తపన, ప్రజలందరి ఐక్యత కోసం చేసిన కృషి చిరస్థాయిగా ఉంటాయని పేర్కొంది. అంతర్జాతీయంగా కూడా ఒక గొప్ప మార్క్సిస్టుగా గుర్తింపు పొందిన వ్యక్తి అని కొనియాడింది. అనేక దేశాల కమ్యూనిస్టు పార్టీల నాయకులు ఆయనతో చాలా సన్నిహిత స్నేహ సంబంధాలను కలిగి ఉండేవారని వివరించింది. 2024 మేలో జరిగిన ఎన్నికల్లో మూడు రోజులపాటు విజయవాడతో సహా పలు జిల్లాల్లోని సభల్లో పాల్గొన్నారని తెలిపింది. పర్యటించిన అన్నిచోట్లా కిందిస్థాయి కార్యకర్త వరకు ఆయనకు అనుబంధ ఉందని వివరించింది. వారం రోజులపాటు కమ్యూనిస్టు కార్యాలయాలన్నింటా పార్టీ పతాకాలను అవనతం చేసి సంతాప దినాలుగా పాటించాలని విజ్ఞప్తి చేసింది. రాష్ట్రకమిటీ తరపున సీనియర్ నాయకులు పి మధు, కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు ఈ నెల 14వ తేదీన ఢిల్లీలోని ఏచూరి భౌతికకాయానికి నివాళులర్పించి అంతిమయాత్రలో పాల్గొంటారని వెల్లడించింది.

ప్యాకేజీలతో విభజన నష్టాలను పూడ్చలేరు

- కాంగ్రెస్, బిజెపి మ్యాచ్ ఫిక్సింగ్‌తో విభజన
- ఎపి పునర్వ్యవస్థీకరణ బిల్లుపై రాజ్యసభలో చర్చ సందర్భంగా ఏచూరి



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

రాష్ట్ర విభజన నష్టాలను ప్యాకేజీలతో భర్తీ చేయజాలరని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో దాదాపు దశాబ్దం క్రితమే సీతారాం ఏచూరి స్పష్టం చేశారు. 2014 ఫిబ్రవరి 20న రాజ్యసభలో చారిత్రాత్మక ఎపి పునర్వ్యవస్థీకరణ బిల్లుపై చర్చ సందర్భంగా ఏచూరి చేసిన ఉద్ఘాటన నేటికీ అవశేష ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విషయంలో కొనసాగుతూనే ఉంది. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులుగా, అనంతరం పార్టీ ప్రధాన కార్యదర్శిగా పని చేసిన సీతారాం ఏచూరి 2005- 2017 మధ్య రెండు పర్యాయాలు రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఎపి విభజన బిల్లుపై రాజ్యసభలో చర్చ సందర్భంగా ఆయన ఏమన్నారంటే... రాష్ట్ర విభజన బిల్లును నేను, మా పార్టీ వ్యతిరేకిస్తోంది. ఈ విభజన కేంద్రంలో అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్ష బిజెపి మధ్య మ్యాచ్ ఫిక్సింగ్‌తో జరుగుతోంది. ఎపి విభజన భాషా ప్రయుక్త రాష్ట్రాలకు వ్యతిరేకం. రాజ్యాంగంలో మన దేశాన్ని రాష్ట్రాల యూనియన్‌గా పేర్కొన్నారు. దేశ ఐక్యతను భాషా ప్రయుక్త రాష్ట్రాలే ఐక్యంగా ఉంచగలవు. తెలుగు మాట్లాడే వారితో రాష్ట్రం ఏర్పడాలన్న ఆంకాంక్షలతో జరిగిన పలు ఉద్యమాల ఫలితంగా పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ కారణంగా ఏర్పడింది. అనంతరం దేశంలో తెలుగు మాట్లాడే వారందరితో విశాల ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. ఒకే భాష కలిగిన రాష్ట్రాన్ని రెండుగా విభజిస్తే భవిష్యత్తులో దేశ ఐక్యత దెబ్బతింటుంది. ఐక్య మహారాష్ట్ర, ఐక్య కేరళ, గూర్ఖాలాండ్ వంటి డిమాండ్లు ముందుకొచ్చే ప్రమాదం ఉంది. ఎపి విభజన అంటే తేనెతుట్టెను కదిలించడం వంటిది. ఆ కాంగ్రెస్ పార్టీ మూడవ సారి అధికారం కోసం ఎపిని విభజిస్తోంది. గతంలో యుపిఎ-1, యుపిఎ-2 ప్రభుత్వాలు ఏర్పడటానికి ఉమ్మడి ఎపి నుంచి అధిక సీట్లు ఆ పార్టీకి వచ్చాయి. ప్రస్తుతం తగ్గే పరిస్థితులున్నాయి. ఆ నష్టాన్ని భర్తీ చేసుకోడానికి రాష్ట్ర విభజన చేపట్టింది. కాంగ్రెస్, బిజెపి మ్యాచ్ ఫిక్సింగ్‌తోనే విభజన జరుగుతోంది. ఈ పార్టీలూ ప్యాకేజీలతో విభజన వలన కలిగే నష్టాలను పూడ్చాలని చెబుతున్నాయి. దేశ మంటే మట్టి, సంపద కాదు, మనుషులని తెలుగునాట ప్రఖ్యాత రచయిత గురజాడ అప్పారావు చెప్పారని గుర్తుంచుకోవాలి. రాష్ట్ర విభజనపై వెంకయ్యానాయుడు గారు తప్పుగా చెబుతున్నారు.

నాడు జై ఆంధ్రా ఆందోళనల బాధితుడిని. నేను రెండేళ్ల విద్యా కాలాన్ని నష్టపోయాను. బిల్లుకు ఏవో సవరణలు, హామీలు, ప్యాకేజీలు అంటున్నారు. రాష్ట్ర విభజనను వ్యతిరేకిస్తున్నాం. సభలో బిల్లుపై ఓటింగ్ (డివిజన్) పెట్టాలి... అని ఏచూరి డిమాండ్ చేశారు. అంతకుముందు ఫిబ్రవరి 18న లోక్‌సభలో ఉద్రిక్త వాతావరణం మధ్య తలుపులేసి మరీ మూజువాణి ఓటుతో బిల్లును ఆమోదించారు. రాజ్యసభలో కొద్ది మేర చర్చ జరిగింది. ఆ సమయంలో పలుమార్లు ఏచూరి ఓటింగ్ కోసం పట్టు బట్టారు. ఓటింగ్‌కు అనుమతించలేనని, సభ ఆర్డర్‌లో లేదని, వెల్‌లో సభ్యులు నించున్నారని సభాధ్యక్ష స్థానంలో ఉన్న డిప్యూటి ఛైర్మన్ చెప్పారు. తాము బిల్లును వ్యతిరేకిస్తున్నామని, నిరసనను రిజిస్టర్ చేసి వాకౌట్ చేస్తామని ఏచూరి పలుమార్లు కోరారు. అందుకు డిప్యూటి ఛైర్మన్ అనుమతించకపోవడంతో గందరగోళం మధ్య ఏచూరి, సిపిఎం సభ్యులు వాకౌట్ చేసి సభ నుంచి వెళ్లిపోయారు. అనంతరం ఓటింగ్ లేకుండానే బిల్లు పాసైంది.

సైద్ధాంతికవేత్త ఏచూరి

(మొదటిపేజీ తరువాయి)

ఆమోదించింది.

పార్టీ కేంద్ర కమిటీ అంతర్జాతీయ విభాగాధిపతిగా ఏచూరి వివిధ అంతర్జాతీయ కమ్యూనిస్టు, ప్రగతిశీల శక్తుల వేదికలపై పాల్గొన్నారు. సోషలిస్టు దేశాలతో సంబంధాలను బలోపేతం చేశారు. సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాలకు సంఘీభావం ప్రకటించారు.

పార్టీ వీక్లీ పీపుల్స్ డెమోక్రసీకి సంపాదకులుగా కూడా ఏచూరి రెండు దశాబ్దాల పాటు వ్యవహరించారు. ఆయన స్వయంగా మంచి రచయిత కూడా. సైద్ధాంతిక విభాగంలో ఆయన అందించిన ఇతర ప్రధానమైన సేవల్లో హిందూత్వపై ఆయన చేసిన విమర్శ ఒకటి. ఏచూరి రాసిన పుస్తకాలు - వాటీజ్ దిస్ హిందూ రాష్ట్ర?, కమ్యూనలిజం వర్సెస్ సెక్యులరిజం- ల్లో ఇది ప్రచురితమైంది.

2005 నుండి 2017 వరకు రెండుసార్లు ఆయన రాజ్యసభ సభ్యుడిగా వున్నారు. సిపిఎం గ్రూపు నాయకుడిగా వున్న ఆయన సమర్ధవంతమైన పార్లమెంటేరియన్. 2017లో ఆయనకు ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు లభించింది.

ఇటీవలి కాలంలో సీతారాం ఏచూరి, లౌకిక ప్రతిపక్ష పార్టీల మధ్య విస్తృత ఐక్యత కోసం తన సమయాన్ని, శక్తిని ప్రధానంగా వెచ్చించారు. అంతిమంగా అది ఇండియా బ్లాక్‌గా రూపుదిద్దుకుంది. యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వ హయాంలో, తర్వాత వచ్చిన యుపిఎ ప్రభుత్వ కాలంలో ఈ సంకీర్ణాలకు మద్దతిచ్చిన సిపిఎం పార్టీకి కీలకమైన అనుసంధాన కర్తల్లో ఒకరిగా ఏచూరి వున్నారు.

ఏచూరికి వున్న స్నేహపూర్వక స్వభావం వల్ల అన్ని రాజకీయ పార్టీల్లో, అన్ని రంగాలకు చెందిన వారిలో ఆయనకు విస్తృత సంఖ్యలో మిత్రులు వున్నారు. ఏచూరికి వున్న రాజకీయ సమగ్రత, అంకిత భావం చూసి వారందరూ ఎంతగానో గౌరవించేవారు.

దేశ జాతీయ రాజకీయాలు కీలకమైన మలుపులో వున్న ఈ తరుణంలో సీతారాం ఏచూరి అకాల మరణం సిపిఎంకి పెద్ద ఎదురుదెబ్బ. మొత్త వామపక్ష, ప్రజాస్వామ్య, లౌకికవాద శక్తులకు తీరని నష్టం.

తమ ప్రియతమ సహచరునికి పొలిట్‌బ్యూరో ఘనంగా నివాళి అర్పిస్తోంది. ఆయన స్మృత్యర్థం అరుణ పతాకాన్ని అవనతం చేశారు. దోపిడి రహిత సమాజం కోసం జరిపే పోరాటాన్ని మరింత ముందుకు తీసుకెళ్ళేందుకు సమైక్యంగా, మరింత కఠోరంగా కృషి చేయాలని పార్టీ కార్యకర్తలకు పొలిట్‌బ్యూరో పిలుపిచ్చింది. అదే ఆయనకు మనం అందించగల ఉత్తమ నివాళి కాగలదని పేర్కొంది.

ఏచూరి భార్య సీమా, కుమార్తె అఖిల, కుమారుడు డానిష్, సోదరుడు శంకర్, ఇతర కుటుంబ సభ్యులకు తీవ్ర సంతాపాన్ని, సానుభూతిని పొలిట్‌బ్యూరో తెలియచేసింది.



ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

అందరి మన్ననలు పొందిన సీతారాం ఏచూరి

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి-గుడివాడ

కమ్యూనిస్టు నేత సీతారాం ఏచూరి మృతి బాధాకరమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. కృష్ణాజిల్లా గుడివాడ నెహ్రూచౌక్ సెంటర్‌లో సీతారాం ఏచూరి సంతాప సభ సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం జరిగింది.

ఈ కార్యక్రమంలో రామకృష్ణ పాల్గొని మాట్లాడారు. తొలుత ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులతో గౌరవించబడిన ఏకైక వ్యక్తి ఏచూరి అని అన్నారు. ప్రజా సమస్యలపై బలమైన వాయిస్ వినిపించే నాయకుడిని కోల్పోవడం బాధాకరమని తెలిపారు.

ఏచూరి మృతికి ప్రజాసంఘాల సంతాపం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతిపట్ల పలు ప్రజా సంఘాలు సంతాపం ప్రకటించాయి. ఈ మేరకు ఆయా సంఘాల నేతలు విడివిడిగా గురువారం పత్రికా ప్రకటనలు విడుదల చేశారు. ఏచూరి ఐదు దశాబ్దాలకు పైగా కార్మికవర్గ నాయకుడిగా సమాజ మార్పుకు కృషి చేశారని సిఐటియు రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నర్సింగరావు వెల్లడించారు. ఏచూరి తన ప్రజా జీవితాన్ని ఎస్‌ఎఫ్‌ఐ నాయకుడిగా ప్రారంభించారని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎ అశోక్, కె ప్రసన్న కుమార్ తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు వి కృష్ణయ్య, పి ప్రభాకర్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వి వెంకటేశ్వర్లు, దడాల సుబ్బారావు, ప్రజానాట్యమండలి అధ్యక్ష కార్యదర్శులు పి మంగరాజు, ఎస్ అనిల్ కుమార్, ఎపి కౌలు రైతుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు వై రాధాకృష్ణ, ఎం హరిబాబు, ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎం భాస్కరయ్య, కెవిపిఎస్ ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి, డివైఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులు వై రాము, జి రామన్న, యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎజిఎస్ గణపతి, కె ప్రకాష్ రావు సంతాపం ప్రకటించారు.

ఏచూరి మృతి ప్రగతిశీల సాహిత్య కళారంగాలకు తీరని లోటని సాహితీ స్రవంతి రాష్ట్ర గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి అన్నారు. స్రవంతి ప్రారంభరోజుల్లో విజయవాడలో జరిగిన అవగాహనా తరగతలకు హాజరై, కర్తవ్య నిర్దేశం చేశారని గుర్తు చేసుకున్నారు. సిపిఎం కేంద్రకమిటీ మాజీ సభ్యులు పాటూరు రామయ్య సంతాపం తెలియజేశారు.

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 43 | విజయవాడ, శుక్రవారం 13 సెప్టెంబర్ 2024 | 10 + 8 పేజీలు : 5.50

Vol No | Vijayawada, Friday 13 September 2024 | Rs

30 వరకు ఉద్యోగుల బదిలీలు

గడువు సవరించిన ప్రభుత్వం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఉద్యోగుల బదిలీల నిషేధంపై సడలింపును ఈ నెలాఖరు వరకు పొడిగిస్తూ రాష్ట్ర ఆర్థికశాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సడలింపు ప్రక్రియ ఈ నెల 22 వరకు కొనసాగించాలని ముందుగా నిర్ణయించగా, నెలాఖరు వరకు పొడిగించాలని తాజాగా నిర్ణయించారు. అక్టోబర్ ఒకటి నుంచి తిరిగి నిషేధం అమలులోకి వస్తుందని ఆర్థికశాఖ పేర్కొంది. పలు ఉద్యోగ సంఘాల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఈ సడలింపును పొడిగించడం గమనార్హం.

సెస్‌లు, సర్‌ఛార్జీలపై పరిమితులు

- వనరుల పంపిణీలో న్యాయమైన విభజన
- కేరళలో ఆర్థిక మంత్రుల సమావేశం డిమాండ్

తిరువనంతపురం : కేంద్రం విధించే సెస్‌లు, సర్‌ఛార్జీలపై పరిమితులు విధించాలని, రాష్ట్రాలకు పంపిణీ చేసే వనరుల్లో సమానమైన, న్యాయమైన విభజన ఉండాలని కేరళలో జరిగిన వివిధ రాష్ట్రాల ఆర్థిక మంత్రుల సమావేశం స్పష్టం చేసింది. కేంద్రం-రాష్ట్రాల ఆర్థిక సంబంధాల్లో పెరుగుతున్న అసమతుల్యతపై సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది. ముఖ్యంగా 'ఉత్తమ పనితీరు' ప్రదర్శించే రాష్ట్రాలను కేంద్రం 'శిక్షించడం' ఆపాలని పేర్కొంది. డివిజిబుల్ పూల్‌లో ఉన్న రాష్ట్రాల వాటాను 41 శాతం నుంచి 50 శాతానికి పెంచాలని సమావేశం డిమాండ్ చేసింది. కేంద్ర ప్రభుత్వ ప్రయోజిత పథకాలను తగ్గించాలని విజ్ఞప్తి చేసింది. 16వ ఆర్థిక సంఘం సందర్భంగా కేరళ ప్రభుత్వం ఈ సమావేశం ఏర్పాటు చేసింది. బిజెపియేతర ప్రభుత్వాలు ఉన్న ఐదు రాష్ట్రాల మంత్రులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. కేరళతో పాటు తెలంగాణ, కర్ణాటక, పంజాబ్, తమిళనాడు మంత్రులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సమావేశాన్ని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయన్ మాట్లాడుతూ '16వ ఆర్థిక కమిషన్ తన సిఫార్సులను రూపొందించేటప్పుడు కేంద్రం వసూలు చేస్తున్న సెస్‌లు, సర్‌ఛార్జీల్లో భారీ పెరుగుదలను పరిగణనలోకి తీసుకోవాలి' అని తెలిపారు. 'గత 10 ఏళ్లలో సర్‌ఛార్జ్‌లు, సెస్‌ల పెరుగుదల్లో భారీ వృద్ధి నమోదయింది. ఇవి ప్రస్తుత కేంద్రం యొక్క స్థూల పన్ను ఆదాయంలో ఇవి ఐదో వంతుకు చేరుకున్నాయి. దాని పర్యవసానమే డివిజిబుల్ పూల్ ఆఫ్ ట్యాక్స్ కుచించుకుపోయింది' అని విజయన్ అన్నారు. కేంద్రం ద్వారా వసూలు చేస్తున్న పన్నుల్లో రాష్ట్రాలకు అధిక వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. 1976 జాతీయ జనాభా విధానం యొక్క లక్ష్యాలను సాధించిన రాష్ట్రాల ప్రయోజనాలను, అలాగే తక్కువ తలసరి ఆదాయంతో జనాభా అధికంగా ఉన్న రాష్ట్రాల ప్రయోజనాలను 'సమతుల్యం' చేయాల్సిన బాధ్యత 16వ ఆర్థిక కమిషన్‌పై ఉందని అన్నారు. ఈ సున్నితమైన బ్యాలెన్సింగ్ చర్యలో పన్నుల పంపిణీ సూత్రాన్ని 16వ ఆర్థిక కమిషన్ జాగ్రత్తగా అర్థం చేసుకోవాలని, అలాగే రాష్ట్రాలకు గ్రాంట్లు పంపిణీ చేయడానికి ఆర్టికల్ 275 యొక్క రాజ్యాంగ నిబంధనలను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన కేరళ ఆర్థిక మంత్రి కెఎస్ బాలగోపాల్ మాట్లాడుతూ దేశంలో సహకార సమాఖ్యవాదం సంక్షోభాన్ని ఎదుర్కొంటుందని, ఇది 'సబార్డినేట్ ఫెడరలిజయం' లేదా 'బలవంతపు సమాఖ్యవాదం'గా మారుతోందని విమర్శించారు. దేశ ఆర్థిక వ్యవస్థలో అసమతుల్యతను దేశం దృష్టికి తీసుకుని వెళ్లడమే ఈ సమావేశం ఉద్దేశమని తెలిపారు. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ దేశంలో నిజమైన సమాఖ్య వ్యవస్థను నెలకొల్పేందుకు కేంద్రం-రాష్ట్రాల మధ్య అధికార సమతుల్యతను పున:పరిశీలించాలని పిలుపునిచ్చారు. తమిళనాడు ఆర్థిక మంత్రి తంగం తెన్నరసు మాట్లాడుతూ డివిజిబుల్ పూల్‌లో ఉన్న రాష్ట్రాల వాటాను 50 శాతానికి తక్షణమే పెంచాలని డిమాండ్ చేశారు. కర్ణాటక రెవెన్యూ మంత్రి కృష్ణ బైరే గౌడ మాట్లాడుతూ కేంద్రం స్థూల పన్ను ఆదాయంలో సెస్‌లు, సర్‌ఛార్జీల వాటాను 5 శాతానికి పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. పంజాబ్ ఆర్థిక మంత్రి హర్పాల్ సింగ్ చీమా మాట్లాడుతూ జిఎస్‌టిని ప్రవేశ పెట్టడం రాష్ట్రాల ఆర్థిక స్వయంప్రతిపత్తిపై తీవ్ర ప్రభావం చూపిందని అన్నారు. కేరళ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత విడి సతీశన్ కూడా ఈ సమావేశంలో ప్రసంగించారు. మధ్యాహ్నం సెషన్‌లో జరిగిన ప్రత్యేక చర్చలో కేంద్ర ప్రభుత్వ మాజీ ముఖ్య ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ కీలకోపన్యాసం చేశారు. అలాగే ఐదు రాష్ట్రాలకు చెందిన సీనియర్ బ్యూరోక్రాట్లు, ఆర్థిక శాఖ అధికారులు, ప్రముఖ ఆర్థికవేత్తలు, ప్రణాళికా నిపుణులు కూడా ఈ సమావేశంలో ప్రసంగించారు.

ఆ వెయ్యి స్కూళ్లల్లో రాష్ట్ర సిలబస్

- వచ్చే విద్యాసంవత్సరం పరీక్షల విధానంలో మార్పు
- విద్యాశాఖమంత్రి లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సిబిఎస్ఇ సిలబస్‌ను ప్రవేశపెట్టిన వెయ్యి పాఠశాలల్లోని విద్యార్థులు ఈ ఏడాది రాష్ట్రసిలబస్‌తోనే పదో తరగతి పరీక్షలు రాస్తారని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. గత వైసిపి ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు, పబ్లిసిటీ పిచ్చి విద్యార్థుల పాలిట శాపంగా మారిందని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక్కసారిగా వెయ్యి పాఠశాలల్లో సిబిఎస్ఇ పరీక్షా విధానానికి మార్చిందని తెలిపారు. రాష్ట్రపరీక్షలకు, సిబిఎస్ఇ పరీక్షా విధానానికి వ్యత్యాసం ఉంటుందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు సిబిఎస్ఇ పరీక్షా విధానంలో బోధన చేసేందుకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. విద్యార్థులను కూడా ఫౌండేషన్ స్థాయి నుంచే సిబిఎస్ఇ పరీక్షా విధానానికి సన్నద్ధం చెయ్యాల్సి ఉంటుందని వివరించారు. అటువంటి చర్యలేమీ చేపట్టకుండానే గత ముఖ్యమంత్రి హడావుడిగా అమలు చేశారని విమర్శించారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు రాయబోయే విద్యార్థులకు ఇంటర్నల్ అసెస్‌మెంట్ చెయ్యాలని అధికారులను ఆదేశించారు. 80వేల ట్యాబ్‌లతో ఇంటర్నల్ అసెస్‌మెంట్ నిర్వహించామని, 90శాతం మంది విద్యార్థులు ఇంటర్నల్ పరీక్షల్లో ఫెయిలయ్యారని తెలిపారు. 326 పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా ఉత్తీర్ణత సాధించలేదని పేర్కొన్నారు. 77,478 మంది విద్యార్థులు ఇంగ్లీష్ పరీక్ష రాయగా 59,518 మంది పరీక్షలో ఫెయిలయ్యారని వివరించారు. 2025-26 విద్యాసంవత్సరంలో 6వ తరగతి నుంచే పరీక్షా విధానంలో మార్పులు తీసుకొచ్చి విద్యార్థుల సామర్థ్యం పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

నష్టం.. రూ.6,882 కోట్లు

జాతీయ విపత్తుగా ప్రకటించి ఉదారంగా ఆదుకోండి

వరద నష్టంపై కేంద్ర బృందానికి సిఎం చంద్రబాబు వినతి

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల కారణంగా ఊహించని విపత్తు తలెత్తి రూ6,882 కోట్ల అపార నష్టాన్ని, తీవ్ర కష్టాన్ని కలిగించిందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. భారీ వర్షాలు, వరదలు రైతులకు, ప్రజలకు తీవ్రమైన నష్టాన్ని మిగిల్చాయని, ఈ దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం సాధారణ విపత్తులా చూడకుండా జాతీయ విపత్తుగా ప్రకటించి ఉదారంగా సాయం చేయాలని కోరారు. వరద నష్టాలపై అంచనాల కోసం వచ్చిన కేంద్ర బృందం రాష్ట్రంలో పర్యటన ముగిశాక గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రితో సమావేశమైంది. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో వచ్చిన ఈ విపత్తును సాధారణ విపత్తులా, గతంలో వచ్చిన వరదల్లా చూడొద్దని కోరారు. రికార్డు స్థాయి వర్షాలు, ఆకస్మిక వరదలు ప్రజల జీవితాలను అతలాకుతలం చేశాయని వివరించారు.

రెండు రోజుల వ్యవధిలో 50 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని, కృష్ణా నదిపై ప్రకాశం బ్యారేజీ చరిత్రలో ఇంత పెద్ద వరద ఎప్పుడూ రాలేదని వివరించారు. గరిష్టంగా 11.90 లక్షల క్యూసెక్కుల వరదకు అనుగుణంగా ప్రకాశం బ్యారేజీని నిర్మించారని, ఇటీవల కురిసిన వర్షాలకు 11.43 లక్షల క్యూసెక్కుల వరద వచ్చిందని తెలిపారు. ఇప్పటి వరకూ ఇదే రికార్డు స్థాయి వరదని వివరించారు. కృష్ణా నదికి 14 లక్షల క్యూసెక్కుల వరద వస్తే పరిస్థితి ఏంటనేది ఆలోచన చేయాల్సి ఉందన్నారు. ప్రజల ఆస్తులకు తీవ్ర నష్టం జరిగిందని, పంటలు నీళ్లలో మునిగి రైతులు కుదేలయ్యారని వివరించారు. ప్రాణ, ఆస్తి నష్టంతో పాటు తాగడానికి నీళ్లు, తినడానికి తిండి లేక ప్రాణభయంతో తీవ్ర క్షోభను అనుభవించారని తెలిపారు. ప్రజలను తిరిగి సాధారణ స్థితిలోకి నిలబెట్టేలా కేంద్రం సాయం అందేలా చూడమని కేంద్ర బృందాన్ని కోరారు. వరదల్లో ప్రజలు పడిన బాధలు చూసి చలించిపోయామని, మంత్రులు, అధికారులు అంతా క్షేత్ర స్థాయిలో ప్రజలకు ధైర్యం ఇచ్చేందుకు విజయవాడలోనే ఉండి పనిచేశామని తెలిపారు. కలెక్టర్ కార్యాలయాన్నే సచివాలయంలా చేసుకుని పనిచేశామన్నారు. సహాయక చర్యల కోసం కేంద్రం సాయాన్ని తీసుకున్నామని తెలిపారు. క్షేత్ర స్థాయిలో వరద సహాయక చర్యలను యుద్ధంలా చేపట్టామన్నారు. నష్టపోయిన కౌలురైతులకూ సాయం అందేలా చూడాల్సిన అవసరం ఉందని తెలిపారు.

రోడ్లు, ఇరిగేషన్ వ్యవస్థకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. సర్వం కోల్పోయి కష్టాల్లో ఉన్న వరద బాధితులకు, రైతులకు మంచి ప్యాకేజీ ఇస్తే తప్ప తిరిగి కోలుకోలేరని తెలిపారు. కేంద్ర బృందానికి నాయకత్వం వహించిన కేంద్ర హోమ్ శాఖ సంయుక్త కార్యదర్శి అనిల్ సుబ్రహ్మణ్యం వరద ప్రాంతాల్లో తమ బృందం జరిపిన పర్యటన అనుభవాలను ముఖ్యమంత్రికి వివరించారు. ఇంతస్థాయి వరదలు, బాధలు అనంతరం కూడా ప్రజలు ప్రభుత్వంపై ఎంతో నమ్మకంతో ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు వారికి సాంత్వన చేకూర్చాయన్నారు. డ్రోన్ల ద్వారా ప్రభుత్వ సహాయక చర్యలు ఎంతో వినూత్నంగా సాగాయని పేర్కొన్నారు. భారీగా పంట నష్టం, మౌలిక సదుపాయాల పరంగా తీవ్ర నష్టం జరిగినట్లు క్షేత్ర స్థాయి పర్యటనలో తమ దృష్టికి వచ్చిందన్నారు. బుడమేరు వరదలపై ప్రజలు తమ బాధలు చెప్పుకున్నారని తెలిపారు. దాదాపు 60 ఏళ్ల తర్వాత ఇలాంటి వరదలు వచ్చాయని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరారని వివరించారు. తమ పరిశీలనకు వచ్చిన అంశాలన్నింటినీ కేంద్రం దృష్టికి తీసుకువెళ్లి తగు సాయం అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.



రాష్ట్రంలో వరద నష్టం నివేదికను కేంద్ర బృందానికి అందజేస్తున్న సిఎం చంద్రబాబు

కెసి ఆయకట్టుకు ముప్పు!

- తుంగభద్రపై రెండు బ్రిడ్జి కం బ్యారేజీలు నిర్మిస్తామన్న కర్ణాటక
- ఎపి ఇంజనీరింగ్ అధికారులు, నిపుణులు అభ్యంతరాలు

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి, కలెక్టరేట్

కర్నూలు-కడప (కెసి) కెనాల్ ఆయకట్టుకు ముప్పు వాటిల్లే పరిస్థితి కనిపిస్తోంది. తుంగభద్ర నదిపై రెండు బ్రిడ్జి కం బ్యారేజీలు నిర్మించాలని కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం తాజాగా నిర్ణయించడమే అందుకు కారణం. బ్యారేజీల నిర్మాణం వల్ల కెసి ఆయకట్టుకు నీటి విడుదలకు ఆటంకం ఏర్పడనుందని పలువురు నిపుణులు, ఇంజనీర్లు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. తుంగభద్ర డ్యాముకు దిగువన తుంగభద్ర నదిపై కర్నూలు జిల్లా కౌతాళం మండలం కుంబళనూరు వద్ద 0.310 టిఎంసిల సామర్థ్యంతో ఒక బ్రిడ్జి కం బ్యారేజీ, మంత్రాలయం సమీపంలోని మాధవరం వద్ద 0.350 టిఎంసిల సామర్థ్యంతో మరో బ్రిడ్జి కం బ్యారేజీ నిర్మించేందుకు కర్ణాటక ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఇందుకోసం 397.50 కోట్లు ఖర్చు చేయనుంది. ఈ బ్యారేజీల వల్ల రెండు రాష్ట్రాల్లోని 61 గ్రామాల్లో తాగునీటి సమస్య తీరుతుందని కర్ణాటక ప్రజాప్రతినిధులు, అధికారులు చెబుతున్నారు. కర్ణాటక మైనర్ ఇరిగేషన్ శాఖ మంత్రి ఎన్ఎస్ బోసరాజు, కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు, రాయచూరు ఎంపి కుమార్ నాయక్ కలిసి కర్నూలు జిల్లా జలవనరుల శాఖ అధికారులతో కర్నూలులోని స్టేట్ గెస్ట్ హౌస్‌లో బుధవారం సమావేశమై బ్యారేజీల నిర్మాణం గురించి చర్చించారు. ఆ సమావేశంలోనే పలువురు అభ్యంతరాలను వ్యక్తం చేశారు. సుంకేసుల బ్యారేజీకి అనుబంధంగా నిర్మించిన కెసి కెనాల్ కింద ఉమ్మడి కర్నూలు, ఉమ్మడి కడప జిల్లాల్లో 2.65 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. కర్నూలు నగరంతో సహా పలు గ్రామాలకు తాగునీరు అందుతోంది. కృష్ణా వాటర్ డిస్ప్యూట్ ట్రిబ్యునల్ (కెడబ్ల్యుడిటి) ఈ కాలువకు 31.90 టిఎంసిల నికర జలాల వాటాను కేటాయించింది. అందులో 10 టిఎంసిలు తుంగభద్ర డ్యాము నుంచి, మిగిలిన 21.90 టిఎంసిల నీటిని తుంగభద్ర నది ప్రవాహం నుంచి తీసుకోవాలి. తుంగభద్రకు వరద వచ్చే రోజుల సంఖ్య తగ్గిపోవడంతో ఇప్పటికే కెసి కెనాల్ చివరి ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. తుంగభద్ర డ్యాము నుంచి తీసుకోవాల్సిన వాటాలో ఇంజనీర్లు ఇచ్చే ఇండెంట్ మేరకు విడుదల చేస్తే సుంకేసుల బ్యారేజీకి 50 శాతం కూడా చేరడం లేదు. ఒక టిఎంసి కెసి వాటా విడుదల చేస్తే సుంకేసుల బ్యారేజీకి 0.50 టిఎంసిలకు మించి చేరడం లేదు. కర్ణాటక ప్రభుత్వం ప్రతిపాదించిన రెండు బ్రిడ్జి కం బ్యారేజీలు నిర్మిస్తే ఆ బ్యారేజీలను దాటి కెసి కెనాల్ వాటా నీరు సుంకేసులను చేరడం ప్రశ్నార్థకమే అని పలువురు జల వనరుల శాఖ నిఋపులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. దీంతో, కెసి కెనాల్ ఆయకట్టు రైతులకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని అంటున్నారు. ఫిబ్రవరి, మార్చిలో తుంగభద్ర నదీ ప్రవాహం ఉండదని, ఆ బ్యారేజీల నిర్మాణం వల్ల అలాంటి సమయాల్లో కెసి కెనాల్‌కు నీరు ప్రవహించదని, ఆయకట్టు దెబ్బతింటుందని కర్నూలు జిల్లాకు చెందిన జల వనరుల శాఖ ఇంజనీరు ఒకరు తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం వివరణ ఇవ్వాలి : సిపిఎం

కర్ణాటక ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన రెండు బ్రిడ్జి కం బ్యారేజ్‌ల వల్ల కర్నూలు జిల్లాకు నష్టం జరిగే అవకాశం ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ తెలిపారు. మన రాష్ట్ర ప్రభుత్వం ముందే మేల్కొని కర్ణాటక ప్రభుత్వంతో చర్చించాలని, ఈ నిర్మాణాల వల్ల మన రాష్ట్రానికి, ప్రత్యేకించి కర్నూలు జిల్లాకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కర్ణాటక ప్రతిపాదనల వల్ల కర్నూలు జిల్లాకు ఎలాంటి మేలు చేకూరుతుందో మన రాష్ట్ర ప్రభుత్వం వివరణ ఇవ్వాలని కోరారు. ఈ మేరకు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రామకృష్ణ, కెవి.నారాయణలతో కలిసి ఇరిగేషన్ సిఇ కబీర్ పాషాకు గురువారం వినతిపత్రం అందజేశారు.

బంగ్లా మాజీ ప్రధాని ఖలీదా జియాకు తీవ్ర అస్వస్థత

ఢాకా : బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బిఎన్‌పి) ఛైర్‌పర్సన్ ఖలీదా జియా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆమెను గురువారం తెల్లవారుజామున ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. తెల్లవారు జామున 1.40 గంటల సమయంలో ఆమె తన నివాసం నుండి ఎవర్‌కేర్ ఆస్పత్రికి వచ్చారని బిఎన్‌పి మీడియా విభాగ సభ్యుడు కబీర్ ఖాన్ తెలిపారు. ఆమె ఆస్పత్రికి వచ్చిన వెంటనే ప్రైవేట్ కేబిన్‌లో వుంచారని ఆమె వ్యక్తిగత ఫిజీషియన్ జహీద్ హుస్సేన్ తెలిపారు. పలు రకాల పరీక్షలను చేయించుకోవాల్సిందిగా ఆమెకు మెడికల్ బోర్డు సూచించిందని పేర్కొన్నారు. పరీక్షల ఫలితాలు వచ్చిన తర్వాత అందించాల్సిన చికిత్సపై నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. ఇదే ఆస్పత్రిలో 45 రోజుల చికిత్స తీసుకున్న తర్వాత ఆగస్టు 21న జియా ఇంటికి వెళ్ళారు. గత ఐదేళ్ళగా గృహ నిర్బంధంలో వున్న ఆమె ఆగస్టు 6న స్వేచ్ఛ పొందారు. ఆమెపై మోపిన అభియోగాలన్నింటినీ కొట్టివేశారు. కాగా పలు రకాల అనారోగ్య సమస్యలతో ఆమె దీర్ఘకాలంగా ఇబ్బంది పడుతున్నారు. జూన్ 23న ఆమెకు పేస్‌మేకర్ కూడా పెట్టారు. ఆమెకు లివర్ సిరోసిస్‌గా నిర్ధారణ అయినందున 2021 నవంబరులోనే ఆమెను విదేశాలకు పంపాల్సిందిగా డాక్టర్లు సిఫార్సు చేశారు.

అదృశ్యమైన ఉద్యోగి అనుమానాస్పద మృతి

- ఫార్మా కంపెనీ మిథనాల్ ట్యాంకులో మృతదేహం

ప్రజాశక్తి- పరవాడ (అనకాపల్లి జిల్లా)

జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీలోని ఏడ్మేరాన్ లైఫ్ సైన్సెస్ ఫార్మా కంపెనీలో అదృశ్యమైన ప్రొడక్షన్ మేనేజర్ శవమై కనిపించారు. కంపెనీలోని మిథనాల్ ట్యాంకులో ఆయన మృతదేహం బయటపడింది. కంపెనీ యాజమాన్యం తీరు పట్ల పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మృతుని కుటుంబసభ్యుల కథనం ప్రకారం... మంగళవారం ఉదయం జనరల్ డ్యూటీకి కంపెనీ ప్రొడక్షన్ మేనేజర్ రంది సూర్యనారాయణ (40) వెళ్లారు. ఆ తర్వాత కంపెనీ నుంచి ఇంటికి రాలేదు. దీంతో, ఆయన కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. సూర్యనారాయణ వాహనం కంపెనీ వద్దే ఉంది. కంపెనీ బయోమెట్రిక్ హాజరులో కంపెనీ లోపలికి వచ్చినట్టు నమోదైంది. విధులు ముగించుకొని బయటకు వచ్చే హాజరు పట్టికలో అవుట్ లేదు. దీనిపై కంపెనీ యాజమాన్యం ఎటువంటి విషయమూ చెప్పకపోవడంతో కుటుంబీకులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అనంతరం కర్మాగారం ఎదుట బైఠాయించారు. ఈ నేపథ్యంలో సూర్యనారాయణ మృతదేహం 20 వేల లీటర్ల కెపాసిటీగల మిథనాల్ ట్యాంకులో గురువారం బయటపడింది. దీని మ్యాన్‌హోల్ కవర్ బోల్టు ఎప్పుడూ బిగించే ఉంటుంది. అవసరమైనప్పుడు మెకానిక్‌లు మాత్రమే మాన్‌హోల్ కవర్ బోల్ట్‌ను ఓపెన్ చేసి లోపలికి వెళ్తుంటారు. ప్రొడక్షన్ మేనేజర్ మృతదేహం దీనిలో ఉండడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రూ.కోటి పరిహారం ఇవ్వాలి : సిఐటియు

ఘటనా స్థలానికి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, పరవాడ జడ్‌పిటిసి సభ్యులు ఎస్.రాజు చేరుకున్నారు. అనుమానాస్పదంగా మృతి చెందిన ప్రొడక్షన్ మేనేజర్ కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం చెల్లించాలని, ఈ ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. సంఘటనా స్థలానికి పరవాడ సిఐ ఆర్.మల్లికార్జునరావు తన సిబ్బందితో వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. ఈ ఘటనపై పూర్తి విచారణ చేపడతామని సిఐ తెలిపారు. కాగా, మృతుని కుటుంబానికి రూ.50 లక్షల నష్టపరిహారం, దహన ఖర్చులకు లక్ష రూపాయలు ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకరించింది.



విజయవాడ వాంబేకాలనీలో ఏర్పాటు చేసిన కేంద్రంలో భోజనం కోసం బారులుతీరిన జనం

పేదల ఆకలి తీరుస్తున్న భోజనం కేంద్రాలు

- ప్రజాసంఘాలు, సిపిఎం ఆధ్వర్యాన కొనసాగుతున్న కేంద్రాలు

ప్రజాశక్తి - విజయవాడ

వరద బాధితులకు వివిధ ప్రజా, కార్మిక సంఘాలు, సిపిఎం ఏర్పాటు చేసిన భోజనం పంపిణీ కేంద్రాలు గురువారం కూడా కొనసాగాయి. ఏడు రోజులుగా 70 వేల మందికి భోజనం పంపిణీ చేశాయి. మొత్తం ఎనిమిది భోజన కేంద్రాలు ప్రజల ఆకలి తీరుస్తున్నాయి. ఈ కేంద్రాలను సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ చైర్మన్ పి.మధు, కార్యదర్శి పి.మురళీకృష్ణ, సిపిఎం జిల్లా కార్యదర్శి డివి.కృష్ణ తదితర ప్రజాసంఘాల నేతలు పర్యవేక్షిస్తున్నారు. గురువారం ఒక్కరోజే 15 వేల మందికిపైగా మధ్యాహ్నం, రాత్రి భోజనం అందించారు. వందలాది మంది కార్యకర్తలు వలంటీర్లుగా సేవలందిస్తున్నారు. నిబద్ధతతో భోజనం కేంద్రాలు కొనసాగించడం పట్ల పలువురు అభినందనలు తెలుపుతున్నారు. శుక్రవారం కూడా భోజనం పంపిణీ కేంద్రాలు కొనసాగుతాయని నేతలు ప్రకటించారు.

గొప్ప మేధావి ఏచూరి

ఆయన మరణం తీరని లోటు

నివాళి సందర్భంగా వక్తలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి గొప్ప మేధావి అని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్ అన్నారు. ఆయన మరణం వామపక్ష ఉద్యమానికి తీరని లోటు అని చెప్పారు. సిపిఎం రాష్ట్ర కార్యాలయంలో ఏచూరి సంతాప సభ గురువారం జరిగింది. ఈ సందర్భంగా గఫూర్ మాట్లాడుతూ దేశ సమస్యలపై అనర్గళంగా మాట్లాడే వ్యక్తి ఏచూరి అని అన్నారు. దేశంలో ఉన్న మతోన్మాద ప్రభుత్వం నానాటికీ మితిమీరిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా లౌకిక శక్తులను ఏకం చేసే ప్రయత్నం సిపిఎం చేస్తోందని చెప్పారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో ఆయన సేవలు చాలా అవసరమని తెలిపారు. ఇలాంటి సమయంలో ఆయన మృతి పార్టీకి, వామపక్ష ఉద్యమానికి తీరని లోటు అని చెప్పారు. పార్టీ కార్యకర్తల పట్ల ప్రేమ, అప్యాయతతో ఉండేవారని చెప్పారు. ఏచూరి అడుగు జాడల్లో నడుస్తూ బలమైన వామపక్ష ఉద్యమాన్ని నిర్మించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్టీ సీనియర్ నాయకులు పి మధు మాట్లాడుతూ సోవియట్ యూనియన్ కుప్పకూలిన సమయంలో సోషలిస్ట్ ఆర్థిక వ్యవస్థకు భవిష్యత్ లేదని, కమ్యూనిస్టు సిద్ధాంతం ఆచరణలో సాధ్యం కాదని ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారులు పెద్దఎత్తున దాడి చేశారని తెలిపారు. మద్రాస్‌లో జరిగిన 14వ పార్టీ మహాసభలో ఈ దాడిని తిప్పికొడుతూ మార్క్సిజం లెనినిజానికి కాలం చెల్లిందనే ధోరణి సరైంది కాదని తీర్మానాన్ని ఏచూరి ముందుకు తీసుకొచ్చారని చెప్పారు.

ఈ తీర్మానాన్ని మహాసభ ఏకగ్రీవంగా తీర్మానించిందని గుర్తుచేశారు. సిపిఐ రాష్ట్రసమితి తరపున ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్ పాల్గొని నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఏచూరి మన నుంచి దూరం కావడం చాలా బాధాకరమని చెప్పారు. విద్యార్థిగా ఉన్న సమయంలో ఢిల్లీ జెఎన్‌యులో మూడుసార్లు విద్యార్థినేతగా ఎన్నికయ్యారని తెలిపారు. తమ పార్టీ కార్యాలయంలో సురవరం సుధాకర్‌రెడ్డి, ఏచూరి చిత్రాలు ఉన్నాయని తెలిపారు. కమ్యూనిస్టు ఉద్యమాల్లో గొప్ప మేధావులని కొనియాడారు. సభకు అధ్యక్షత వహించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు, వి ఉమామహేశ్వరరావు, సిహెచ్ బాబూరావు, మంతెన సీతారాం, ప్రభాకర్‌రెడ్డి, డి.రమాదేవి మాట్లాడుతూ పోరాటం, చదువు అని రూపొందించిన ఎస్‌ఎఫ్ఐ నినాదంలో ఏచూరి పాత్ర ఉందని అన్నారు. మార్క్సిజం, లెనినిజాన్ని పిడివాదం కాదని, నిర్దిష్ట పరిస్థితులకు నిర్దిష్టంగా అన్వయించడం ద్వారా ప్రజా విముక్తికి దోహదపడాలనే ఆలోచనతో ఏచూరి కృషి చేశారని చెప్పారు. యుపిఎ ప్రభుత్వ హయాంలో రూపొందించిన ఉపాధి హామీ, సమాచార హక్కు చట్టం, భూ సేకరణ చట్టం వంటి ప్రజా చట్టాల రూపకల్పనలో ఏచూరి కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఇందిరాగాంధీ హయాంలో విధించిన ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడి జైలుకు వెళ్లారని తెలిపారు. సభలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు వి కృష్ణయ్య, అండ్ర మాల్యాద్రి, వై అచ్యుతరావు, జయరాం, కె ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ముందుగా ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజానాట్యమండలి కళాకారులు ఉద్యమ గేయాలు ఆలపించారు.



ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

సంపాదకీయం

వైరస్ పీచమణచాలి

ఆఫ్రికా ఖండాన్ని భయపెడుతున్న మంకీపాక్స్ కేసులు మనదేశంలోనూ నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. విదేశాల నుంచి వచ్చిన ఇద్దరు యువకుల్లో అనుమానిత లక్షణాలు కనపడడంతో- వారిని ఢిల్లీ జయప్రకాశ్ నారాయణన్ ఆసుపత్రిలో ఐసోలేషన్‌లో ఉంచి, పరీక్షలు నిర్వహించారు. ఇద్దరికీ మంకీపాక్స్ వైరస్ సోకినట్టు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ సోమవారం ప్రకటించింది. 2022 జులై నుంచి ఇప్పటివరకూ మనదేశంలో 30 మంకీపాక్స్ కేసులు నమోదయ్యాయని, వాటి వలె తాజా కేసులూ ఉన్నాయని, భయపడాల్సిన అవసరం లేదని పేర్కొంది. అదే సందర్భంలో రాష్ట్రాలన్నీ అప్రమత్తంగా ఉండాలని, విదేశాల నుంచి వచ్చే ప్రయాణికుల్లో ఈ వైరస్ లక్షణాలు కనిపిస్తే ఐసోలేషన్‌లో ఉంచి, వైద్య పరీక్షలు జరపాలని సూచించింది.

ఆఫ్రికా దేశాల్లో, ముఖ్యంగా డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో మంకీపాక్స్ కేసులు పెద్దసంఖ్యలో నమోదవుతున్నాయి. పదిహేను నెలల క్రితమే కేసులు నమోదు కాగా, ఇది అంతగా ఆందోళన చెందాల్సిన విషయం కాదని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) పేర్కొంది. ఆ తరువాత కూడా కేసులు పెరగడంతోనూ, అనేక దేశాల్లోకి వైరస్ వ్యాప్తి చెందడంతోనూ ఆరోగ్య అత్యయిక పరిస్థితిని ప్రకటించింది. విమానాశ్రయాల్లో తనిఖీలను కట్టుదిట్టం చేయాలని, ఏ కొద్దిపాటి లక్షణాలు కనిపించినా రోగులను ఐసోలేషన్‌లో ఉంచి, చికిత్స అందించాలని అన్ని దేశాలకూ మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రస్తుతం 116కు పైగా దేశాల్లో 16 వేల మంది మంకీపాక్స్ బాధితులు ఉన్నట్టు డబ్ల్యుహెచ్ఒ తెలిపింది. ఇది కోవిడ్ అంత వేగంగా వ్యాపించే వ్యాధి కానప్పటికీ - అందరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని హెచ్చరిస్తోంది.

1956లో తొలిసారి కోతుల్లో ఈ వ్యాధిని కనుగొన్నందున దీనికి మంకీపాక్స్ అని పేరు. 1970లో కాంగోలోనే ఓ వ్యక్తికి సోకింది. వైరస్ సోకిన 5 నుంచి 21 రోజుల్లో జ్వరం, చర్మం మీద దద్దుర్లు, కండరాల నొప్పి, గాయాలవ్వడం, చలి, అలసట వంటి లక్షణాలు కనిపిస్తాయి. కాంగోలో ఇప్పుడు ఉనికిలో ఉన్న వైరస్ క్లాడ్ 1 టైపు అని, ఇది తన జన్యు ఉత్పరివర్తన లక్షణాలను మార్చుకొని తీవ్ర ప్రభావాన్ని కలిగిస్తోందని గుర్తించారు. లైంగిక సంపర్కం ద్వారానే ఈ వైరస్ సోకుతుందని ఇప్పటివరకూ ఉన్న అవగాహన కాగా, కొత్త వేరియంట్ వైరస్ రోగికి దగ్గరగా ఉన్నా, ముట్టుకున్నా వ్యాప్తి చెందుతున్నట్టు తాజాగా గమనించారు. ఈ పరిస్థితుల్లోనే ప్రపంచ ఆరోగ్య సంస్థ మెడికల్ ఎమర్జెన్సీని ప్రకటించింది.

ఇలాంటి సాంక్రమిత వ్యాధులు చుట్టుముడుతున్నప్పుడు అవి ఎక్కడ, ఏ పరిస్థితుల్లో తలెత్తినప్పటికీ అంతర్జాతీయ సమాజం మొత్తం బాధ్యతాయుతంగా స్పందించాలి. దేశాలకు సరిహద్దులు ఉంటాయి కానీ, వైరస్‌ల వ్యాప్తికి ఏ అడ్డంకులూ ఉండవు. కోవిడ్ కాలంలో ఈ వైపరీత్య వ్యాప్తి ఎంత వేగంగా జరుగుతుందో ప్రపంచం ప్రత్యక్షంగా అనుభవించింది. ఎయిడ్స్, ఆంత్రాక్స్ వంటి ప్రాణాంతక వ్యాధులు కూడా ఎక్కడో పుట్టి, ఇప్పుడు ప్రపంచమంతటా తిష్ట వేశాయి. ఎవరి భద్రత వారే చూసుకుంటాం అంటే అది కుదిరే పని కాదు. అందుకనే కొత్త కొత్త వ్యాధులు కోరలు చాస్తున్నప్పుడే వాటి నియంత్రణకు, నిర్మూలనకూ చిత్తశుద్ధితో పూనుకోవాలి. ఇప్పుడు కాంగోలో కోటికి పైగా టీకా డోసులు అవసరం కాగా, 3 లక్షల డోసులు కూడా అందుబాట్లో లేవు. ఆకలిదప్పులతో అల్లాడిపోయే ఆ దేశం సొంతంగా టీకాలను సమకూర్చుకోవడం జరగని పని. టీకాలు అందిస్తామని అమెరికా, ఐరోపా దేశాలు మాట వరసకు చెప్పినా, ఆచరణలో ఇంతవరకూ చేసింది శూన్యం. లాభాలే పరమార్థంగా భావించే బహుళ జాతి మందుల కంపెనీలు రాబందుల్లా వేచి చూస్తున్నాయి తప్ప- ఆదిలోనే పరిస్థితిని అదుపు చేయటానికి ముందుకు రావటం లేదు. స్వలాభాలే పరమార్థంగా ఉన్న సంపన్న దేశాలూ, కార్పొరేటు కంపెనీలూ ఆధునిక ఆవిష్కరణలపై ఆధిపత్యం పొందుతాయి చేస్తాయి తప్ప వాటిని మానవాళి మేలు కోసం ఉపయోగించవు. పైగా వాటి మితిమీరిన ధనాకాంక్ష వైపరీత్యాల వ్యాప్తికీ, వ్యాధుల ఉధృతికి కారణమవుతుంది. ఆధునిక సామాజిక చైతన్యానికి, నాగరిక వికాసానికి రోగాలూ, వైపరీత్యాలూ లేని ప్రపంచం ఒక ఆదర్శవంతమైన ఆనవాలు. ఎక్కడ వ్యాధులు విస్తరిస్తున్నా అక్కడికి ఎల్లలెరగని ఆధునిక వైద్య పరిజ్ఞానం, మానవతా సహాయం వెల్లువెత్తాలి. ఆదిలోనే ప్రాణాంతక వైరస్‌ల పీచమణచాలి. అప్పుడే ప్రపంచ ఆరోగ్యానికి పరిపూర్ణమైన రక్ష!

మహనీయుల మాట



తన ఉనికికే ప్రమాదం వస్తోందని తెలుసుకున్న పాలక వర్గం... తన అధికారాలను అంటిపెట్టుకోవడానికి మతాన్ని పావుగా ఉపయోగించుకుంటుంది.

- ఆగస్టు బెబెల్,
జర్మన్ సోషలిస్ట్ రాజకీయవేత్త, రచయిత.

జ్ఞాపకం

ఆ వాక్యమే అధ్యయనానికి పురికొల్పింది

కామ్రేడ్ సీతారాం ఏచూరి ఇంటర్వ్యూ

మార్క్స్ ఒక చోట 'ప్రిన్సిపుల్స్ ఆఫ్ ఎకనమిక్ జస్టిస్ కెన్ నెవర్ రైజ్ అబౌ ది సోషల్ కండిషన్స్' (ఆర్థిక న్యాయ సూత్రాలు కూడా భౌతిక పరిస్థితులకు అతీతంగా ఉండవు) అని చెప్పారు. ఈ వాక్యమే నన్ను సీరియస్ అధ్యయనానికి పురికొల్పింది" అంటున్నారు కామ్రేడ్ సీతారాం ఏచూరి. ఆయన సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు. పార్టీ అధికార వార పత్రిక పీపుల్స్ డెమోక్రసీ సంపాదకులు. సందేహమే అధ్యయనానికి నాంది అంటున్న ఏచూరి విప్లవకారునికి అధ్యయనం ఆవశ్యకతను, దానిని కార్యాచరణకు ఉపయోగ పెట్టుకోవలసిన విధానం గురించి ప్రజాశక్తి ప్రతినిధులకిచ్చిన ఇంటర్వ్యూలో సమగ్రంగా విశ్లేషించారు.

(2002 సెప్టెంబర్‌లో ప్రజాశక్తిలో వచ్చిన ఈ ఇంటర్వ్యూ మరోసారి పాఠకుల కోసం. - ఎడిటర్)



కామ్రేడ్, మార్క్సిస్టు అధ్యయనం ఆవశ్యకత ఎంత వరకూ ఉంది?

మార్క్సిస్టు అంటేనే అధ్యయనశీలి. అధ్యయనం లేకుండా మార్క్సిస్టు ఎన్నటికీ మనలేడు. మార్క్సిస్టుకు అధ్యయనం అనేది స్వాభావికంగా ఉంటుంది. ఉండాలి. అది కమ్యూనిస్టులో అంతర్భాగంగా ఉండాలి. లెనిన్ చెప్పినట్టు 'మార్క్సిజం ఈజ్ ద కాంక్రీట్ ఎనాలిసిస్ ఆఫ్ కాంక్రీట్ కండిషన్స్' (నిర్దిష్ట పరిస్థితిని నిర్దిష్టంగా అధ్యయనం చేయడం).అధ్యయనం జీవితాంతం ఉండాలి. దీన్ని గుర్తించకపోతే డీజనరేషన్ (దిగజారిపోవడం) కు... తద్వారా డీవియేషన్స్ (పెడధోరణులు) కూ గురవుతాము. తప్పుదారి పడతాము. ఈ రెండింటినీ సరి చేసుకోవాలి. మరోవైపు ప్రజలంతా ఎందుకు మార్క్సిజం వైపు ఆకర్షితులవుతున్నారు అని చూస్తే ఇప్పటి వరకు ప్రపంచంలో మార్క్సిజం ఒక్కటే శాస్త్రీయం. లెనిన్ మాటలనే చూస్తే మార్క్సిజంలో రెండు అంశాలు ఉన్నాయి. ఒకటి విప్లవకర స్వభావం. రెండు శాస్త్రీయత. ఈ రెండింటిలో ఏ ఒక్కటి లేకున్నా మార్క్సిజమే తప్పుదోవ పడుతుంది.

శాస్త్రీయ అధ్యయనాన్ని ఎలా నిర్వచించవచ్చు? సమగ్ర అధ్యయనం ఎలా ఉండాలి?

అధ్యయనానికి చదవడం మౌలిక అవసరమే కానీ, చదవడంతోనే అధ్యయనం పూర్తికాదు. అధ్యయనం అనుభవాల మీద కూడా ఆధారపడుతుంది. మార్క్సిస్టుకు అనుభవాలు ఉద్యమాల ద్వారా వస్తాయి. ఉద్యమాలంటే ప్రజానీకంతో కలసి ఉండటం, పోరాడటం, చదవడం,అధ్యయనం, ఉద్యమాలలో పని చేసిన అనుభవం. ఇవన్నీ కలుపుకుంటేనే సమగ్ర అధ్యయనం అవుతుంది. పుస్తక అధ్యయనం..సామాజిక అధ్యయనం.. ఉద్యమాల అధ్యయనం... మూడింటి కలయికే సమగ్ర అధ్యయనం.

ఒక సామాన్య కార్యకర్త అధ్యయనాన్ని ఎక్కడ నుంచి ప్రారంభించాలి. మీ అనుభవాల నుంచి చెప్పండి?

ప్రతి ఒక్కరికీ వ్యక్తిగత అనుభవాలుంటాయి. వాటిని జనరలైజ్ చేయడం కష్టం. సాధ్యం కూడా కాదు. సామాజికంగా పరిస్థితులు ఏవి, ఎలా మారుతున్నాయి? ఈ విధంగా ఎందుకు జరుగుతోంది? అనే సందేహాలు వస్తాయి. ఆ ప్రశ్న నుంచే అధ్యయనం చేయాలన్న అవసరం, ఆసక్తి మొదలవుతాయి. మార్క్స్ కూడా 'డౌట్ ఎవ్రీ థింగ్' అన్నారు. జిజ్ఞాస, ప్రశ్న అధ్యయనానికి పురిగొల్పుతుంది. ఆ సందేహం ఎక్కడ నుంచి మొదలవుతుందో అక్కడి నుంచే అధ్యయనం ప్రారంభించాలి.

నేను ఎకనమిక్స్ గ్రాడ్యుయేషన్ చదువుతున్నప్పుడు అర్థశాస్త్రంలో మార్క్సిస్టు అవగాహన మొదట పరిచయమైంది. మార్క్స్ ఒక చోట 'ప్రిన్సిపుల్స్ ఆఫ్ ఎకనమిక్ జస్టిస్ కెన్ నెవర్ రైజ్ అబౌ ది సోషల్ కండిషన్స్' అని చెప్పారు. ఈ వాక్యమే నన్ను అధ్యయనానికి పురికొల్పింది. న్యాయం అనేది సామాజిక పరిస్థితులకు సంబంధం కలిగి ఉంటుంది. నేటి ఆధునిక నాగరిక సమాజంలో న్యాయం సాధ్యమా? 'జస్టిస్ ఇట్ సెల్ఫ్ ఈజ్ ఏ రిలేటివ్ టర్మ్ అండ్ సోషల్ కండిషన్స్, దెమ్ సెల్ఫ్ ఛేంజ్' (న్యాయమనేది సాపేక్షమైనది...సామాజిక పరిస్థితులు మారుతుంటాయి).

ఎకడమిక్ స్టడీలో నుంచి ఆసక్తి మొదలవడం ఒక భాగమైతే, రెండో వైపు నుంచి మన సామాజిక పరిస్తితితులు కూడా కారణమయ్యాయి. నేను స్కూలు, కాలేజీ హైదరాబాద్‌లో చదివాను. 1967-68లో నక్సలైట్లు, ఆ తర్వాత ప్రత్యేక తెలంగాణ ఉద్యమం చూశాను. ప్రత్యేక తెలంగాణ వల్ల హైదరాబాద్ వదిలి వెళ్ళాల్సి వచ్చింది. ఆ సమయంలో ఏడాది చదువు పోయింది. వీటన్నింటికీ కారణాలు ఏమిటి? ఎందుకు జరుగుతున్నాయి ఈ ఆందోళనలు? అని వాటి నుంచి కూడా ఆలోచించాను.

మన సమాజంలో పరిణామాలను విశ్లేషిస్తూ... వచ్చే సందేహాలన్నింటికీ పరిష్కార మేమిటి? అని ఆలోచించడం అలవర్చుకున్నాను. చుట్టూ పరిస్థితులు, పరిణామాలకు కారణాలేమిటి?.. వాటికి పరిష్కార మేమిటి విశ్లేషించుకుంటూ నేను వామపక్షం వైపు రావటం జరిగింది. కానీ అసలు అధ్యయనం మొదలెట్టాల్సింది ఒక పుస్తకం నుంచి కాదు అనుభావాల నుంచి.

లెఫ్ట్ వైపు చూస్తున్న తొలి దశలో మీరు చదివిన పుస్తకాలేమిటి?

అప్పటికి ప్రోగ్రెసివ్ లిటరేచర్ బాగా ఉండేది. రాబర్ట్ ఫ్రాస్ట్ పుస్తకాలు ఉండేవి. స్పార్టకస్, అమెరికాలో కార్మికోద్యమ ఎదుగుదలపై పుస్తకాలు వచ్చేవి. అవి చదివాను. మార్క్సిస్ట్ లిటరేచర్ ముఖ్యంగా చదవడం మొదలెట్టింది ఎకనమిక్స్ గ్రాడ్యుయేట్‌గా ఉన్నప్పుడే. ఆ పరిస్థితుల్లో క్యాపిటలిజం అంటే ఏమిటి ? అసలు దాన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలి? అని తెలుసుకోవడం కోసమే మార్క్సిస్టు సాహిత్యం వైపు మళ్ళటం జరిగింది. లెనిన్ 'స్టేట్ అండ్ రివల్యూషన్' నేను సీరియస్‌గా చదివిన తొలి పుస్తకం. అంతకు ముందూ చదివే వాళ్ళం కానీ సీరియస్‌గా చదివింది, ప్రభావితం చేసింది ఇదే. అపుడే సోషలిజం కోసం మనం చేసే పోరాటం ఏ విధంగా ఉండాలన్నది అర్థమయింది.

మార్క్సిస్టు సాహిత్యం పరిచయమయ్యాక పూర్తిస్థాయి ప్రణాళికా బద్ధంగా చదవడం ఎప్పుడు ప్రారంభమైంది?

ఒకసారి మొదలెట్టాక ఇక అది నిరంతర కార్యక్రమంగా కొనసాగింది. గ్రాడ్యుయేషన్ కాలమంతా ఇలా చదివినా, పరిణతి వచ్చిందనుకున్న దశ మాత్రం ఢిల్లీ జె.ఎన్.యు లో ఉన్నప్పుడే. అక్కడ రెగ్యులర్‌గా స్టడీ గ్రూప్స్ నిర్వహించుకునే వాళ్ళం. ఒక గెస్ట్‌ని పిలిచి లెక్చర్ ఇప్పించుకోవడం, పుస్తకాలపై స్టడీ గ్రూప్స్ నిర్వహించుకోవడం ఆరేడుగురం స్వచ్ఛందంగా చేసేవాళ్ళం. క్యాపిటల్ మూడు సంపుటాలూ అప్పుడే అలా చదివాం... ప్రతి శనివారం సాయంత్రం. మార్క్సిస్టు క్లాసిక్స్‌ని అలా చదివేశాం.

విద్యార్థి దశ కాబట్టి...చదవడం కోసం స్టడీ గ్రూపులు నిర్వహించుకునే వాళ్ళా? స్టడీ గ్రూపు కోసం చదివే వాళ్లా?

రెండూ కాదు... చదివింది అర్థం చేసుకోవడం కోసం. చదివేది ఒక్కొక్కరికి ఒక్కొక్క విధంగా అర్థమయ్యేది. స్టడీ గ్రూపులో ఇలా పంచుకున్న అవగాహన నుంచి ప్రామాణిక అవగాహనకొచ్చేవాళ్ళం.

మార్క్సిస్టు సాహిత్యం చదవడానికి ముందు ఇతర సాహిత్యం చదివే అలవాటుండేదా? లేక నేరుగా ఇవే చదివారా?

చిన్నప్పటి నుంచీ సాహిత్యం చదివే అలవాటుండేది. దానికి ముఖ్య కారణం మా తాతగారు (అమ్మ తండ్రి). ఆయన హైకోర్టు జడ్జిగా ఉండేవారు. ఇల్లే పెద్ద లైబ్రరీగా ఉండేది. ఆయన ద్వారా చిన్నప్పటి నుంచీ చదవడం అలవడింది. ఆ అలవాటు తర్వాత కాలంలో చాలా ఉపయోగపడింది. అసలు చదవడానికి ఒక ఇంటలెక్చువల్ డిసిప్లిన్ అవసరం. అది ఎంత ముఖ్యమో ఇప్పటికీ అనిపిస్తుంటుంది. అనుభవంలో తెలుస్తుంటుంది. తరచూ ప్రయాణాల వల్ల చదవడం ఈ మధ్య సరిగ్గా సాగటం లేదు. కానీ ప్రయాణాలనే చదవడానికి ఉపయోగించుకుంటాను.

ఆ కాలంలో ఏయే పుస్తకాలు చదివారు?

ఆ రోజుల్లో కొత్తగా వస్తున్న భారతీయ ఆంగ్ల రచయితల పుస్తకాలు చదివేవాణ్ణి. ఆర్.కె. నారాయణన్ అప్పుడే పాపులర్ అవుతున్న రచయిత. భారత పరిస్థితుల్లోని వాస్తవికతను వీరు ఎలా అర్థం చేసుకుంటున్నారు.. అని తెలుసుకోవడానికి కూడా చదివే వాణ్ణి. మరోవైపు మరో తాతగారి (నాన్న తండ్రి)కి మత సంబంధ పురాణేతిహాసాల పట్ల ఆసక్తి ఉండేది. ఆయన మూలంగా రామాయణ, భారత, భాగవతాలు చదివాను. వాటిల్లో నుంచి కూడా చాలా నేర్చుకున్నాను. వాటిని నిరాకరించాల్సిన అవసరం లేదు. ఆ అభూతకల్పన నుండి రియాలిటీని గ్రహించడం కోసం అనేక ప్రశ్నలు తలెత్తేవి. అడుగుతూండే వాణ్ణి కాని ఆయన చెప్పగలిగేవారు కారు.

రామాయణంలో దక్షిణాది రాజులను... రాముడి మిత్రులు, భక్తులు సైతం జంతువులుగా చిత్రించడంలోని అంతరార్థం ఏమిటి? ఎందువల్ల అలా చిత్రీకరించారు? అనేది నా సందేహాలలో ఒకటి. రామాయణం కథ వచ్చిన రోజుల్లో ద్రావిడులపై ఆర్యుల అధికృత కారణంగా అలా రాశారని కొన్నేళ్ళ తరువాత అర్థమయింది. అప్పటి సోషల్ రియాలిటీ ఆ కథలో అలా ప్రతిబింబించింది. వీటిని అధ్యయనం చేయడాన్ని అభివృద్ధి నిరోధకంగా చూడకూడదు. వాస్తవికతను అర్థం చేసుకోవడానికి వాటిని చదవాలి....ఒకవైపు సమకాలీన సాహిత్యం, మరోవైపు పురాణాలు, 'స్పార్టకస్' లాంటి పుస్తకాల్లోని తిరుగుబాట్లు.. ఇవన్నీ అభ్యుదయ సాహిత్యం వైపు రావడానికి దోహదపడతాయి

అభ్యుదయ సాహిత్యాన్ని ఎంచుకునే చదివేవారా?

అనలు చదివితే గదా ఏది అభ్యుదయ సాహిత్యం తెలిసేది. ఇది ప్రోగ్రెసివ్..., ఇది రియాక్షనరీ అని ఎంచుకుని చదవాలనుకుంటే.. అసలు చదవడం సాగదు.

రాజకీయ పాఠశాలకు వెళ్లక ముందూ వెళ్ళిన తరువాత.. అవగాహనా, అధ్యయన వేగంలో ఏమైనా తేడా కనిపించిందా?

తొలి రాజకీయ పాఠశాలకు 1978లో అనుకుంటా వెళ్ళాను... జలంధర్ పార్టీ కాంగ్రెస్ తరువాత ఆ పాఠశాల జరిగింది. రాజకీయ పాఠశాలలకు వెళ్ళడం చాలా ప్రధానం. నా వ్యక్తిగత అనుభవం ఏమిటంటే వాటికి వెళ్లడం వల్ల చదవడం క్రమానుగతమైంది. స్టడీ గ్రూపులకు వెళ్ళడం కూడా. ఏయే అంశాల కోసం ఏ పుస్తకాలు చదవాలి అనేది క్రమబద్ధమైంది. వేటిని ఎంచుకుని చదవాలనే ప్రాధాన్యతా క్రమం తెలిసింది.

ఆసక్తితో చదివేవి, అవసరాల కోసం చదివేవి ఉంటాయి. అధ్యయనంలో వీటిని ఎలా ప్లాన్ చేసుకోవాలి?

ఈ రెంటి మధ్య వైరుధ్యం ఉందని నేననుకోను. ఆసక్తి ఉండే వాటిలో కూడా విషయాలు, రాజకీయాలు ఉంటాయి. రిలాక్స్ కోణం డిటెక్టివ్ నవలలు కూడా చదివేవాణ్ణి.. పెట్టుబడిదారులు, ఆయుధ వ్యాపారులు యుద్ధాన్ని ఎందుకు కోరుకుంటారో, వారు యుద్ధాల వల్ల ఎలా లాభపడతారో మొదటిసారి ఒక డిటెక్టివ్ నవల ద్వారానే తెలిసింది. కాబట్టి చదివే వాటి ద్వారా మనం ఏమి గ్రహిస్తామనే దానిపైనే ఇది అధారపడి ఉంటుంది తప్ప ఆసక్తి ఉన్న విషయాలను చదవకూడదని కాదు. కానీ మార్క్సిస్టు మౌలిక క్లాసిక్స్ చదవకుండా వీటి నుంచే అన్ని అర్థం చేసుకుంటామనేది, చైతన్యం పొందుతామనేది తప్పు. అలాగే క్లాసిక్స్ చదివేసి... అంతా అర్థమయిందనుకోవడమూ సరి కాదు.

అనేక పుస్తకాలు చదువుతాము కదా! అందులోంచి విషయాలను డ్రా చేయడం గుర్తుంచుకోవడం, నిక్షిప్తం చేసుకోవడం మీరు ఎలా చేస్తారు?

ఎందుకు చదువుతున్నామనే స్పృహ మనకు ఉండాలి. మన జీవితంలోని అనుభవాల కంటే మించి ఇంకా అనేక అనుభవాలున్నాయి. వాటిని మనం అనుభవించే అవకాశం లేదు ఆ అనుభవాల్లోంచి.. మానవ సంబంధాలు.. అనుభూతులు ఎలా వుంటాయనేది చదవడం వల్లే తెలుసుకోగలం. అవసరమైతే చదివేప్పుడు నోట్సు తీసుకోవాలి. మననం చేసుకోవడం, రాసుకోవడం చేయాలి. నా జేబులో ఎప్పుడూ చిన్న కాగితాలుంటాయి. ముఖ్యమైన విషయాలు తెలుసుకున్నా, చదివినా.. ఏ విధంగా గ్రహించినా వెంటనే రాసుకుంటాను.

ఆత్మవిమర్శతో చెప్పాలంటే..ఈ పనిని నేను కూడా చేయాల్సినంత చేయలేకపోతున్నాను చదివినదీ తెలుసుకున్నదీ, నేర్చుకున్నవీ సహచరులతో పంచుకోవాలి. ఇది క్రమబద్ధంగా జరగాలి. అప్పుడే ఆ జ్ఞానం ఉపయోగపడుతుంది. కొందరు చాలా చదువుతారు. బాగా జ్ఞానం సంపాదిస్తారు. కానీ అది వారికే పరిమితం చేసుకుంటారు. ఇందువల్ల ఉద్యమాలకు లాభం జరగటం లేదు. ఇందుకోసం మానసిక క్రమశిక్షణ అవసరం.అలాగే, ఎంత సాధికారత ఉన్న అంశమైనా సభలు, పాఠశాలలకు వెళ్ళేప్పుడు ప్రిపరేషన్ ఉండాలి. ప్రిపరేషన్ ఉంటే విషయం, క్రమం, పద్ధతీ బాగా ఉంటాయి. చెప్పాలనుకున్నది అవతలి వారికి చేరుతుంది.

అంత బిజీ షెడ్యూల్‌లో అధ్యయనానికి సమయం ఎలా కేటాయిస్తున్నారు?

దీనికి మానసిక క్రమశిక్షణ అవసరం. ఎక్కువగా ప్రయాణాల్లో గడుపుతూంటాను. చదవడం, రాయడం కూడా ప్రయాణాల్లోనే చేస్తుంటాను. సాంకేతిక అభివృద్ధి వల్ల రాసింది పంపించడమూ సాధ్యమవుతున్నది. ప్రాథమికంగా ప్రతి రోజూ కొంత సమయం అధ్యయనానికి కేటాయించడం అవసరం. కామ్రేడ్ ఇ.ఎం.ఎస్ నుంచి ఇది నేను నేర్చుకున్నాను. ఆయన రోజు ఉదయాన్నే రెండు మూడు గంటలు చదివేవారు. ఆ సమయానికి ఆటంకం ఏర్పడితే ఆ రోజులో ఏదో ఒక సమయాన్ని అందుకోసం సర్దుబాటు చేసుకునేవారు. నేనూ ఉదయాన్నే అలా కేటాయిస్తాను. ఆటంకం ఏర్పడితే సర్దుబాటు చేసుకునేందుకు ప్రయత్నిస్తాను.

మొదలుపెట్టిన పుస్తకం అనేక కారణాలతో మధ్యలోనే ఆపేస్తుంటారు. ఈ సమస్య మీరు ఎలా అధిగమిస్తూంటారు?

ఏ పుస్తకమైన చదవాలని ఉండి పూర్తి చేయలేదంటే అది వ్యక్తిగత బలహీనతే. ఆ పుస్తకం పూర్తి చేయాలంటే అది పూర్తయ్యే వరకూ మనతోనే ఉంచుకోవాలి. దానిని పూర్తి చేయాలనే తపనా, ఆసక్తి ఉంటే అది సాధ్యమవుతుంది. భారతీయ రచయితల్లో మార్క్సిస్ట్ ఫిలాసఫర్‌గా చెప్పుకునే దేవీప్రసాద్ చటోపాధ్యాయ అముద్రిత రచనలను ఇటీవలే ముద్రించారు. వాటిని చదవడం రెండు నెలల క్రితం మొదలెట్టాను. పూర్తి చేయడం కోసం నా వెంటే ఉంచుకుంటున్నాను. ఆసక్తికరంగా ఉన్న పుస్తకం చదివేప్పుడు ఆకస్మికంగా వేరే పనులేవో తగిలితే స్వల్పంగా చికాకు కలుగుతుంది. నిభాయించుకుని తక్షణావశ్యమైన పనికి దిగుతుంటాను.

అధ్యయనంలో అప్పటికీ.. ఇప్పటికీ తేడా? ఆ రోజులే బాగున్నాయి... ఈ రోజుల్లో చదవడానికి టైమ్ ఉండటం లేదు - అనే ఫీలింగ్ వస్తుంటుందా?

తేడా ఉంది కానీ, అలాంటి ఫీలింగ్ కలుగదు. వాస్తవానికి ఇప్పుడు సమయం మిగులుతోంది. టెక్నాలజీ పెరగడం వల్ల ఇప్పుడు సమాచారం, వెంటవెంటనే తెలిసిపోతోంది. ఇప్పుడు టెక్నాలజీ, టీవీ ఛానళ్ల వల్ల సమాచారం కోసం ఎక్కువ సేపు ఎదురుచూడాల్సిన పని లేకుండా పోయింది. వీటి వల్ల గతం కంటే చదవడానికి ఎక్కువ సమయం మిగులుతోంది రోజుల్లో సమాచార సేకరణకే ఎక్కువ సమయం పట్టేది.

వేర్వేరు రంగాలు, సామాజిక వర్గాలకు నంబంధించి వస్తున్న నమకాలీన సాహిత్యం చదవాల్సిన అవసరం ఉందా?

కచ్చితంగా ఉంది. అలా వస్తున్న మంచి సాహిత్యంతో పాటు అంతకు మించి పనికిరానిది కూడా వస్తున్నది. వాటిని వేరు చేసుకుని సమకాలీన సాహిత్యం చదవాల్సిందే.

విషయాధ్యయనంలో స్పెషలైజేషన్లు సంబంధించి..?

స్పెషలైజేషన్ అంటే మిగతా చదవకూడదని కాదు. జనరల్‌గా అన్ని విషయాల గురించిన ప్రాథమిక అవగాహన కోసం చదవడం, అలాగే పనిచేస్తున్న అంశంమీద స్పెషలైజేషన్ చేయడం అవసరం. ఒకే విషయం స్పెషలైజేషన్ చేసి, మిగతా వదిలేయడం సరికాదు. సమగ్రతా రాదు. స్పెషలైజేషన్ లేకుండా అన్ని విషయాలు చదవడం వల్ల కూడా ప్రయోజనం ఉండదు.

ఇప్పటికీ మీకు ఇన్‌స్పిరేషన్ ఇచ్చే పుస్తకం రచయిత?

చెప్పడం కష్టం. చాలామంది ఉన్నారు. చాలా పుస్తకాలున్నాయి. అయినా నా దృష్టిలో క్లాసిక్ మాస్టర్ పీస్ మాత్రం మార్క్స్ రాసిన 'లూయీ బోనపార్టీ ఎయిటీంత్ బ్రుమెర్'. ఆలసట పోగొట్టుకోవడం కోసం తరచూ చదువుతూండే పుస్తకం అది.

అందులోని ఒక వాక్యం.

'మేన్ మేక్స్ హిస్టరీ బట్ నాట్ ఆన్ ది సర్కమ్‌స్టెన్సెస్ ఛూజన్ బై హిమ్!' (మనుషులే చరిత్ర నిర్మాతలు. అయితే వాళ్లనుకున్న పరిస్థితుల ఆధారంగా కాదు).

కామ్రేడా! జోహార్లు!

మార్క్సిజం నీ ఊపిరిగా
ఎదిగిన తెలుగు బిడ్డ!

జె.ఎన్.యు నీకు
మార్క్సిజం ఓనమాలు నేర్పగా.

జర్నలిజం ఆయువుగా
ప్రజా సమస్యల ఏకరువు పెట్టిన
నీ కలం అమరం.
ప్రజాస్వామిక పోరాటాల్లో
ఎనలేని నీ భూమిక
నీ వ్యూహాలు పోరాట మనుగడకు
దిశా నిర్దేశం!

మతతత్వం పై సంధించిన
నీ వ్యాసాలు భావికి దిక్సూచి!
లౌకిక రాజ్యాంగానికి తూట్లు పొడిచిన
ప్రతి సారీ నీ గళం
పార్లమెంట్‌లో నిప్పులు కురిపించెను!
నీ బాటలో
భారతీయ మార్క్సిజం
కొత్త పుంతలు తొక్కు!
అందుకో కామ్రేడా! జోహార్లు!

- గిరిప్రసాద్ చెలమల్లు
సెల్: 9493388201

నింగికేగిన ఎర్ర పిడికిలి...

దేశ సేవలో ఆయనకు
సిద్ధాంతమే ఊపిరి
పోరాటమే జీవితం
అడుగడుగులో అభ్యుదయం.

ప్రజాసమస్యల కోసం ప్రపంచాన్ని చదివి
పరిష్కారం కోసం బ్రతుకును అర్పించి
నింగికేగిన ఎర్ర పిడికిలి.

పేదల పక్షాన ప్రగతిని కల కని
పార్టీ కోసం నిబద్ధత చూపిన
నిలువెత్తు నిజాయితీకి నిలువుటద్దం
మన సీతారాం ఏచూరి.

- చందలూరి నారాయణరావు,
సెల్: 9704437247

కవిత్వం

ఇప్పుడెలా కామ్రేడ్...!

మతతత్వం పొగచూరిన దేశంలో
అభ్యుదయవాదుల జట్టులో
తిరుగులేని నాయకుడివై
దేశానికి దిశానిర్దేశం
చేస్తున్న సమయాన
ఎంత పని చేశావ్ కామ్రేడ్
నీవు లేని దేశ ముఖచిత్రాన్నెలా
ఊహించగలం చెప్పు.....
ఇప్పుడెలా కామ్రేడ్ ?
కాషాయాన్ని నిలువరించి
కదం తొక్కుతున్న తరుణాన
అరుణారుణ నాయకుడా
మేమెలా తెప్పరిల్లాలి చెప్పు
నీవు లేని నష్టం భరించడం
బహు కష్టం కామ్రేడ్
జీవితాన్ని ఉద్యమపరం చేసి
దేహాన్ని దేశానికిచ్చిన
నీ అమర జీవితానికి
లాల్ సలాములే కాదు
సదా కితాబులిస్తూ
మా జీవితసారాన్ని
సరిచేసుకుంటూ తరిస్తాము
మరో మహోపాధ్యాయుడివైన
నీ అడుగుల్లో నడుస్తూ
ఎర్ర జెండా మోస్తాము
సమసమాజ కార్యోన్ముఖంగా
నిను రోజూ తలుస్తుంటాము
నిను రోజూ కలుస్తుంటాము.

- జంధ్యాల రఘుబాబు,
సెల్: 9849753298

శ్రామిక పక్షపాతి

తోచింది చెప్పడం కాక
విషయావగాహనతో కూడిన
ఎదుటివారిని ఆలోచింపచేసే
ప్రసంగాలు సొంతమై,
గుక్క తిప్పక
అనర్గళంగా మాట్లాడే,
ప్రశ్నించడమే తన వంతైన
ఆ గొంతు ...
తిరిగిరాని లోకాలకు
తరలిపోయింది.

అనర్గళంగా మాట్లాడుతూ,
అన్యాయాన్ని ఎదిరించి,
విమర్శనాస్త్రాలు సంధించి
అనుకున్నది సాధించే
ఆ గొంతు ...
మూగబోయింది.

ఆ గొంతు మరెవరిదో కాదు...
ప్రజాసమస్యలకై పోరాడిన
నిఖార్సయిన అరుణకిరణం,
ఉద్యమ కణిక,
కార్మిక వర్గ కవచం
మన "సీతారాం ఏచూరి"దే.

జోహార్ ఓ విప్లవ యోధుడా,
అమర్ రహే ఓ శ్రామిక పక్షపాతీ!

- వేమూరి శ్రీనివాస్
సెల్: 9912128967



ఎన్‌జిటి ఆదేశాలపై సుప్రీం స్టే

న్యూఢిల్లీ : పూణేలో గణేష్ ఉత్సవాల్లో పాల్గొనే ధోల్-తాషా గ్రూపుల్లో వుండే వ్యక్తుల సంఖ్యను 30కి నియంత్రిస్తూ జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జిటి) ఇచ్చిన ఆదేశాలపై సుప్రీం కోర్టు గురువారం స్టే ఇచ్చింది. పూనేలో ధోల్-తాసాకు చాలా సాంస్కృతిక ప్రాధాన్యత వుందని, వందేళ్లకు పైగా ఇది అమలవుతోందని, లోకమాన్య బాల గంగాధర్ తిలక్ దీన్ని ప్రారంభించారని లాయర్ అమిత్ పాయ్ పేర్కొన్నారు. ఆగస్టు 30వ తేదీన ఎన్‌జిటి జారీ చేసిన ఈ ఆదేశాలు ఇటువంటి గ్రూపులను ప్రభావితం చేస్తాయని ఆయన అన్నారు. దీనిపై వెంటనే నోటీసులు జారీ చేసి, తదుపరి విచారణ వరకు ఆ ఆదేశాల అమలుపై స్టే విధించాల్సిందిగా బెంచ్ ఆదేశించింది. ప్రతి గ్రూపులోనూ ధోల్ తాషా జంజ్ సభ్యులు 30 కన్నా ఎక్కువ మంది వుండరాదని ఎన్‌జిటి పూనే పోలీసులను ఆదేశించింది. గణపతి ఉత్సవాలు కొనసాగుతున్నాయని, అందువల్ల త్వరగా విచారణ చేపట్టాల్సిందిగా న్యాయవాది సుప్రీం కోర్టును కోరారు.

హర్యానాలో 90 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన ఆప్

హర్యానా : హర్యానా ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ దూకుడుగా వ్యవహరిస్తోంది. మొన్నటి వరకూ కాంగ్రెస్‌తో దోస్తీ కోసం చర్చలు జరిపింది. అయితే ఆ చర్చలు ఫలవంతం కాలేదు. దీంతో అన్ని స్థానాల్లోనూ ఒంటరిగానే పోటీ చేసేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలోనే విడతల వారీగా అభ్యర్థులను ప్రకటిస్తూ వస్తోంది. గురువారం తన చివరి జాబితాను విడుదల చేసింది. ఏడో జాబితాలో భాగంగా ముగ్గురు అభ్యర్థులను ప్రకటించింది. దీంతో మొత్తం 90 స్థానాలకు ఆప్ అభ్యర్థులను ప్రకటించినట్లైంది.

భరణంపై ఆధారపడటం సరికాదు : హైకోర్టు

భోపాల్ : భర్త నుంచి భరణం వస్తుంది కదా అని సంపాదించుకోవడం ఆపేయడం సరికాదని ఒక కేసు విచారణ సందర్భంగా మధ్యప్రదేశ్ హైకోర్టు పేర్కొంది. ఉన్నత చదువు, అర్హతలు ఉండి కూడా ఏ పని చేయకపోవడం సరికాదంది. నెలకు 60వేల భరణం సరిపోదని, పెంచాలని భార్య హైకోర్టును ఆశ్రయించింది. 'ఏ కారణం లేకుండానే ఆమె విడిగా ఉంటోంది. గతంలో ఉద్యోగం చేసింది. బ్యూటీ పార్లర్‌తో బాగానే సంపాదిస్తోంది. భరణం తగ్గించండి' అని భర్త వాదించగా, కోర్టు 40వేలకు తగ్గించింది.

ముడి చమురు ధరలు తగ్గినా.. దేశంలో తగ్గని ఇంధన ధరలు

న్యూఢిల్లీ : ప్రపంచ మార్కెట్లో ముడి చమురు (క్రూడాయిల్) ధరలు తగ్గుముఖం పట్టాయి. కొన్ని రోజులకు ముందు ఒక బ్యారెల్ చమురు ధర 80 డాలర్ల కంటే ఎక్కువగా ఉండేది. అయితే ఇప్పుడు ఈ ధర 70 డాలర్ల నుంచి 72 డాలర్ల మధ్య ఉంది. కానీ ఈ తగ్గుదల ప్రయోజనాలు దేశ ప్రజానీకానికి అందడం లేదు. ముడి చమురు ధరలకు అనుగుణంగా ఇంధన ధరలు సవరించాల్సివున్నా..కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆ పని చేయడం లేదని, సామాన్యులపై భారాలు కొనసాగిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ముడి చమురు ధరల తగ్గుదల కొనసాగుతున్న నేపథ్యంలో దేశంలో కూడా ఇంధన (పెట్రోల్, డీజిల్) తగ్గించేందుకు అవకాశాలున్నాయని కేంద్ర పెట్రోలియం అండ్ న్యాచురల్ గ్యాస్ శాఖ కార్యదర్శి పంకజ్ జైన్ తెలిపారు.

కేజ్రీవాల్ బెయిల్‌పై నేడు సుప్రీంకోర్టు తీర్పు

న్యూఢిల్లీ : ఢిల్లీ మద్యం విధానం.. మనీలాండరింగ్ కేసులో అరెస్టయి..తీహార్ జైలులో ఉన్న ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ బెయిల్‌పై సుప్రీం కోర్టు నేడు (శుక్రవారం) తీర్పు వెలువరించనుంది. సిబిఐ కేసులో బెయిల్ ఇవ్వాలని అరవింద్ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై సర్వోన్నత న్యాయస్థానం ఇప్పటికే విచారణ పూర్తి చేసింది. శుక్రవారం బెయిల్ మంజూరు అయితే అరవింద్ కేజ్రీవాల్ జైలు నుంచి విడుదల కానున్నారు. సెప్టెంబర్ 5న చేపట్టిన విచారణలో ఇరుపక్షాల వాదనలు విన్న జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్వల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం బెయిల్ తీర్పును రిజర్వ్ చేసిన సగతి తెలిసిందే.

ఖైదీల్లా వచ్చివెళ్తున్న పర్యాటకులు

- ఫరూఖ్ అబ్దుల్లా

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370 రద్దు చేసినప్పటి నుంచి ఈ ప్రాంతంలో పర్యాటక రంగం బాగా అభివద్ధి చెందినట్లు బిజెపి చేస్తున్న ప్రచారాన్ని జమ్ముకాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూఖ్ అబ్దుల్లా తిప్పికొట్టారు. కాశ్మీర్‌లో పర్యాటక రంగం అభివృద్ధి అంతా బూటకమని చెప్పారు. 'పర్యాటకం అభివృద్ధి చెందటం కాదు..పర్యాటకులు ఖైధీల వలే వచ్చి వెళ్తున్నారు' అని ఆయన వ్యాఖ్యానించారు. ఒక జాతీయా మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. 'ఒకవైపు.. జమ్ముకాశ్మీర్‌లో సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయని చెబుతూనే అమర్‌నాథ్ యాత్ర సందర్భంగా కేంద్రం భారీగా భద్రతా బలగాలను మోహరింపజేస్తోంది. అమర్‌నాథ్ యాత్ర సందర్భంగా ఇంత భారీగా భద్రతా బలగాలను ఎప్పుడూ మోహరించలేదు. జమ్ముకాశ్మీర్‌కు వచ్చే.. పర్యాటకులు భయం గుప్పిట్లో ఖైధీల్లా బస్సుల్లో వచ్చి.. వెళ్లిపోతున్నారు.' అని ఆయన అన్నారు.

అదానీకి మరో షాక్ ..!

- విద్యుత్ ఒప్పందాన్ని పరిశీలిస్తాం
- ఇతర భారతీయ వ్యాపారాలను కూడా..
- బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ కీలక నాయకుడు వెల్లడి



ఢాకా : భారత బడా పారిశ్రామికవేత్త అదానీకి చెందిన విద్యుత్ ఒప్పందాన్ని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం పరిశీలించనున్నది. ఈ జాబితాలో భారత్‌కు చెందిన ఇతర వ్యాపారాలూ ఉన్నాయి. ఈ విషయాన్ని తాత్కాలిక ప్రభుత్వంలోని కీలక నాయకుడొకరు చెప్పారు. షేక్ హసీనా ప్రభుత్వంలో 2017లో అదానీ గ్రూపుతో ఒప్పందం జరిగింది. దీని ప్రకారం తన జార్ఖండ్ యూనిట్ నుంచి అదానీ గ్రూపు బంగ్లాదేశ్‌కు విద్యుత్‌ను సరఫరా చేస్తుంది. కొన్ని రోజుల క్రితమే బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా ప్రభుత్వం రద్దవటం, ముహమ్మద్ యూనస్ నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడిన విషయం విదితమే. దీంతో షేక్ హసీనా నేతృత్వంలో జరిగిన వ్యాపార ఒప్పందాలపై అక్కడి ప్రస్తుత ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగానే అదానీ గ్రూపుతో పాటు ఇతర భారత వ్యాపారాలను పరిశీలించనున్నట్టు అక్కడి ప్రభుత్వ పెద్దలు చెప్తున్నారు.

అసలు అదానీ గ్రూపుతో జరిగిన ఒప్పందంలోని నిబంధనలేంటి అని తెలుసుకోవటంపై బంగ్లాదేశ్‌లోని తాత్కాలిక ప్రభుత్వం చాలా ఆసక్తి కనబరుస్తున్నట్టు తెలుస్తున్నది. విద్యుత్ కోసం జరిపే చెల్లింపులు సమర్థనీయమేనా అన్నదాని పైనా దృష్టి సారించింది. "ఎలాంటి కాంట్రాక్టులపై సంతకాలు జరిగాయి? నిబంధనలు, షరతులు ఏమిటి? అనే విషయంలో అదానీ బిజినెస్ వంటి భారత వ్యాపారాలపై పరిశీలన ఉంటుంది. దేశ చట్టాన్ని అనుసరించని విదేశీ కంపెనీ ఉండకూడదు. కాబట్టి, ఈ దర్యాప్తులు జరుగుతాయి. భారత వ్యాపారాలను లక్ష్యంగా చేసుకుంటున్నారన్న వార్తలు వస్తాయి. కానీ అలాంటిదేమీ లేదు. జరుగుతున్న వ్యాపారాల గురించే పరిశీలన ఉంటుంది. బంగ్లాదేశ్ ఎంత చెల్లిస్తుంది, అది సరియైనదేనా అనే ఇలాంటి ప్రశ్నలన్నీ వస్తాయి" అని తాత్కాలిక ప్రభుత్వంలోని ఒక సీనియర్ నాయకుడు తెలిపాడు.

భారత్‌తో తాము మంచి సంబంధాలనే కోరుకుంటున్నామని ఢాకా అంటున్నది. "భారత్‌తో మేము స్థిరమైన, తటస్థ సంబంధాలను కావాలనుకుంటున్నాం. కానీ, షేక్ హసీనాకు ఆశ్రయమివ్వటమే సమస్య. తొలుత ఆమె అక్కడ(భారత్) కొంతకాలమే ఉంటారనుకున్నాం. కానీ, బంగ్లాదేశ్‌కు వ్యతిరేకంగా కార్యకలాపాలను సాగించటానికి ఆమెకు అక్కడ చోటు దక్కుతున్నది" అని బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా వ్యాఖ్యలను ఉటంకిస్తూ సదరు సీనియర్ నాయకుడు తెలిపారు. దేశ ఆర్థిక పరిస్థితిపై యూనస్ దృష్టి సారిస్తున్నారని చెప్పారు. దేశంలో యంత్రాంగాన్ని, ఆర్థిక పరిస్థితులను షేక్ హసీనా భ్రష్టు పట్టించారనీ, అవినీతి విపరీతంగా పెరిగిపోయిందని సదరు నేత ఆరోపించారు. ప్యూన్ స్థాయి వ్యక్తులు కూడా కోట్ల టకా(బంగ్లాదేశ్ కరెన్సీ)లను పోగేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

మహిళలకు రూ.3వేలు

- యువతకు ఒక లక్ష ఉద్యోగాలు
- మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రూ.5 లక్షల వడ్డీలేని రుణం
- ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల ఆరోగ్య బీమా కవరేజ్
- ప్రతి వ్యక్తికీ రేషన్ బియ్యం 11 కేజీలకు పెంపు
- జమ్మూకాశ్మీర్‌కు కాంగ్రెస్ ఐదు వాగ్దానాలు

శ్రీనగర్ : జమ్మూకాశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికల తేదీలు దగ్గరపడుతుండటంతో రాజకీయ పార్టీల ప్రచారాలు ఊపందుకున్నాయి. ఎన్నికల మ్యానిఫెస్టోల్లో హామీలతో అక్కడి ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నాయి. ఇందులో భాగంగా కాంగ్రెస్ ఐదు వాగ్దానాలను చేసింది. వీటిని ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రకటించారు. కాంగ్రెస్-నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సీ) కూటమి విజయం సాధిస్తే ఈ ఐదు గ్యారెంటీలను అమలు చేస్తామని ఆయన వాగ్దానం చేశారు. "మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రూ.5 లక్షల వడ్డీలేని రుణం అందిస్తాం. ప్రతి కుటుంబానికీ రూ.25 లక్షల ఆరోగ్య బీమా కవరేజ్ ఉంటుంది. కాంగ్రెస్-ఎన్‌సీ ప్రభుత్వం వస్తే.. జమ్మూకాశ్మీర్‌కు రాష్ట్ర హోదా వస్తుంది. అందుకోసం పోరాడుతాం. మహిళలకు ప్రతి నెలా రూ.3 వేలు స్టైఫండ్ అందిస్తాం. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రతి వ్యక్తికీ రేషన్ బియ్యాన్ని 11 కేజీలకు పెంచుతాం" అని దక్షిణ కాశ్మీర్‌లోని అనంత్‌నాగ్ నియోజకవర్గంలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఖర్గే అన్నారు.

జమ్మూకాశ్మీర్‌కు అసెంబ్లీ, లెజిస్లేటివ్ కౌన్సిల్ ఉభయ సభలు పునరుద్ధరించబడతాయని ఆయన హామీ ఇచ్చారు. తాము అధికారంలోకి వస్తే ఒక లక్ష ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. బీజేపీ జమ్మూకాశ్మీర్ ప్రజలను పేదవారిగా ఉంచాలనుకుంటున్నదని ఆరోపించారు. పర్యాటకం, ఉత్పత్తి, ఉద్యోగ, పారిశ్రామిక వృద్ధిని పెంచటం పైనే తాము దృష్టిని సారించబోతున్నట్టు ఖర్గే చెప్పారు. మూసివేయబడిన అన్ని స్కూళ్లను తెరుస్తామనీ, కాశ్మీరీ పండిట్‌ల పునరావాసాన్ని పరిష్కరిస్తామని ఆయన అన్నారు. జమ్మూకాశ్మీర్‌లోని ఓబీసీలకు రాజ్యాంగబద్ధమైన హక్కుల విషయంలో ఆయన హామీనిచ్చారు. జమ్మూకాశ్మీర్‌లో ఈనెల 18, 25, అక్టోబర్ 1న మొత్తం మూడు దశల్లో ఎన్నికలు జరగనున్న విషయం విదితమే. ఓట్ల లెక్కింపు అక్టోబర్ 8న జరిగి తుది ఫలితాలు వెలువడనున్నాయి.

సిజెఐ నివాసంలో గణపతి పూజలో ప్రధాని మోడీ

- న్యాయవాదుల్లో ఆందోళన

న్యూఢిల్లీ : న్యూఢిల్లీలోని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ నివాసంలో నిర్వహించిన గణపతి పూజకు ప్రధాని నరేంద్ర మోడీ హాజరయ్యారు. మోడీకి ప్రధాన న్యాయమూర్తి, ఆయన భార్య కల్పనాదాస్ స్వాగతం పలికారు. గణపతి పూజ కోసం డివై చంద్రచూడ్ నివాసానికి ప్రధానమంత్రి రావడంపై శివసేన (యుబిటి) నాయకులు, సీనియర్ సుప్రీంకోర్టు న్యాయవాదులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇది న్యాయవ్యవస్థ పారదర్శకతపై ప్రభావం చూపుతుందని అన్నారు. రాజకీయ నాయకులను "రాజ్యాంగ పరిరక్షకుడు" కలవడం ప్రజల మనస్సులలో సందేహాలను రేకెత్తిస్తుందని శివసేన ఎంపి సంజయ్ రౌత్ ఎక్స్ లో ట్వీట్ చేశారు. ఏక్‌నాథ్ షిండే నేతత్వంలోని వర్గాన్ని నిజమైన శివసేనగా గుర్తించాలన్న మహారాష్ట్ర స్పీకర్ నిర్ణయాన్ని ఉద్ధవ్ ఠాక్రే శిబిరం సవాలు చేసిన కేసు సీజేఐ చంద్రచూడ్ ముందు విచారణ జరుగుతోంది. ఈ కేసులో ప్రధానమంత్రి ఇతర పక్షంగా ఉన్నందున తమకు న్యాయం జరుగుతుందా? అన్న సందేహం కలుగుతోంది. ఈ కేసు విచారణ నుంచి దూరంగా ఉండాలని చంద్రచూడ్‌కు రౌత్ సూచించారు. శివసేన (యుబిటి) ఎంపి ప్రియాంక చతుర్వేది కూడా న్యాయవ్యవస్థపై విరుచుకుపడ్డారు.

రాజీనామాకు సిద్ధం

మమతా బెనర్జీ

కొల్‌కతా : ఆర్‌జి కార్ ఆసుపత్రిలో వైద్యురాలి హత్యాచారం..అనంతరం వైద్యులు, వైద్య విద్యార్థుల ఆందోళనతో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ కేసు దర్యాప్తులో అనేక అనుమానస్పద ఘటనలు చోటుచేసుకోవడం, ప్రభుత్వ నిర్లక్ష్యంపై సర్వత్రా విమర్శలు వస్తున్న నేపత్యంలో గురువారం ఆమె కీలక ప్రకటన చేశారు. ప్రజల కోసం ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయడానికైనా సిద్ధమని ఆమె ప్రకటించారు. 'ప్రస్తుతం ఈ కేసు కోర్టు పరిధిలో ఉంది. అందువల్ల జూనియర్ వైద్యులు డిమాండ్ చేసినట్లు చర్చలను ప్రత్యక్ష ప్రసారం చేయలేం. అయితే, ఈ భేటీ వీడియో రికార్డింగ్‌కు ఏర్పాట్లు చేశాం. సుప్రీంకోర్టు అనుమతితో ఆ ఫుటేజీని వైద్యులకు అందజేస్తాం. ఆందోళన చేస్తున్న జూనియర్ డాక్టర్లపై ఎలాంటి చర్యలు తీసుకోను. పెద్దవాళ్లం కాబట్టి వారిని క్షమిస్తాను' అని మమతా బెనర్జీ చెప్పారు. అయితే ముఖ్యమంత్రితో భేటీని లైవ్ టెలికాస్ట్ చేయాలని జూనియర్ డాక్టర్లు పట్టుబట్టిన సంగతి విదితమే. ఇందుకు ప్రభుత్వం నుంచి సరైన స్పందన రాకపోడంతో చర్చలపై ప్రతిష్టంభన నెలకొంది.



బ్రిక్స్ సమావేశం నేపథ్యంలో పుతిన్‌తో అజిత్ దోవల్ భేటీ


సెయింట్ పీటర్స్ బర్గ్ : జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ గురువారం రష్యా అధ్యక్షులు వ్లాదిమిర్ పుతిన్‌తో భేటీ అయ్యారు. ఉక్రెయిన్ ఘర్షణలకు ఒక పరిష్కారాన్ని కనుగొనేందుకు ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో ఈ భేటీ చోటు చేసుకుంది. సెయింట్ పీటర్స్ బర్గ్‌లో బ్రిక్స్ జాతీయ భద్రతా సలహాదారుల సమావేశం నేపథ్యంలో వీరు సమావేశమయ్యారు. వచ్చే నెల్లో జరగనున్న బ్రిక్స్ వార్షిక సదస్సుకు మోడీ హాజరవుతారని భావిస్తున్నామని, ఆ సమయంలో ఆయనతో ద్వైపాక్షిక సమావేశం జరుపుతామని పుతిన్ ప్రతిపాదించారు. భవిష్యత్తులో తీసుకునే కార్యాచరణలపై చర్చిస్తారని భావిస్తున్నారు. తన మిత్రుడు మోడీ రాక కోసం ఎదురుచూస్తున్నట్లు పుతిన్ చేసిన వ్యాఖ్యలను రష్యా మీడియా ఉటంకించింది. రష్యా జాతీయ భద్రతా సలహాదారు సెర్గి షోయిగుతో బుధవారం దోవల్ భేటీ అయ్యారు. పరస్పర ప్రయోజనాలు కలిగిన కీలకాంశాలపై చర్చించినట్లు తెలిపారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీతో మోడీ సమావేశం వివరాలు కూడా వీరి మధ్య ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. ఉక్రెయిన్, రష్యాల్లో మోడీ గత నెల్లో పర్యటించిన సంగతి తెలిసిందే.

వరద బాధితులకు కొనసాగుతున్న విరాళాల వెల్లువ

- సిఎం చంద్రబాబును కలిసి చెక్కులు అందించిన దాతలు
- రెడ్డి ల్యాబ్స్ రూ.5 కోట్లు, పత్తికొండ ఎమ్మెల్యే శ్యాంబాబు రూ 2.3 కోట్లు

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని ఎన్‌టిఆర్, గుంటూరు, కృష్ణా జిల్లాల్లో అనూహ్య వరదలతో అతలాకుతం అయిన వరద బాధితులకు ఆపన్న హస్తం అందించేందుకు పలువురు దాతలు స్వచ్ఛందంగా ముందుకొస్తున్నారు. సచివాలయంలో గురువారం కూడా పలువురు దాతలు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిని కలిసి తమ విరాళాల చెక్కులను అందజేశారు. రెడ్డి ల్యాబ్స్ ప్రతినిధి నారాయణరెడ్డి రూ.5 కోట్లు, పత్తికొండ ఎమ్మెల్యే కెఇ శ్యామ్‌బాబు నియోజకవర్గం తరఫున రూ2.30 కోట్లు, పెండ్యాల అచ్యుత రామయ్య (ఆంధ్రా సుగర్స్) రూ2 కోట్లు, విక్రం నారాయణరావు కుటుంబ సభ్యులు రూ1.55 కోట్లు, ఎం.వెంకటరామరాజు (వసుధా ఫార్మా) మహేశ్వరరెడ్డి



విరాళం అందచేస్తున్న రెడ్డి ల్యాబ్స్ ప్రతినిధి నారాయణరెడ్డి

(ఎఎంఆర్ (గ్రూప్)లు కోటి రూపాయల చొప్పున అందించాయి. హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, వైవి రామారావు (క్రెడాయ్ ఎపి), వెంకట్ అక్కినేని, శివశక్తి ఆగ్రోటెక్ ఛైర్మన్ నందిగామ శ్రీనివాసరావు, వినుకొండ ఎమ్మెల్యే జివి ఆంజనేయులు రూ.50 లక్షలు చొప్పున అందజేశారు. గణపతి సచ్చిదానంద ఆశ్రమం (మైసూరు), కోనేరు విమలాదేవి, కోనేరు ప్రదీప్ రూ.25 లక్షల చొప్పున. రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి (ఆర్కే ఇన్ ఫ్రా కార్పొరేషన్) రూ 20 లక్షలు అందించారు. సినీ హీరో జొన్నలగడ్డ సిద్ధార్థ, కృష్ణంరాజు సాగి (ఫ్రాంక్విన్ ఫార్ములేషన్స్ ప్రయివేట్ లిమిటెడ్) రూ.15 లక్షల చొప్పున అందజేశారు. ది రవాణా శాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి ద్వారా కాంట్రాక్ట్ క్యారేజీ బస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రూ.15 లక్షలు, తంబళ్లపల్లి టిడిపి ఇన్‌ఛార్జి జయచంద్రారెడ్డి (అన్నమయ్య జిల్లా కార్యకర్తల ద్వారా) రూ.15 లక్షలు, రావెళ్ల సతీష్ (సింహా మోటార్స్ ప్రయివేట్ లిమిటెడ్) రూ 10 లక్షల 116, సినీ హీరో విశ్వక్ సేన్, బొబ్బా గోపాలకృష్ణ, పువ్వాడ సుధాకర్‌రావు, వాస్తవ్య ప్రమోటర్స్ అండ్ డెవలపర్స్ రూ.10 లక్షల చొప్పున ఇచ్చారు. వికాస్ పబ్లిక్ స్కూల్, విశ్వం ప్రభాకర్ రెడ్డి, లక్ష్మీ రష్ హెల్త్ కేర్ ప్రయివేట్ లిమిటెడ్, కోగంటి వెంకటరామయ్య రూ.5 లక్షల చొప్పున, డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి రూ.5 లక్షలు, వాసిరెడ్డి సుగుణ కుమారి రూ.3 లక్షలు, దళవాయి వడ్డె సిమెంట్ పుల్లన్న రూ.2 లక్షలు, ఎన్‌టిఆర్ కుటీరం ఆర్ శివాజి రూ.లక్ష, కొండా భాస్కర్‌రావు రూ.10 వేలు, కె నిర్మల రూ.10 వేలను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికి అందజేశారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఎంటిఎస్

- సిఎంకు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ జెఎసి వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆప్కాస్, ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి మినీమం టైం స్కేల్(ఎంటిఎస్) అమలు చేయాలని రాష్ట్రప్రభుత్వ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్, టీచర్స్,వర్కర్ల జెఎసి, ఆప్కాస్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ కోరాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావుతో కలిసి ఆయా సంఘాల నాయకులు గురువారం సచివాలయంలో వినతిపత్రం అందించారు. ఇచ్చిన హామీ ప్రకారం సంక్షేమ పథకాలు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు అమలు చేయాలని, వారి కుటుంబ సభ్యులలో అర్హులైన వారికి సంక్షేమ పథకాలు కొనసాగించాలని కోరారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పదవి విరమణ వయస్సు 62ఏళ్లకు పెంచాలని తెలిపారు. 2014 జూన్ ముందు నుంచి ఎన్‌హెచ్‌ఎం, ఇతర వైద్య, ఆరోగ్యశాఖ స్కీంలలోపనిచేస్తున్న స్టాఫ్ నర్సులు, 2వ ఎఎన్‌ఎం, ఇతర క్యాడర్ల పారా మెడికల్ సిబ్బందిని, వివిధ వైద్య విభాగాల్లో ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. ఆలోపు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా గ్రాస్ శాలరీని చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఆరోగ్యబీమా అమలు చేయాలని కోరారు. సిఎంను కలిసిన వారిలో జెఎసి ఛైర్మన్, ఆప్కాస్ ఫెడరేషన్ గౌరవ అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, జెఎసి కో ఛైర్మన్ కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

యుపిలో దారుణం.. తల లేని మహిళ మృతదేహం

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో తలలేకుండా.. నగ్నంగా గుర్తుతెలియని మహిళ మతదేహం లభించడం కలకలం రేపుతోంది. కాన్పూర్ సమీపంలోని గుజైనా జాతీయ రహదారిపై బుధవారం ఉదయం మహిళ నగ్న మతదేహాన్ని పోలీసులు గుర్తించారు. బాధితురాలిపై అత్యాచారం చేసి, హత్యచేసి రహదారిపై పడేసే ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటన వెలుగులోకి వచ్చి 24 గంటలు గడిచినా ఈ కేసులో పోలీసులు ఎటువంటి పురోగతి సాధించలేదు. అయితే ఆమె ఎవరు? అనేది ఇంకా గుర్తించే ప్రక్రియ కొనసాగుతోంది. బుధవారం ఉదయం 5 గంటలకు తలలేని మహిళ మతదేహం కనిపించిందని పోలీసులు తెలిపారు. ఈ కేసు విచారణకు మూడు బందాలను ఏర్పాటు చేశారు. మతదేహం పడి ఉన్న ప్రాంతానికి సమీపంలోని సిసిటివి ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నారు. సంఘటన స్థలం దగ్గర ఎలాంటి సిసిటివి కెమెరాలు లేవు కానీ.. హైవేకి అవతలి వైపున ఉన్న ఆసుపత్రి వద్ద ఉన్న సిసిటివి కెమెరాల్లో మతదేహాన్ని గుర్తించడానికి కొన్ని గంటల ముందు అలాగే ఉన్న ఓ మహిళ నడుచుకుంటూ వెళ్లడం రికార్డయ్యిందని పోలీసులు తెలిపారు. మతికి గల కారణాలను నిర్ధారించేందుకు మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. జిల్లాలో మహిళ మిస్సింగ్‌పై తమకు ఎటువంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు. అయితే ఈఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

ట్రైనీ ఆర్మీ అధికారులను బెదిరించి.. స్నేహితురాలిపై సామూహిక లైంగికదాడి

భోపాల్: స్నేహితురాళ్లతో కలిసి బయటకు వెళ్లిన ఆర్మీ ట్రైనీ అధికారులపై దుండగులు విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారు. వారిని నిలువునా దోచేశారు. అంతటితో ఆగకుండా వారి స్నేహితురాలిపై సామూహిక లైంగికదాడికి పాల్పడ్డారు.వివరాల్లోకి వెళితే.. ఇండోర్‌లోని మోవ్ ఆర్మీ కాలేజీలో శిక్షణలో ఉన్న ఇద్దరు ఆర్మీ అధికారులు తమ స్నేహితురాళ్లతో కలిసి చొట్టి జామ్ వద్ద ఉన్న ఫైరింగ్ రేంజ్‌కు వెళ్లారు. ఈ క్రమంలో వారిని కొంతమంది వ్యక్తులు వారిని చుట్టుముట్టారు. తుపాకులు, కత్తులు, కర్రలతో బెదిరించారు. వారి వద్ద ఉన్న డబ్బు, నగలను తీసుకున్నారు. ఆ తర్వాత మహిళల్లో ఒకరిపై అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ దాడి నుంచి తప్పించుకున్న ఓ ట్రైనీ ఆఫీసర్ తన యూనిట్‌కు చేరుకుని కమాండింగ్ ఆఫీసర్‌కు జరిగిన విషయం చెప్పారు. దీంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. ఆర్మీ అధికారులతో కలిసి పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. అయితే అప్పటికే దుండగులు అక్కడి నుంచి పారిపోయారు. బాధితులను దవాఖానకు తరలించారు. మహిళకు వైద్య పరీక్షలు నిర్వహించగా.. లైంగికదాడి జరిగినట్లు నిర్ధరించారు. ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు నిందితుల్లో ఇద్దరిని అరెస్టు చేశారు.

శ్రుతి జీవితంలో మరో తీవ్ర విషాదం!

కేరళ: ఇటీవల సంభవించిన వయనాడ్ విలయంలో తల్లిదండ్రులు సహా 9 మంది కుటుంబ సభ్యులను కోల్పోయిన శ్రుతి జీవితంలో మరో గుండె కోత మిగిల్చింది. వయనాడ్ జిల్లాలోని చురాల్‌మల్ గ్రామానికి చెందిన 24 ఏళ్ల శ్రుతికి జూన్ 2న తన చిరకాల మిత్రుడైన జెన్సన్ (27)తో వివాహ నిశ్చితార్థం జరిగింది. మతాంతరమైనా ఇరు కుటుంబాలు వీరి పెళ్లికి అంగీకరించాయి. ఆ తర్వాత జూన్ 30న వయనాడ్‌లో సంభవించిన ప్రకతి విలయం శ్రుతి జీవితాన్ని అతలాకుతలం చేసింది. వరదలు, కొండచరియల కారణంగా ఆమె తల్లిదండ్రులు, సోదరి సహా 9 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇంతటి క్లిష్ట సమయంలో ఆమెకు అండగా నిలిచిన ఒకే ఒక వ్యక్తి జెన్సనే. ఆమె కోసం ఉద్యోగాన్ని సైతం వదులుకొని అనుక్షణం ఆమె వెంటే ఉన్నాడు. మోడీ పర్యటన సమయంలోనూ వీరిద్దరూ కలిసే మాట్లాడారు. జాతీయ మీడియాలోనూ వారి గురించి వార్తలొచ్చాయి. శ్మశాన వాటికలో కుటుంబ సభ్యులకు నివాళులు అర్పిస్తూ జీవితాంతం ఒకరికి ఒకరం తోడుంటామని బాసలు చేసుకున్నారు. ఈ నెలలో పెళ్లి చేసుకోబోతున్నట్టు ప్రకటించారు.

ప్రకతి విలయంలో సర్వం కోల్పోయిన తరుణంలో జెన్సన్ రూపంలో దొరికిన అండ కూడా తాజాగా కోల్పోయింది శ్రుతి. ఈ నెల 10న శ్రుతి, జెన్సన్‌తోపాటు ఇతర కుటుంబ సభ్యులు వ్యానులో వెళ్తుండగా కోజికోడ్-కొల్లేగల్ జాతీయ రహదారిపై వీరి వ్యాన్-ప్రైవేటు బస్ ఢీకొన్నాయి. ఈ ఘటనలో జెన్సన్ తీవ్రంగా గాయపడగా, మిగతా వారు స్వల్పంగా గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన జెన్సన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గత రాత్రి మతి చెందాడు. ఉన్న ఒకే ఒక్క అండ కోల్పోవడంతో శ్రుతి ఇప్పుడు దిక్కులేనిదై విలపిస్తోంది.

పరిశ్రమల ఏర్పాటులో అర్థంలేని నిబంధనలు వద్దు

- సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పరిశ్రమల ఏర్పాటులో అర్థంలేని నిబంధనలు తొలగించి సులభంగా అనుమతులివ్వాలని ఆదేశించారు. నిర్దేశించిన సమయంలో అనుమతి ఇవ్వకపోతే ఆటోమెటిక్‌గా అనుమతులు పొందే విధానాన్ని అమల్లోకి తేవాలని చెప్పారు. సూక్ష్మ, చిన్న,మధ్య తరహా (ఎంఎస్‌ఎంఇ), ఆహార శుద్ధి పరిశ్రమల శాఖలపై గురువారం సచివాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఉపాధి కల్పనలో కీలకమైన ఎంఎస్‌ఎంఈల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇచ్చి వాటికి చేయూతను ఇస్తుందని చంద్రబాబు చెప్పారు. అనేక సవాళ్లతో దెబ్బతిన్న ఈ రంగాన్ని సరికొత్త విధానాల ద్వారా మళ్లీ గాడిన పెడతామని అన్నారు. భూములు కలిగిన రైతులు, ప్రైవేట్ భాగస్వామ్యంతో ఎంఎస్‌ఎంఇ పరిశ్రమల కోసం పార్కులు ఏర్పాటు చేసుకునే విధానాన్ని అమల్లోకి తేవాలని సూచించారు. ప్రభుత్వం నుంచి తగు ప్రోత్సాహం అందిస్తే ఈ రంగం ద్వారా మంచి ఫలితాలను సాధించవచ్చని తెలిపారు. ప్యాకింగ్, డిజిటల్ కామర్స్, మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తే చిన్న పరిశ్రమల ఉత్పత్తులకు డిమాండ్ లభిస్తుందని చెప్పారు. డ్వాక్రా సంఘాల వంటి వాటిని వీటిల్లో అనుసంధానం చేయాలని వెల్లడించారు. ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న పరిశ్రమల ఇన్సెంటివ్స్‌ను ఇవ్వాల్సిన అవసరం ఉందని, వీటిపై కసరత్తు చేయాలని అధికారులకు సూచించారు. సాంకేతికత ద్వారా ఉత్పత్తి సామర్థ్యం పెంచేలా అధికారులు కార్యచరణ అమలు చేయాలని చెప్పారు. ఆటోనగర్లను మోడ్రనైజేషన్ చేయాలని, ఎలక్ట్రిక్ వెహికల్స్‌కు సర్వీస్ అందించే విధంగా నైపుణ్యం పెంచాలని అన్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న 7 క్లస్టర్లను పూర్తి చేయాలని చెప్పారు. ఎంఎస్‌ఎంఈకి క్రెడిట్ గ్యారెంటీకి రూ.100కోట్లు కేటాయిస్తామని చెప్పారు. విశ్వకర్మ వంటి కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా వ్యాపారులకు రుణాలు, ప్రోత్సాహకాలు, శిక్షణ అందేలా చూడాలని ఆదేశించారు. ఫుడ్ ప్రాసెసింగ్‌కు రాష్ట్రంలో అపార అవకాశాలు, అనువైన పరిస్థితులు ఉన్నాయని సిఎం అన్నారు. హార్టీకల్చర్, ఆక్వా కల్చర్ ఉత్పత్తులకు, ఆహార శుద్ధి పరిశ్రమ ద్వారా ఆదాయాలు పెరుగుతాయని చెప్పారు. రైతులు పండించిన పంటలకు వారే వాల్యూఎడిషన్ ఇచ్చుకునే పరిస్థితి కల్పించే విధంగా పాలసీ తీసుకురావాలని అన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే పంటలకు ఎక్కువ డిమాండ్ ఉంటుందని, వాటిని ప్రోత్సహించాలని తెలిపారు. టమాటా, మామిడి, మిరప, పసుపు, ఆక్వా ఉత్పత్తులకు అక్కడే ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తే రైతులకు మేలు జరుగుతుందని చెప్పారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగాన్ని ఎంఎస్‌ఎంఇలతో అనుసంధానం చేసి గ్రామాల్లో ప్రోత్సాహకం అందించాలని చెప్పారు. ఈ సమీక్షలో మంత్రులు టిజి భరత్, కొండపల్లి శ్రీనివాస్ ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజలను ఐక్యం చేయడానికే ప్రచారం

- ఇంజనీర్ రషీద్ వెల్లడి

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్ ప్రజలను విభజించేందుకు తాను రాలేదని, ప్రజలందరినీ ఐక్యం చేసేందుకే తాను జైలు నుంచి వచ్చి ప్రచారం చేస్తున్నానని బారాముల్లా ఎంపి ఇంజనీర్ రషీద్ తెలిపారు. ప్రజల కోసం పోరాడేందుకు తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ఢిల్లీలోని తీహార్ జైల్లో ఉన్న ఆయన ఇటీవలె బెయిల్‌పై విడుదలయ్యారు. ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ 'నేను ఐదున్నరేళ్లుగా జైలులో ఉన్నాను. ఇప్పుడు ప్రజల కోసం పోరాడేందుకు సిద్ధంగా ఉన్నాను. ప్రజలను విభజించడానికి కాదు, వారిని కలపడానికే వచ్చాను. కాశ్మీర్‌లో శాశ్వత శాంతిని తీసుకురావాలనుకుంటున్నాను. కశ్మీరీలు రాళ్లదాడి చేసేవారు కాదని నిరూపించాలనుకుంటున్నాను. రాజకీయంగా పొందే హక్కుల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు. ప్రధాని చెప్పిన నయా కశ్మీర్ విధానంపైనా పోరాటం కొనసాగుతుంది" అని రషీద్ తెలిపారు. ఉగ్ర కార్యకలాపాలకు నిధులు సమకూర్చారన్న అభియోగాలపై 2019 ఆగస్టులో ఇంజినీర్ రషీద్ అరెస్టయిన సంగతి తెలిసిందే.

పవన్‌కల్యాణ్ క్యాంప్ కార్యాలయం మార్పు

● మంగళగిరిలోని తన నివాసానికి మార్చాలని నిర్ణయం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ మంగళగిరిలోని తన నివాసాన్ని క్యాంపు కార్యాలయంగా వినియోగించుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు గురువారం ఆయన లేఖ రాశారు. ప్రస్తుతం విజయవాడలోని ఇరిగేషన్ కార్యాలయం ఆవరణలో వున్న భవనాన్ని పవన్‌కల్యాణ్ క్యాంప్ కార్యాలయంగా వినియోగించుకుంటున్నారు. విశాలమైన భవనాన్ని తనకు క్యాంపు కార్యాలయంగా కేటాయించినందుకు సిఎంకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం విజయవాడ క్యాంప్ కార్యాలయంలో వున్న ఫర్నీచర్‌ను వెనక్కు తీసుకోవాల్సిందిగా ఆ లేఖలో పవన్ కల్యాణ్ కోరారు.

చంద్రబాబుతో ఉత్తమకుమార్ భేటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తెలంగాణా రాష్ట్ర మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి తన సతీమణి కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డితో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడితో భేటీ అయ్యారు. గురువారం రాష్ట్ర సచివాలయంలోని సిఎంఒకు వెళ్లి సిఎం చంద్రబాబునాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దంపతులు చంద్రబాబునాయుడికి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా వారిరువురు తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు, ప్రభుత్వ కార్యక్రమాలపై చర్చించుకున్నట్లు తెలిసింది.



గుంటూరు జిల్లా పెదకాకానిలో కేంద్ర బృందానికి వినతి పత్రం ఇస్తున్న సిపిఎం, రైతు సంఘం నేతలు



విజయవాడ కలెక్టరేట్‌లో ఛాయాచిత్రాల ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న కేంద్ర బృందం

నష్టంపై కేంద్రానికి నివేదిస్తాం

● గుంటూరు, ఎన్‌టిఆర్ జిల్లాల్లో కేంద్ర బృందాల పర్యటన

ప్రజాశక్తి-యంత్రాంగం

అతి భారీ వర్షాలు, వరదలపై నష్టం అంచనా వేసి కేంద్రానికి నివేదికలు ఇస్తామని కేంద్ర బృందాలు తెలిపాయి. ఇటీవల రాష్ట్రంలో కురిసిన వర్షాలకు తీవ్రంగా దెబ్బతిన్న గుంటూరు, ఎన్‌టిఆర్ జిల్లాల్లో కేంద్ర బృందాలు గురువారం పర్యటించాయి. ఎన్‌టిఆర్ జిల్లాలో కేంద్ర హోంశాఖ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి అనిల్ సుబ్రమణ్యం నేతృత్వంలో కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ విజయవాడ ప్రాంతీయ కార్యాలయం చీఫ్ ఇంజనీరు రాకేష్ కుమార్, హైదరాబాద్‌లోని ఇస్రో నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ శాస్త్రజ్ఞులు డాక్టర్.ఎస్‌విఎస్‌పి శర్మ సభ్యులుగా ఉన్న కేంద్ర బృందం పర్యటించింది. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారుల నుంచి నష్టాల వివరాలు తెలుసుకున్న అనంతరం ప్రకాశం బ్యారేజీని సందర్శించింది. బ్యారేజ్ గేట్లను బోట్లు ఢీకొన్న ప్రాంతాన్ని పరిశీలించింది. జరిగిన నష్టాన్ని తెలుసుకుంది. బోట్ల తొలగింపు పనులను పరిశీలించింది. ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లి శాంతినగర్ వద్ద బుడమేరు డైవర్షన్ ఛానల్ (బిడిసి)కు గండ్లు పడిన ప్రదేశాన్ని పరిశీలించి యుద్ధప్రాతిపదికన గండ్లను పూడ్చిన తీరును అధికారులను అడిగి తెలుసుకుంది. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావులతో కేంద్ర బృందం సభ్యులు చర్చించి వివరాలు సేకరించారు. ఇబ్రహీంపట్నం మండలం ఈలప్రోలులో వరి పంటకు జరిగిన నష్టాన్ని తెలుసుకున్నారు. విజయవాడ జక్కంపూడిలో పర్యటించి వరద ప్రభావిత ప్రజలతో మాట్లాడారు. కలెక్టర్ డాక్టర్ జి.సృజన జిల్లాలో జరిగిన నష్టం వివరాలను బృందం దృష్టికి తీసుకెళ్లారు.

గుంటూరు కలెక్టరేట్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ అనంతరం పెదకాకాని, మంగళగిరి, తెనాలి, తాడేపల్లి తదితర ప్రాంతాల్లో మరో కేంద్ర బృందం పర్యటించింది. మంగళగిరిలో భారీ వర్షాలకు మునిగిన చేనేత మగ్గాలను బృందం సభ్యులు పరిశీలించి చేనేత కార్మికులతో మాట్లాడారు. వస్త్రాల తయారీలో చేనేత కార్మికుల నైపుణ్యాన్ని పరిశీలించారు. చేనేత కార్మికులు వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. వర్షాల వల్లన ప్రతిఏటా జరిగిన నష్టాన్ని వారికి వివరించారు. గుంట మగ్గాలకు బదులుగా స్టాండ్ మగ్గాలను ఇవ్వాలని కోరారు. పెదకాకానిలో కేంద్ర బృందానికి సిపిఎం నేతలు నివేదిక సమర్పించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ జిల్లాలో వరి, ప్రత్తి, మిర్చి, కంద, అరటి, పసుపు, నిమ్మ, తమలపాకులు, కూరగాయల పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. పంటలన్నీ నీట మునిగి సర్వం కోల్పోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. తాడేపల్లి మహానాడులో నీట మునిగిన 800 ఇళ్లను బృందం సభ్యులు పరిశీలించారు. జరిగిన నష్టంపై అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని సభ్యులు తెలిపారు.



మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు, కార్పొరేటర్ గంగారావు తదితరులు

స్టీల్ ప్లాంటు రక్షణకు 15న మహాధర్నా : సిపిఎం

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)

స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం ఈ నెల 15న పాత గాజువాకలో మహాధర్నా నిర్వహించనున్నట్లు సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు తెలిపారు. మహాధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను విశాఖలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు, బి.పద్మ, బి.ఈశ్వరమ్మ, బి.జగన్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ.. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, ప్లాంట్‌కు సొంత గనులు, వర్కింగ్ కేపిటల్ ఇవ్వాలని, ప్లాంట్‌ను పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడిపించాలని, ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయాలని, నిర్వాసితులకు ఉద్యోగాలివ్వాలని, కార్మికులందరికీ సకాలంలో జీతాలివ్వాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్‌ను రోజు రోజుకూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దెబ్బతీస్తున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎందుకు నిలదీయడంలేదని ప్రశ్నించారు. సెయిల్‌లో విలీనం చేసేందుకు టిడిపి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు చేపట్టే ధర్నాలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సురేష్‌ను పరామర్శిస్తే తప్పేంటి

● మాజీ మంత్రి మేరుగ నాగార్జున

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అక్రమ కేసులో అరెస్టయి జైలులో వున్న దళిత నాయకుడు, మాజీ ఎంపి నందిగం సురేష్‌ను తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శించడాన్ని చంద్రబాబునాయుడు తప్పుపట్టడం తగదని మాజీ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. గురువారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. అక్రమ కేసులో వున్న నందిగం సురేష్ కుటుంబానికి వైఎస్ జగన్ అండగా నిలిస్తే తట్టుకోలేకపోతున్నారని అన్నారు. ముద్దాయిని చూడడానికి జైలుకు వెళ్లారని మాట్లాడటం తగదని అన్నారు. ఒక దళిత నేతను పరామర్శించడానికి వెళ్తే అంత చులకనగా మాట్లాడటం చంద్రబాబునాయుడి స్థాయికి తగదని చెప్పారు. సురేష్‌ను కలిసేందుకు జగన్‌మోహన్‌రెడ్డి వెళ్లినప్పుడు ప్రజలు పెద్దఎత్తున రావడాన్ని తెలుగుదేశం జీర్ణించుకోలేక ఇలాంటి చౌకబారు విమర్శలకు పాల్పడుతోందని అన్నారు.

మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌పరం చేస్తే ఉద్యమిస్తాం : జూపూడి

రాష్ట్ర విద్యార్థుల వైద్య విద్య కలలను తెలుగుదేశం ప్రభుత్వం ఛిద్రం చేస్తోందని వైసిపి నేత జూపుడి ప్రభాకర్ అన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో తెచ్చిన 17 మెడికల్ కాలేజీల్ని ప్రైవేట్‌పరం చేయడం తగదని చెప్పారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌పరం చేస్తే పేదలకు వైద్యం అందకుండా పోతుందన్నారు. ప్రజలను, విద్యార్థులను సమీకరించి పెద్దఎత్తున ఉద్యమాలను చేపడతామని అన్నారు.

తగ్గుముఖం పట్టిన గోదావరి

● భద్రాచలం వద్ద సాధారణ స్థితికి ప్రవాహం

ప్రజాశక్తి- యంత్రాంగం

ఉధృతంగా ప్రవహించిన గోదావరి గురువారం తగ్గుముఖం పట్టింది. భద్రాచలం వద్ద 41.10 అడుగులకు నీటి మట్టం తగ్గింది. దీంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించుకున్నారు. చింతూరు వద్ద శబరి 41 అడుగులకు తగ్గింది. వరద నీరు రహదారులపై పూర్తిగా తొలగకపోవడంతో జాతీయ రహదారి-30పై చింతూరు మండలం చట్టి గ్రామం వద్ద ఛత్తీస్‌గఢ్ - ఆంధ్ర రహదారిపై వందల సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. ఒడిశా- ఆంధ్రా రహదారి కూడా వరద ముంపులోనే ఉంది. వరద బాధితులు చింతూరులోని శబరి పరివాహక బ్రిడ్జి అప్రోచ్ రోడ్డుపై టార్పాలిన్లతో గుడారాలు వేసుకుని నివాసముంటున్నారు. విఆర్.పురం మండలం వడ్డిగూడెం, శ్రీరామగిరి గ్రామాల్లో ఇంకా పూర్తి స్థాయిలో వరద తగ్గలేదు. రేఖపల్లి పునరావాస కేంద్రాల్లోనే బాధితులు తలదాచుకుంటున్నారు.

ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద 14.40 అడుగుల నీటిమట్టం నమోదైంది. ఇక్కడ రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. బ్యారేజీ 175 గేట్లను ఎత్తి 13,77,656 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి అధికారులు విడుదల చేస్తున్నారు. నీట మునిగిన మామిడికుదురులో అప్పనపల్లి కాజ్‌వే, ముమ్మిడివరంలో కనకాయిలంక కాజ్‌వే వరదనీటి నుంచి బయటపడ్డాయి. మామిడికుదురు మండలం అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నం లంక, అయినవిల్లి మండలం వీరవెల్లిపాలెం, మూలపాలెం, కొందుకుదురు, అయినవిల్లిలంక, పల్లపులంక, శానపల్లిలంక, అద్దంకి వారిలంక, పి.గన్నవరం మండలం శివాయలంక, గంటిపెదపూడి లంక, అరిగెల వారిలంక, ఊడిమూడిలంక, బూరుగులంక, పెదపట్నం లంకల్లో ఇంకా కొంత మేర ముంపు కొనసాగుతుంది. ఏలూరు జిల్లాలోని కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో వరద నీరు ఇంకా తగ్గలేదు. కుక్కునూరు-దాచారం, ఇంజరం-ముత్యాలంపాడు కాజ్‌వేలపై వరద అలాగే ఉంది. దీంతో 15 గ్రామాలకు రాకపోకలు పునరుద్ధరణ కాలేదు. పశ్చిమగోదావరి జిల్లాలో వశిష్ట గోదావరి వరద ఉధృతి కాస్త తగ్గుముఖం పట్టింది.



చింతూరు వద్ద బ్రిడ్జి అప్రోచ్ రోడ్డుపై గుడారాలు వేసుకొని నివాసమున్న శబరి ఒడ్డు ప్రజలు

మంత్రి సంధ్యారాణి ఎస్కార్ట్ వాహనానికి ప్రమాదం

● ఎనిమిది మందికి గాయాలు

ప్రజాశక్తి - రామభద్రపురం

రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖామంత్రి గుమ్మడి సంధ్యారాణి ఎస్కార్ట్ వాహనానికి గురువారం ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. విజయనగరం జిల్లా మెంటాడలో జరిగే ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు సాలూరు నుంచి మంత్రి బయలుదేరారు. ఆమె ప్రయాణిస్తున్న వాహనానికి ముందు ఎస్కార్ట్ వాహనం బయలుదేరింది. విజయనగరం జిల్లా రామభద్రపురం మండల పరిధిలో ఆరికతోట పెట్రోల్ బంకు సమీపంలో డిసిఎం వ్యానును ఎస్కార్ట్ వాహనం ఢీ కొట్టింది. ఎస్కార్ట్ వాహనంలో ఉన్న ఎఆర్ ఎస్ఐ రమణ, హెచ్‌సి సునీల్, కానిస్టేబుళ్లు గణపతి, మహేష్, వాహన డ్రైవర్ ఎబివిఎస్‌ఎన్ రాజు, డిసిఎం వ్యాన్‌లో ఉన్న డ్రైవర్ బుగత త్రినాథరావు, బోను గౌరమ్మ, కడుగండి సీతమ్మకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను బాడంగి సిహెచ్‌సి, అరికతోట పిహెచ్‌సికి తరలించారు.



కారుపై కంటైనర్ బోల్తా

● ముగ్గురు మృతి

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి)

తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం భాకరాపేట ఘాట్ రోడ్డులో కంటైనర్ అదుపుతప్పి కారుపై పడింది. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు అక్కడికక్కడే మరణించారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు..

కర్ణాటక రాష్ట్రం చిక్‌బల్లాపూర్‌కు చెందిన ఓ కుటుంబం శ్రీవారి దర్శనం అనంతరం గురువారం మధ్యాహ్నం కారులో తిరుగు ప్రయాణమైంది. చంద్రగిరి మండలం భాకరాపేట ఘాట్‌రోడ్డులో వెళుతుండగా... కలకడ నుంచి టమోటా లోడ్‌తో వస్తున్న కంటైనర్ ఓ మలుపు వద్ద అదుపు తప్పి కారుపై పడింది. ఈ ఘటనలో కారులోని రమేష్ మూర్తి (34), హెచ్‌కె మంజునాథ (38), హెచ్.మునివెంకటరెడ్డి (55) అక్కడికక్కడే మరణించారు. తేజస్‌కుమార్, తమిళనాడు రాష్ట్రం తిరుచ్చి జిల్లాకు చెందిన కంటైనర్ డ్రైవర్ అల్లావుద్దీన్‌లకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని కారులో ఇరుక్కుపోయిన వారిని భారీ క్రేన్ సాయంతో అతి కష్టం మీద బయటకు తీశారు. క్షతగాత్రులను తిరుపతి రుయాకు తరలించారు.

ఎకరాకు రూ.25 వేలు పరిహారమివ్వాలి

● ఎపి పిసిసి చీఫ్ షర్మిల

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి, పెద్దాపురం

వరదల వల్ల పంటలను నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల పరిహారం తక్షణమే ఇవ్వాలని ఎపి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్.షర్మిల డిమాండ్ చేశారు. కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం కాండ్రకోటలో నీట మునిగిన పంట పొలాలను ఆమె గురువారం పరిశీలించారు. బాధిత రైతులతో మాట్లాడి పంట నష్టం వివరాలను సేకరించారు. ఏలేరు వరదల వల్లన పూర్తిగా నష్టపోయామని రైతులు ఆమె ఎదుట వాపోయారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ వరదల వల్ల ఒక్కో రైతు ఇప్పటి వరకు రూ.30 వేల వరకు పెట్టుబడి నష్టపోయారని తెలిపారు. పదేళ్లుగా ఏలేరు ఆధునికీకరణపై చంద్రబాబు, జగన్ పట్టించుకోలేదన్నారు. జగన్ హయాంలో ఈ ప్రాజెక్టులను గాలికి వదిలేశారని విమర్శించారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా 6 లక్షల ఎకరాలకు నష్టం వాటిల్లిందని తెలిపారు. నష్టపోయిన రైతులను ఎకరాకు రూ.25 వేల పరిహారం ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.



పెద్దాపురంలో వంతెన పైనుండి ఏలేరు వరద నీటిని పరిశీలిస్తున్న షర్మిల

కొనసాగుతున్న బోట్ల తొలగింపు పనులు

ప్రజాశక్తి - వన్‌టౌన్ (విజయవాడ)

విజయవాడ ప్రకాశం బ్యారేజీ గేట్ల వద్ద అడ్డుపడిన బోట్లను తొలగించేందుకు నిపుణులు శ్రమిస్తున్నారు. ప్రకాశం బ్యారేజీ గేట్లను ఐదు బోట్లు ఢీకొట్టిన ఘటనలో దెబ్బతిన్న 67, 69, 70 ఖానాల వద్ద ఉన్న బోట్లను విశాఖపట్నం నుండి వచ్చిన 10 మందితో కూడిన సీ లయన్' సంస్థకు చెందిన బృందం కట్ చేసి తొలగించే పనులను గురువారం కూడా కొనసాగించింది. బోట్లు 40 నుంచి 50 టన్నుల బరువుతో ఉండడంతో ఉదయం నుంచి కొంతమేర మాత్రమే కట్ చేశారు. దీంతో ఈ ప్రక్రియ మరికొన్ని రోజులు పట్టే అవకాశం ఉందని జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. తొలుత బోట్లను క్రేన్ ద్వారా బయటకు తీ.యాలని ప్రయత్నించినా సాధ్యం కాలేదు. గ్యాస్ కట్టర్లతో బోట్ల తొలగింపు పనులు మరో రెండు, మూడు రోజులు కొనసాగవచ్చని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మీడియాకు తెలిపారు.



బోటును కటింగ్ చేస్తున్న డైవింగ్ టీమ్

మైక్రోసాఫ్ట్ 'ఎక్‌బాక్స్'లో 650 ఉద్యోగులపై వేటు

● ఈ ఏడాదిలో మూడోసారి ఉద్వాసనలు

న్యూఢిల్లీ : దిగ్గజ టెక్ కంపెనీ మైక్రోసాఫ్ట్‌కు చెందిన వీడియో గేమ్స్ డివిజన్ ఎక్స్‌బాక్స్‌లో వందలాది మంది ఉద్యోగులు రోడ్డున పడనున్నారు. ఈ సంస్థ 650 మంది ఉద్యోగులపై వేటు వేయనుందని బ్లూమ్‌బర్గ్ ఓ రిపోర్ట్‌లో తెలిపింది. కంపెనీ ఖర్చులను తగ్గించడానికి తోడు యాక్టివిజన్ బ్లిజార్డ్ ఇంక్‌ను 69 బిలియన్ డాలర్లకు కొనుగోలు చేస్తోన్న నేపథ్యంలో ఉద్వాసనలు చేపడుతోంది. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు మైక్రోసాఫ్ట్‌లో మూడు సారి తొలగింపులు చేపట్టడం గమనార్హం.

సిబ్బందిని తొలగిస్తున్నప్పటికీ తమ గేమ్‌లు, పరికరాలు, సేవలు రద్దు చేయడం లేదని.. స్టూడియోలను మూసివేయడం లేదని ఆ కంపెనీ పేర్కొన్నట్లు బ్లూమ్‌బర్గ్ తెలిపింది. ఈ ఏడాది జనవరిలోనూ మైక్రోసాఫ్ట్ 1,900 ఉద్యోగులకు కోత పెట్టింది. వాటిలో చాలా ఉద్యోగాలు యాక్టివిజన్ యూనిట్లు, స్టూడియోల్లోనే చోటు చేసుకున్నాయి.



మరోమారు గడిచిన మేలోనూ మైక్రోసాఫ్ట్ నాలుగు స్టూడియోలను మూసివేసింది. జెనిమాక్స్‌ను 7.5 బిలియన్ డాలర్లకు స్వాధీనం చేసుకునే ప్రక్రియలో స్టూడియోలను మూసివేయడం ద్వారా అనేక మంది సిబ్బందిని ఇంటికి పంపించింది.

ఇది కేవలం మైక్రోసాఫ్ట్‌లో మాత్రమే జరగడం లేదని.. గేమింగ్ పరిశ్రమలోనే ఏదో సంక్షోభానికి సంకేతమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సోనీ గ్రూపు కార్ప్‌నకు చెందిన ఇంటరాక్టివ్ సాఫ్ట్‌వేర్ ఐఎన్‌సి, ఎలక్ట్రానిక్ ఆర్ట్స్‌లోనూ ఇటీవల ఉద్యోగులకు ఉద్వాసనలు జరిగాయి. మరోవైపు మార్కి ప్రాజెక్ట్స్‌ను పూర్తిగా మూసివేశారు. గేమింగ్ రంగంలో మందగమనం వల్లే ఈ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయని అంచనా.

పిడబ్ల్యుసిలో 1800 మందికి కోత

అమెరికాలోని ఆర్థిక సేవల దిగ్గజం ప్రైస్ వాటర్ హౌస్‌కూపర్స్ (పిడబ్ల్యుసి) ఉద్యోగులకు కోత పెడుతోంది. ఆ సంస్థ 2009 తర్వాత తొలిసారి ఉద్వాసనలకు పాల్పడనుంది. అమెరికాలో దాదాపు 1800 మంది ఉద్యోగులను విధుల నుంచి తొలగించేందుకు తాజాగా సిద్ధమయ్యింది. అసోసియేట్స్, మేనేజింగ్ డైరెక్టర్లు, బిజినెస్ సర్వీసులు, ఆడిట్, పన్ను విభాగాల్లో పనిచేసే ఉద్యోగులపై ప్రధానంగా ప్రభావం పడనుందని రిపోర్టులు వస్తున్నాయి. ప్రధానంగా పిడబ్ల్యుసి అడ్వైజరీ, ప్రోడక్ట్స్, టెక్నాలజీ ఆపరేషన్స్ విభాగాలపై పెను ప్రభావం పడనుందని తెలుస్తోంది. బాధితుల్లో సగం మంది అమెరికా వెలుపల పనిచేసే ఉద్యోగులేనని సమాచారం. విస్తృత పునర్వ్యవస్థీకరణ ప్రణాళికల్లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పిడబ్ల్యుసి యుఎస్ లీడర్ పౌల్ గ్రిగ్స్ తెలిపారు.

ఇంధన ధరలు తగ్గొచ్చు

● పెట్రోలియం శాఖ కార్యదర్శి అంచనా

న్యూఢిల్లీ : అధిక ధరల దెబ్బకు ఇటీవలి పార్లమెంట్ ఎన్నికల్లో భారీగా పతనమైన బిజెపి ప్రభుత్వం.. త్వరలో పలు రాష్ట్రాల్లో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో అప్రమత్తమవుతోంది. హెచ్చు పెట్రోల్ ధరలపై ప్రజలు ఆగ్రహంతో ఉండటంతో ఉపశమనం చర్యలపై ఆలోచనలు చేస్తోందని సమాచారం. దీర్ఘకాలంలో ముడి చమురు ధరలు నిలకడగా కొనసాగితే దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరల తగ్గింపునకు ఆయిల్ కంపెనీలు మొగ్గు చూపుతాయని పెట్రోలియం కార్యదర్శి పంకజ్ జైన్ అన్నారు. దీంతో ఆయన ధరల తగ్గింపునపై సంకేతాలు ఇచ్చినట్లయ్యింది. చమురు ధరలు ఇటీవల మూడేళ్ల కనిష్ట స్థాయికి తగ్గాయి. అయినప్పటికీ దేశంలోని అనేక నగరాల్లో లీటర్ పెట్రోల్ ధరలు రూ.100 పైనే కొనసాగుతున్నాయి. కాగా.. త్వరలో మహారాష్ట్ర, హర్యాణ వంటి కీలక రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పెట్రో ధరలపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.

ఇద్దరు రైతులు ఆత్మహత్య

ప్రజాశక్తి- గార్లదిన్నె, ఆస్పరి

అప్పుల బాధ తాళలేక గురువారం ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు... అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం మర్తాడు గ్రామానికి చెందిన రైతు ఓబులేసు(28) తనకున్న మూడు ఎకరాల్లో వేరుశనగ సాగుచేశారు. సాగు కోసం రూ.ఆరు లక్షల వరకు అప్పులు చేశారు. గత రెండేళ్లుగా పంటలు చేతికందకపోవడంతో అప్పుల భారం అధికమైంది. ఈ ఏడాది కూడా పంట దక్కకపోవడంతో మరింత భారం పెరిగింది. అప్పులు తీరేదారి లేక ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కర్నూలు జిల్లా ఆస్పరి మండలం బిల్లేకల్లు గ్రామానికి చెందిన రైతు మనీ సుంకన్న (38) తనకున్న నాలుగు ఎకరాల పొలంలో పత్తి సాగు చేశారు. ఇందు నిమిత్తం రూ. ఆరు లక్షలు అప్పు చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా పంటలు చేతికందకపోవడం, దక్కిన పంటకు సరైన ధర లేకపోవడంతో అప్పులకు వడ్డీ భారం అధికమైంది. రుణదాతల ఒత్తిడి, అప్పులు తీరే దారిలేకపోవడంతో తన పొలంలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.



ఓబులేసు (ఫైల్)



మారుతి స్విఫ్ట్‌లో సిఎన్‌జి ఆవిష్కరణ

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద కార్ల విక్రయ కంపెనీ మారుతి సుజుకి అందిస్తున్న స్విఫ్ట్‌లో తాజాగా సిఎన్‌జి వేరియంట్‌ను ఆవిష్కరించింది. గురువారం విడుదల చేసిన ఈ వాహనం ఎక్స్‌షోరూం ప్రారంభ ధరను రూ.8.19 లక్షలుగా నిర్ణయించింది. దీంతో తమ పోర్టుపోలియోలో 14 సిఎన్‌జి మోడల్స్ అందుబాటులోకి తెచ్చినట్లయ్యిందని మారుతి సుజుకి తెలిపింది. కొత్త స్విఫ్ట్ సిఎన్‌జి వేరియంట్ 1.2 లీటర్ల జడ్ సిరీస్ డ్యూయల్ వివిటి ఇంజిన్‌తో లభిస్తుందని.. కిలో సిఎన్‌జికి 32.85 కిలోమీటర్ల మైలేజీ అందిస్తుందని వెల్లడించింది.

రూ.7,390కే బ్యాంకాక్‌కు విమానయానం

● హైదరాబాద్ నుంచి డైరెక్ట్ ప్రయాణం : ఎయిర్‌ఏసియా వెల్లడి

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

హైదరాబాద్ నుంచి బ్యాంకాక్‌కు డైరెక్ట్ విమాన సేవలను ప్రారంభించనున్నట్లు ఎయిర్ ఏషియా వెల్లడించింది. గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో థాయ్ ఎయిర్‌ఏషియా హెడ్ ఆఫ్ కమర్షియల్ తన్సితా అక్రరిత్‌పిరోమ్ మాట్లాడుతూ.. ఈ సేవలను అక్టోబర్ 27 నుంచి అందుబాటులోకి తెస్తున్నామన్నారు. ప్రమోషనల్ ఆఫర్‌లో భాగంగా వన్ వేలో టికెట్ ధరను రూ.7,390గా నిర్ణయించామన్నారు. అక్టోబర్ 27 నుంచి 2025 మార్చి 29లోగా ప్రయాణించడానికి వీలుంగా ఈ నెల సెప్టెంబర్ 22లోపు బుక్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. వారంలో నాలుగు విమానాలు అందుబాటులో ఉంటాయన్నారు. అదే విధంగా చెన్నయ్ నుంచి బ్యాంకాక్‌కు అక్టోబర్ 30 నుంచి డైరెక్ట్ సేవలను అందించనున్నామన్నారు. తద్వారా దేశంలోని రెండు ముఖ్య నగరాల నుండి ప్రయాణికులు నేరుగా థాయిలాండ్‌కు వెళ్లడానికి వీలుంటుందన్నారు.

అగ్రిగోల్డ్ కేసులో ప్రత్యేక కోర్టు ఉత్తర్వులపై హైకోర్టును ఆశ్రయించిన ఎసిబి

ప్రజాశక్తి-అమరావతి

అగ్రిగోల్డ్ భూముల వ్యవహారంలో ప్రత్యేక కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ ఎసిబి హైకోర్టును ఆశ్రయించింది. ఈ కేసులో మాజీ మంత్రి జోగి రమేష్, జోగి రాజీవ్, మండల సర్వేయర్ అజ్మీర రమేష్‌లను తమ కస్టడీకి అప్పగించేందుకు తిరస్కరిస్తూ ఎసిబి ప్రత్యేక కోర్టు ఉత్తర్వులు ఇచ్చిందని, వాటిని కొట్టేయాలని కోరుతూ అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) అధికారులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అగ్రిగోల్డ్ భూముల వ్యవహారంలో రాజీవ్, రమేష్‌లను విచారించడం చాలా అవసరమని ఎసిబి పేర్కొంది. ఎసిబి ప్రత్యేక కోర్టుకు ఈ విషయాలను నివేదించినా ప్రయోజనం లేకపోయిందని వివరించింది. రాజీవ్‌ను తమ కస్టడీకి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని హైకోర్టును కోరింది. న్యాయమూర్తి జస్టిస్ బొప్పన వరాహ లక్ష్మీనరసింహ చక్రవర్తి గురువారం ఈ పిటిషన్‌పై విచారణ జరిపారు. ప్రతివాదులు జోగి రమేష్, అజ్మీర రమేష్‌లకు నోటీసులు జారీ చేశారు. తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేశారు.

బెయిల్ సవాలు చేస్తూ పిటిషన్...

రాజీవ్, రమేష్‌లకు బెయిల్ మంజూరు చేస్తూ విజయవాడ ఎసిబి ప్రత్యేక న్యాయస్థానం ఇటీవల ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ ఎసిబి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తి చక్రవర్తి ఈ వ్యాజ్యాన్ని రోస్టర్ ప్రకారం తగిన బెంచ్ ముందు ఉంచాలని రిజిస్ట్రీని ఆదేశించారు. ఎన్టీఆర్ జిల్లా, అంబాపురంలో అగ్రిగోల్డ్ భూముల కొనుగోళ్ల వ్యవహారంలో రాజీవ్, సర్వేయర్ రమేష్‌లకు ఎసిబి ప్రత్యేక కోర్టు బెయిల్ మంజూరు చేస్తూ గత నెల 23న ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే.

టేకు చెట్లు, యంత్రాలను రక్షించాలని అగ్రిగోల్డ్ పిటిషన్

కృష్ణా జిల్లా గన్నవరం మండలం సూరంపల్లి గ్రామంలో బ్యాంకు జప్తులో తమ టేకు చెట్లు, ఇతర యంత్ర సామాగ్రి దొంగతనానికి గురవుతున్నాయని, వాటిని రక్షించాలని ఫిర్యాదు చేసినా పోలీసులు చర్యలు తీసుకోవడం లేదని అగ్రిగోల్డ్ యాజమాన్యం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన హైకోర్టు.. బ్యాంకు, అగ్రిగోల్డ్ యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదుపై ఏం చేశారో చెప్పాలని పోలీసులను ఆదేశించింది. విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

మిథున్‌రెడ్డిపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దు

హత్యాయత్నం కింద నమోదు చేసిన కేసుల్లో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని హైకోర్టు బుధవారం పోలీసులను ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 17కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వక్కలగడ్డ రాధాకృష్ణ కపాసాగర్ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. తెలుగుదేశం పార్టీ నేతలు ఇచ్చిన తప్పుడు ఫిర్యాదు ఆధారంగా చిత్తూరు జిల్లా, పుంగనూరు పోలీసులు తనపై నమోదు చేసిన కేసుల్లో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ మిథున్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యాలు బుధవారం జస్టిస్ కపాసాగర్ ముందు విచారణకు వచ్చాయి. మిథున్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి హాజరయ్యారు. ఇవే కేసులకు సంబంధించి మరికొందరు కూడా ముందస్తు బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారని, అన్నింటినీ కలిపి విచారించాలని పోలీసుల తరపు న్యాయవాది మర్రి వెంకటరమణ అభ్యర్థించారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన న్యాయమూర్తి అన్ని వ్యాజ్యాలను కలిపి తమ ముందుంచాలని రిజిస్ట్రీని ఆదేశించారు.

పాస్‌పోర్టు పునరుద్ధరించాలని పిటిషన్

తన పాస్‌పోర్టు పునరుద్దరించేందుకు ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారి తిరస్కరించడాన్ని సవాలు చేస్తూ రాష్ట్ర గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర హైకోర్టును ఆశ్రయించారు. తనపై క్రిమినల్ కేసులు పెండింగ్లో ఉన్నాయన్న కారణంతో పాస్‌పోర్టు పునరుద్ధరణను తిరస్కరించడం సుప్రీంకోర్టు తీర్పులకు, రాజ్యాంగ అధికరణలకు విరుద్ధమంటూ ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. క్రిమినల్ కేసులతో సంబంధం లేకుండా తన పాస్‌పోర్టును పునరుద్ధరించేలా పాస్‌పోర్ట్ అధికారిని ఆదేశించాలని ఆయన కోర్టును కోరారు. ఈ వ్యాజ్యంపై హైకోర్టు గురువారం విచారణ జరిపింది. తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు ఉత్తర్వులు జారీ చేశారు. యుఎస్‌ఎ, లాస్ వేగాస్లో ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు జరగనున్న మైన్ ఎక్స్పో-2024లో పాల్గొనేందుకు వెళ్లాల్సి ఉందని రవీంద్ర తన పిటిషన్లో పేర్కొన్నారు. అత్యవసరంగా విచారణ జరపాలన్న రవీంద్ర తరపు న్యాయవాదుల విజ్ఞప్తి మేరకు న్యాయమూర్తి విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు.

ఇషాన్ కిషన్ సూపర్ సెంచరీ

- ఇండియా-సి జట్టు భారీ స్కోర్
- ఇండియా ఎ 288/8
- అర్థ సెంచరీలతో రాణించిన సామ్స్ ములానీ, తనుష్



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

దులీప్ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా ఇండియా బి టీమ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఇండియా సి జట్టు క్రీడాకారుడు ఇషాన్ కిషన్ సెంచరీతో కదంతొక్కాడు. కిషన్ అద్భుత ఆటతో ఇండియా సి జట్టు భారీ స్కోర్ దిశగా పయనిస్తోంది. మరో మ్యాచ్‌లో ఇండియా ఎ,డి జట్లు పోటీ పడ్డాయి. ఇండియా ఎ జట్టులో సామ్స్ ములానీ, తనుష్‌లు అర్ధసెంచరీలు సాధించారు. గురువారం అనంతపురం ఆర్‌డిటి స్పోర్ట్స్ సెంటర్‌లో ఉన్న రెండు మైదానాల్లో రెండో రౌండ్ మ్యాచ్ ఇండియా ఎ, డి మధ్య, ఇండియా బి, సి జట్ల మధ్య నాలుగు రోజుల క్రికెట్ మ్యాచ్‌లు మొదలైయ్యాయి.

ఇషాన్ కిషన్ మెరుపులు.. ఇండియా సి 375/5

టాస్ నెగ్గిన ఇండియా బి జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. భారత జట్టు వికెట్ కీపర్ ఇషాన్ కిషన్ రెండవ స్థానంలో వచ్చి 126 బంతుల్లో 14 ఫోర్లు, 3 భారీ సిక్సర్లతో 111 పరుగులు చేశాడు. ఇతనికి తోడుగా బాబా ఇంద్రజిత్ 136 బంతుల్లో తొమ్మిది బౌండరీల సహాయంతో 78 పరుగులు చేశాడు. రుతురాజ్ గైక్వాడ్ 46, సాయిసుదర్శన్ 43, రజత్ పటిదార్ 40 పరుగులు చేశారు. ఆటముగిసే సమయానికి ఇండియా సి జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 79 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 375 పరుగులు చేసింది. ఇండియా బి జట్టు బౌలర్లలో ముకేష్‌కుమార్ మూడు, నవదీప్ శైనీ, రాహుల్ చాహర్ చెరో వికెట్ తీసుకున్నారు.

ఇండియా ఏ జట్టు 288/8

మరో మ్యాచ్‌లో ఇండియా ఎ, డి జట్లు పోటీ పడ్డాయి. టాస్ నెగ్గిన ఇండియా డి జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. ఇండియా ఎ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో ఆటముగిసే సమయానికి 8 వికెట్లు కోల్పోయి 288 పరుగులు చేసింది. జట్టులో సామ్స్ ములానీ 88 (8 ఫోర్లు, 3 సిక్స్‌లు), తనుష్ కొటియన్ (6 ఫోర్లు, ఒక సిక్సర్)తో అర్ధసెంచరీలు చేశారు. ఐపిఎల్ స్టార్ ప్లేయర్ రియాన్ పరాగ్ 29 బంతుల్లో ఐదు ఫోర్లు, ఒక్క సిక్సర్‌తో 37 పరుగులు చేశారు. ఇండియా డి బౌలర్లలో హర్షిత్ రాణా, కవిరప్ప, అర్ష్‌దీప్ సింగ్ చెరో రెండు వికెట్లు తీసుకున్నారు.

విద్యుత్ తీగలు తగిలి యువకుడి మృతి

ప్రజాశక్తి - హలహర్వి (కర్నూలు)

కర్నూలు జిల్లా హలహర్వి మండలంలోని చింత కుంట గ్రామంలో గురువారం 11కెవి విద్యుత్ తీగలు తగిలి దాసరి అర్జున్ (16) మృతి చెందారు. బంధువుల వివరాల మేరకు... దాసరి వెంకటేష్, సావిత్రమ్మలకు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండవ కుమారుడు దాసరి అర్జున్ తన ఇంటి మేడపైకి ఎక్కాడు. ప్రమాదవ శాత్తు 11కెవి విద్యుత్ తీగలు తగలడంతో కింద పడిపోయాడు. గుర్తించిన తల్లిదండ్రులు బళ్లారి ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో సిఐడి అధికారుల తనిఖీ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లి సబ్ కలెక్టరేట్‌తో పాటు తహశీల్దార్ కార్యాలయాలను సిఐడి అధికారులు తనిఖీ చేశారు. ఈ కేసులో ప్రమోయం ఉన్న ఏడుగురిని విచారించారు. సిఐడి అధికారులు మదనపల్లెకు వచ్చారన్న విషయం తెలుసుకున్న కేసులో ప్రమేయం ఉన్న కొందరు ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసుకుని పలాయనం చిత్తగించారు.

విశాఖను నెంబర్ 1 స్థానంలో నిలపాలి

- దిశా సమావేశంలో ఎంపీ శ్రీ భరత్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్

సమ్మిళిత అభివృద్ధి విధానాలను అవలంభిస్తూ, యువత ఉపాధికి, ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, విశాఖపట్టణం జిల్లాను దేశంలోనే నెంబర్ -1 స్థానంలో నిలబెట్టాలని, దీనికి ప్రజా ప్రతినిధులు, అధికారులు అవిరళ కృషిచేయాలని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. రాష్ట్ర పరిధిలో అమలవుతున్న కేంద్ర ప్రాయోజిత పథకాల తీరుతెన్నులు, సమస్యలు, ఎదురవుతున్న సవాళ్లు, అధికారుల సమన్వయం తదితర అంశాలపై గురువారం కలెక్టరేట్‌లో దిశా (డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ కో-ఆర్డినేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ, జిల్లాస్థాయి అభివృద్ధి సమన్వయ, మానటరింగ్ కమిటీ) సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని సమీక్షించారు. 29 విభాగాల పరిధిలో కేంద్రం అమలు చేస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, దీన్ దయాల్ అంత్యోదయ యోజన, ప్రధానమంత్రి పసల్ బీమా యోజన, డిజిటల్ ఇండియా, నేషనల్ లైవ్ స్టాక్, గోకుల్ మిషన్, ప్రధాన మంత్రి మాతృవందన యోజన, నేషనల్ హెల్త్ మిషన్, జలజీవన్ మిషన్, పిఎం పోషణ్, ఖేలో ఇండియా, సంసద్ ఆదర్శ గ్రామ యోజన, ప్రధాన మంత్రి ఉజ్వల యోజన, ప్రధాన మంత్రి విశ్వకర్మ తదితర 66 కేంద్ర ప్రాయోజిత పథకాల తీరుతెన్నులు, ఇతర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వాటి ద్వారా కలిగే ప్రయోజనాల గురించి ప్రజలకు వివరించాలని, పథకాల అమలు కోసం కేంద్రం నుంచి వస్తున్న నిధులను సమృద్ధిగా వినియోగించాలని, లబ్ధిదారులకు పూర్తి స్థాయిలో ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, పి.గణబాబు, వెలగపూడి రామకృష్ణబాబు, పంచకర్ల రమేష్‌బాబు పలు అంశాలపై ప్రశ్నలు లేవనెత్తటంతో పాటు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ ఎంఎన్. హరేంధిర ప్రసాద్ జిల్లా యంత్రాంగం చేపడుతున్న చర్యలను, అధికారులు చేస్తున్న కృషిని వివరించారు. సమావేశంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్, జిల్లా పరిషత్ సిఇఒ సత్యనారాయణ, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మిగులు సీట్ల భర్తీకి ఓపెన్ కౌన్సిలింగ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరంలోని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ద్వారా అందిస్తున్న అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్స్‌లో మిగులు సీట్ల భర్తీకి ఈనెల 20న ఓపెన్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు సిటియు విసి కట్టమని తెలిపారు. బిఎస్‌సి కెమిస్ట్రీ, బోటనీ, జియాలజి, ఆర్టిఫీషియల్ ఇంటెలిజన్స్, బిబిఎ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజెమెంట్‌లలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను తొలి కౌన్సిలింగ్ ద్వారా సీట్లు భర్తీ చేశామని తెలిపారు. ఇంకా కొన్ని సీట్లు ఖాళీగా ఉన్నందున ఓపెన్ కౌన్సిలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. ఎన్‌టిఎ నిర్వహించిన సియుఐఇటి(యుజి) పరీక్ష రాసిన వారు, లేదా ఇంటర్మీడియట్ పాసు అయిన వారు షషష.ఛ్టబుజూ.ఖఎ.బఅలో ఇచ్చిన లింకు ద్వారా తమ పేరును ఈనెల 19లోగా రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు యూనివర్సిటీ క్యాంపస్ లో ఏర్పాటుచేసిన హెల్ప్ డెస్కను లేదా ఫోన్ నెంబర్ 0892296033ను సంప్రదించాలని తెలిపారు.

సరుకు రవాణాలో ఈస్ట్ కోస్ట్ రైల్వే రికార్డు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ (విశాఖ)

ఈస్ట్ కోస్ట్ రైల్వే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేవలం 160 రోజుల్లో 100 మిలియన్ టన్నుల వస్తువులను అన్‌లోడ్ చేయడం ద్వారా సరకు రవాణాలో రికార్డు సాధించింది. 2024 సెప్టెంబర్ 7వ తేదీకి 100.44 మిలియన్ టన్నులను విజయవంతంగా అన్‌లోడ్ చేసింది. గత సంవత్సరం ఇదే కాలంలో 6.5 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఈ పనితీరు గత సంవత్సరం 6.15 మిలియన్ టన్నులను అధిగమించింది. విభాగాల వారిగా ఖుర్దా రోడ్ డివిజన్‌లో 60.38 మిలియన్ టన్నులు, వాల్తేరు డివిజన్‌లో 22.68 మిలియన్ టన్నులు, సంబల్పూర్ డివిజన్లో 17.38 మిలియన్ టన్నులు అన్‌లోడ్ అయ్యాయి. ఈస్ట్ కోస్ట్ రైల్వే తన పరిధిలోని కీలక పరిశ్రమలు పోర్టుల రవాణా అవసరాలకు మద్దతు ఇవ్వడంలో కీలకపాత్ర పోషిస్తోందని, రైల్వే పరదీప్, విశాఖపట్నం (వైజాగ్), గంగవరం, గోపాల్‌పూర్, ధామ్రాతో సహా ప్రధాన ఓడరేవులకు సేవలు అందిస్తుందని, ఉక్కు, విద్యుత్, పటిక వంటి క్లిష్టమైన పరిశ్రమల రవాణా అవసరాలను తీరుస్తుందని అధికారులు పేర్కొన్నారు.

కృత్రిమ మేధపై పరిశోధనలకు గీతం వర్సిటీకి భారీ ప్రాజెక్టు

ప్రజాశక్తి -మధురవాడ: కేంద్ర ప్రభుత్వ వికసిత్ భారత్ లక్ష్యాలలో భాగంగా కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్), మెషిన్ లెర్నింగ్ పరిశోధనలకు భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి భారీ పరిశోధన ప్రాజెక్టును మంజూరు చేసింది. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి డాక్టర్. పి.భరణి చంద్రకుమార్ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్‌గా వ్యవహరించనున్నారు. ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు, వికాస్ శ్రీ వాత్సవ్‌లు ఈ పరిశోధన ప్రాజెక్టుకు సహకారం అందించనున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా పరిశోధనలతో పాటు కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్‌లలో టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్‌ను గీతం విశ్వవిద్యాలయంలో నెలకొల్పనున్నారు. ఈ టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్ ద్వారా దాదాపు 50 స్టార్టప్‌లను విశాఖలో ప్రోత్సహించడంతో పాటు 2026 నాటికి కనీసం 20 ఐటి ఉత్పత్తులను మార్కెట్‌లోకి తేవాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్. పి.భరణి చంద్రకుమార్ తెలిపారు. దాదాపు రూ.4.57 కోట్ల వ్యయంతో నిర్వహించనున్న ఈ పరిశోధన, టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్‌లో భాగంగా నెలకొల్పే ప్రాజెక్టు కేంద్రం ద్వారా పరిశోధనలు, స్టార్టప్‌ల ఏర్పాటు, సాంకేతిక పత్రాలను వెలువరించడం, నూతన ఐటి ఉత్పత్తుల అభివృద్ధి, పేటెంట్ హకులు పొందొచ్చని వెల్లడించారు. కాగా, ఆర్టిషీ షియల్ ఇంటిలిజెన్స్‌పై ప్రతిష్టాత్మక పరిశోధన ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం నుంచి సాధించిన గీతం పరిశోధక బృందాన్ని ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ వై.గౌతమ్‌రావు అభినందించారు.

14 నుంచి ఫార్మా, సెజ్ కార్మికుల భద్రతకు సిపిఎం రక్షణ యాత్ర

ప్రజాశక్తి -అనకాపల్లి (అనకాపల్లి జిల్లా)

అనకాపల్లి జిల్లాలో వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస భద్రత కల్పించాలని కోరుతూ ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు పాయకరావుపేట నుంచి అచ్చుతాపురం వరకు సిపిఎం ఆధ్వర్యాన చేపట్టే బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాధం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శంకరరావు, వివి.శ్రీనివాసరావు, గంటా శ్రీరామ్, అల్లు రాజు పిలుపునిచ్చారు. అనకాపల్లిలోని సిపిఎం కార్యాలయంలో గురువారం బైక్ ర్యాలీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లోకనాథం, కోటేశ్వరరావు మాట్లాడుతూ.. ఏ కంపెనీలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో, విధులకు వెళ్ళిన తమ కుటుంబ సభ్యులు క్షేమంగా ఇంటికి వస్తారో? రారో తెలియని భయాందోళనలో కార్మికులు, వారి కుటుంబాలు ఉన్నాయన్నారు. జిల్లాలో గత 25 సంవత్సరాల్లో జరిగిన పారిశ్రామిక ప్రమాదాలలో ఈ ఏడాది ఆగస్టు 21న అచ్యుతాపురం వద్ద 'ఎసెన్షియా ఫార్మా'లో జరిగిన ప్రమాదం అతిపెద్దదన్నారు. ఎసెన్షియా ఫార్మా కంపెనీ యాజమాన్యం తీవ్ర నిర్లక్ష్యం, ప్రభుత్వాల అలసత్వానికి 17 మంది కార్మికుల నిండు ప్రాణాలు బలయ్యాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇటీవల వివిధ పరిశ్రమల్లో 120 ప్రమాదాలు జరిగి 140 మంది మరణిస్తే ఒక్క అనకాపల్లి జిల్లాలో 6 ఏళ్లలో 54 కంపెనీల్లో జరిగిన ప్రమాదాల్లో 62 మంది చనిపోగా, 92 మంది తీవ్ర గాయాలతో క్షతగాత్రులయ్యారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కంపెనీల వ్యాపారాల కోసం నిబంధనలను సరళతరం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) పేరుతో ఫ్యాక్టరీలను తనిఖీలు చేయకుండా అధికారులపై కేవలం ఆంక్షలు విధించడంతో ఈ ప్రమాదాలు మరింత పెరగడానికి ప్రధాన కారణమయ్యాయని తెలిపారు. ప్రమాదకర ఫార్మా, కెమికల్ కంపెనీలలో తరచు తనిఖీలు చేయాలని కార్మిక సంఘాలు కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. అర్హత, నైపుణ్యం గల కార్మికులతో పనులు చేయించకుండా తక్కువ జీతాలతో వలస కార్మికులతో పనిచేయించడం వంటి లోపాలే ప్రమాదాలు పెరగడానికి ఒక కారణంగా ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో పరిశ్రమల్లో కార్మికుల భద్రత, ప్రభుత్వాల పటిష్ట చర్యలకై సిపిఎం నిర్వహిస్తున్న యాత్రలో కార్మికులు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి లోకనాథం తదితరులు

విశాఖ ఉక్కును కాపాడుకుంటాం

- పోరాట కమిటీ

ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖపట్నం)

పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకుంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే దీక్షలు గురువారం 1309వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో ఎఐటియుసి నాయకులు, కార్యకర్తలు కూర్చున్నారు. దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి ఆదినారాయణ మాట్లాడారు. ప్రాణ త్యాగాలతో ఏర్పాటైన కర్మాగారాన్ని ఏట్టి పరిస్థితుల్లో ప్రయివేట్‌పరం కానివ్వబోమన్నారు. ఉక్కును అస్థిరపరిచే చర్యలకు కేంద్ర ప్రభుత్వం పాల్పడితే సహించేది లేదన్నారు. తక్షణమే స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, పూర్తి స్థాయి ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షల్లో నాయకులు జె.రామకృష్ణ, కె.రాజబాబు, బిఎంఎల్.నాయుడు, పి.పెద్దిరాజు, బివి.సత్యనారాయణ, సైన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కెజిబివిల్లో టీచర్ల కొరత

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

పేద, అనాథ బాలికలకు ఆరు నుంచి ఇంటర్ వరకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఏర్పాటుచేసిన కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (కెజిబివి) ఇప్పుడు నిరాదరణకు గురవుతున్నాయి. పాఠాలు చెప్పాలిన ఉపాధ్యాయులు కొన్ని కెజిబివిల్లో లేరు. విద్యాలయాలు తెరిచి మూడు నెలలవుతున్నా ఉపాధ్యాయ ఖాళీలను భర్తీచేయలేదు. గెస్ట్ ఫ్యాకల్టీని రెన్యూవల్ చేయలేదు. నాతవరం కెజిబివిలో గతేడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు గెస్ట్ టీచర్‌తో కాలం నెట్టుకొచ్చారు. ఈ ఏడాది ఇంతవరకు ఆ టీచర్‌ను రెన్యూవల్ చేయలేదు. దీంతో ఉన్న ఉపాధ్యాయులే తమ బోధనానుభవంతో పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. 9,10 తరగతులకు లెక్కలు సబ్జెక్టును ప్రిన్సిపల్ బోధిస్తుండగా, 6,8 తరగతుల పిల్లలకు ఫిజికల్ సైన్సు టీచర్ బోధిస్తున్నారు. మ్యాథ్స్ ఎంఎస్‌సి బిఇడి చేసిన కంప్యూటర్ ఆపరేటర్‌తో లెక్కలు చెప్పిస్తున్నారు. రావికమతంలో కెజిబివిలో రిసోర్స్ పర్సన్ తనకు వీలైనప్పుడు లెక్కలు చెబుతున్నారు. కెజిబివిల్లో బోధన, బోధనేతర సిబ్బంది సంపూర్ణంగా లేకపోవడంతో కొన్ని కెజిబివిల్లో ప్రవేశాలు తక్కువగా ఉన్నాయి. జిల్లాలోని 24 మండలాల్లో 20 కెజిబివిలున్నాయి. ఇప్పటికీ బోధన సిబ్బందిని నియమించే ప్రక్రియ ప్రారంభించలేదంటే పేద పిల్లల విద్య పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం కొట్టిచ్చినట్లు కనబడుతోంది. జిల్లాలోని మునగపాక మండలం పాటిపల్లి కెజిబివిలో ఆరు నుంచి ఇంటర్ వరకు 280 మంది బాలికలు ఉండాల్సిన చోట 232 మంది వున్నారు. కొండకు ఆనుకొని ఊరుకు చివరన ఉన్న ఈ విద్యాలయానికి విద్యుత్ సరఫరా నిలిచిపోతే ప్రహరీకి రెండు వైపులా బయట వున్న చేతిబోర్ల నుంచి సిబ్బంది నీరు బకెట్లతో మోసుకొని తెస్తున్నారు. జనరేటర్ సౌకర్యంలేక విద్యుత్‌లేని సమయాల్లో విద్యార్థులు ఇబ్బందులుపడాల్సివస్తోంది.

ఇవీ ఖాళీలు : అచ్యుతాపురం కెజిబివిలో జువాలజీ(పిజిటి), చోడవరంలో ఎంఎల్‌టి, జిఎఫ్‌సి (పిజిటి), దేవరాపల్లిలో తెలుగు, నేచరల్ సైన్సు(సిఆర్‌టి), కె.కోటపాడులో ఫిజికల్ సైన్సు (సిఆర్‌టి), కశింకోటలో నేచరల్ సైన్సు (సిఆర్‌టి), ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్, మాకవరపాలెంలో నేచరల్ సైన్సు, సోషల్ స్టడీస్ (సిఆర్‌టి), ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్, నర్సీపట్నంలో జువాలజీ (పిజిటి), నాతవరంలో లెక్కలు (సిఆర్‌టి), రావికమతంలో లెక్కలు (సిఆర్‌టి), జువాలజి (పిజిటి), వి.మాడుగులలో ఫిజికల్ సైన్సు (సిఆర్‌టి), బోటనీ (పిజిటి) ఖాళీలున్నాయి. మునగపాక, ఎస్.రాయవరంలో కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్ లేరు. కెజిబివిల్లో బోధన, బోధనేతర సిబ్బంది సమస్య ఉంది. త్వరలో గెస్ట్ ఫ్యాకల్టీని నియమిస్తామని విద్యాశాఖాధికారులు చెబుతున్నారు.

బెల్లం వ్యాపారి మృతి

ప్రజాశక్తి- కార్వేటినగరం (చిత్తూరు జిల్లా)

అప్పుల బాధతో బెల్లం వ్యాపారి చేసుకున్న ఘటన చిత్తూరు జిల్లా కార్వేటినగరం మండలంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు. గాజులకండ్రిగ గ్రామానికి చెందిన రైతు నారాయణరాజు (52) తనకున్న ఎకరం పొలంలో చెరకు పంట సాగు చేసేవారు. రైతుల నుంచి చెరకును సేకరించి గానుగ ద్వారా బెల్లం తయారు చేసి బెల్లం వ్యాపారం చేసేవారు. ఇందుకోసం రూ.25లక్షల వరకు అప్పులు చేశారు. వ్యాపారంలో నష్టం రావడంతో తన పొలంలో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఆయనకు భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

20న 'శివాజీ' రీ రిలీజ్

రజనీకాంత్ హీరోగా, శ్రియ శరన్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'శివాజీ : దిబాస్' ఈనెల 20న రీ రిలీజ్ కానుంది. శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం 2007లో విడుదలైంది. సుమన్ మరో ప్రధాన పాత్రలో నటించారు. ఎఆర్ రెహమాన్ సంగీతాన్ని అందించారు. అప్పట్లో బాక్సాఫీసు వద్ద రికార్డు విజయాన్ని ఈ సినిమా అందుకుంది. సుమారు 17 ఏళ్ల తర్వాత మరోసారి ఈ సినిమా రీ రిలీజ్ కానుంది. 4 కె వర్షన్‌లో విడుదల కానున్న ఈ సినిమాకు సంబంధించి ఎంపిక చేసిన స్క్రీన్లలో టిక్కెట్ల ధర రూ.99 మాత్రమే ఉండనుంది. 2012లో రజనీకాంత్ పుట్టిన రోజు సందర్భంగా ఈ చిత్రాన్ని 3డి వర్షన్‌లో విడుదల చేశారు. ఆ సమయంలో సినిమా నిడివి 30 నిముషాలు తగ్గించారు. 3 డి కొత్త డాల్బీ అట్మాస్ ప్లాట్‌ఫారంతో ప్రారంభించబడిన మొదటి భారతీయ చిత్రంగా రికార్డు సృష్టించింది. ఇంత కాలానికి మళ్లీ 3 డి వర్షన్‌ను కూడా విడుదల చేయనున్నారు.



ధనుష్‌పై నిషేధం ఎత్తివేత

ప్రముఖ నిర్మాణ సంస్థల నుంచి అడ్వాన్స్ తీసుకున్న తమిళ నటుడు ధనుష్, వారి సినిమాల్లో నటించకుండా డబ్బులు కూడా తిరిగి ఇవ్వలేదన్న ఫిర్యాదు గతంలో వచ్చింది. దీంతో తమిళ ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ ధనుష్‌పై నిషేధం విధించింది. ధనుష్‌ని తమ సినిమాల్లో కమిట్ చేసే ముందు నిర్మాతల సంఘంతో సంప్రదింపులు జరపాలని నిర్ణయించుకున్నారు.

తాజాగా ధనుష్ తనపై విధించిన నిషేధానికి సంబంధించి కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు సమాచారం. సమాచారం ప్రకారం, ధనుష్ 2 షరతులకు అంగీకరించాడు. ప్రముఖ నిర్మాణ సంస్థ తేనాండాల్ ఫిల్మ్స్ నిర్మించే చిత్రంలో నటించడం ఒకటి, మరొకటి ఫైవ్ స్టార్ క్రియేషన్స్ నుండి వచ్చిన అడ్వాన్స్ మొత్తాన్ని వడ్డీతో సహా తిరిగి చెల్లించడం. ఈ రెండు షరతుల నేపథ్యంలో ధనుష్‌పై విధించిన నిషేధాన్ని ఎత్తివేయాలని నిర్మాతల సంఘం నిర్ణయించింది.

నెపోటిజంతో సినిమా అవకాశాలు కోల్పోయా

- రకుల్‌ప్రీత్‌సింగ్

'చిత్ర పరిశ్రమలో నెపోటిజం ఉంది. ఇదీ జరుగుతూనే ఉంటుందనేది కూడా వాస్తవం. ఈ కారణంతో నేను కొన్ని సినిమా ఛాన్సులను కోల్పోయాను. అరే, అవకాశాలు కోల్పోయాననే బాధ నాలో ఉండదు. అలా అని నేను కూర్చుని ఉండిపోయే వ్యక్తిని కాదు. బహుశా ఆ సినిమాలు నా కోసం ఉద్దేశించినవి కాకపోవచ్చని ముందుకు వెళ్తాను. నా తండ్రి సైన్యంలో పనిచేయటంతో ఆయన నుంచి నేను ఎన్నో నేర్చుకున్నాను. దీంతో ఇలాంటి చిన్నవాటి గురించి నేను పెద్దగా ఆలోచించను. అవకాశాలు కోల్పోవటం అనేది ప్రతిఒక్కరి జీవితంలో జరుగుతూ ఉంటుంది. అలాంటప్పుసడు దక్కని వాటి గురించి ఎక్కువగా ఆలోచించి ఉన్న సమయాన్ని వృథా చేసుకోను. ఒక స్టార్ కిడ్‌కు సులభంగా ఛాన్సులు వచ్చినట్లు కొత్తవారికి మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ రావు. ఆ క్రెడిట్ అంతా వారి తల్లిదండ్రులకు మాత్రమే చెందుతుంది' అని హీరోయిన్ రకుల్ ప్రీత్‌సింగ్ వెల్లడించారు. చిత్ర పరిశ్రమలో నెపోటిజం (బంధుప్రీతి) గురించి ఆమె తాజాగా చేసిన కామెంట్లు వైరల్ అయ్యాయి. ఇప్పటికే దీని గురించి చాలామంది నటీనటులు బహిరంగంగానే తమ అభిప్రాయాన్ని పంచుకున్నారు. ఎలాంటి సినీ నేపథ్యం లేకుండానే ఆమె చిత్ర పరిశ్రమలోకి అడుగు పెట్టారు. మొదట కన్నడలో ఎంట్రీ ఇచ్చిన ఆమె టాలీవుడ్, బాలీవుడ్‌లలో స్టార్ హీరోల సినిమాల్లో నటించి తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే నెపోటిజం వల్ల చాలా సినిమా అవకాశాలు పోగొట్టుకున్నానని ఆమె తాజాగా ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.



జనవరి నుండే ఎస్‌ఎస్‌ఎంబి-29

రాజమౌళి ఒక సినిమాకి 6 నుంచి 7 నెలల ప్రీ ప్రొడక్షన్ టైం తీసుకుంటాడు. రెండేళ్ల సినిమా షూటింగ్ పోస్ట్ ప్రొడక్షన్ పనులు కానిస్తూ ఉంటాడు. ఇప్పుడు ఆయన మహేష్ బాబుతో 29వ సినిమాని చేస్తున్నాడు. ఈ సినిమా కోసం ఏకంగా సంవత్సరం ప్రీ ప్రొడక్షన్ కోసమే కేటాయించాలని నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది. అందుకే ఈ ఏడాది ఆగస్టు లేదా సెప్టెంబర్ నెలలోనే షూటింగ్ మొదలుపెట్టాల్సి ఉండగా, అది వచ్చే ఏడాది జనవరికి పోస్ట్ చేసినట్లు సమాచారం. వర్క్ షాప్స్ అలాగే ఇతర ప్రీ ప్రొడక్షన్ పనులు ఇంకా పూర్తి కాలేదు కాబట్టి షూటింగ్ డేట్ జనవరికి మార్చారు. ఇప్పటికే వర్క్ షాప్స్ జరుగుతున్నాయి. మహేష్ బాబుతో పాటు సినిమాలో కీలకమైన వ్యక్తులు, ఈ వర్క్ షాప్స్‌లో పాల్గొంటున్నారు. ఈ సినిమాని దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కేఎల్ నారాయణ నిర్మించబోతున్నారు. కీరవాణి సంగీతం అందించబోతున్నారు.



పాటల రచయిత గురుచరణ్ మృతి

టాలీవుడ్ హిట్ పాటల రచయిత మానాపురపు రాజేంద్రప్రసాద్ అలియాస్ గురుచరణ్ (77) గురువారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. గతకొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు.

అలనాటి ప్రముఖ నటి ఎంఆర్ తిలకం, ప్రముఖ దర్శకుడు మానాపురం అప్పారావుల కుమారుడే గురుచరణ్. ఎంఎ వరకు చదివిన ఆయన ప్రముఖ గీత రచయిత ఆచార్య ఆత్రేయ దగ్గర శిష్యరికం చేశారు. 200లకుపైగా సినిమా పాటలు రాశారు. ముఖ్యంగా నటుడు మోహన్‌బాబుకు ఎంతో ఇష్టమైన పాటల రచయిత గురుచరణ్. ఆయన నటించిన చిత్రాలన్నింటిలో కనీసం ఒక్క పాటైనా తప్పకుండా రాయించేవారు. ఎన్నో మెలోడీ, అర్థవంతమైన పాటలను రచించారు. 'ముద్దబంతి నవ్వులో మూగబాసలు', 'కుంతీకుమారి తన కాలుజారి', 'బోయవాని వేటుకు గాయపడిన కోయిలా' అలాంటి సూపర్‌హిట్ పాటలను రచించారు. గురుచరణ్ మృతికి సినీ పరిశ్రమ ప్రతినిధులు తీవ్ర సంతాపాన్ని తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.




విశాఖలో చిన్నారితో ఏచూరి


22వ మహాసభ సందర్భంగా పతాకావిష్కరణలో మల్లుస్వరాజ్యం, సుభాషిణి అలీతో ఏచూరి


ఏచూరి, హరికిషన్‌సింగ్ సుర్జీత్, చంద్రబాబునాయుడు

కాకినాడ నుంచి ఢిల్లీ వరకూ ఏచూరి ప్రస్థానం

సీతారాం ఏచూరి 1952 ఆగస్ట్ 12వ తేదీన మద్రాసులో తెలుగు కుటుంబంలో జన్మించారు. తండ్రి సర్వేశ్వర సోమయాజుల ఏచూరి, తల్లి కల్పకం ఏచూరి ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడకు చెందిన వారు. ఏచూరి తండ్రి ఏపీఎస్‌ఆర్టీసీలో ఇంజినీర్‌గా పనిచేశారు. ఆయన తల్లి ప్రభుత్వ ఉద్యోగి. ఆమె ఇటీవలే కన్నుమూశారు. పుట్టింది మద్రాసులో అయినా ఏచూరి హైదరాబాదులోనే పెరిగారు. పదో తరగతి వరకూ ఆల్ సెయింట్స్ హైస్కూల్‌లో విద్యాభ్యాసం చేశారు. 1969లో వచ్చిన తెలంగాణ ఉద్యమం సమయంలో ఆయన ఢిల్లీకి చేరుకున్నారు. అక్కడ ప్రెసిడెంట్ ఎస్టేట్ స్కూలులో చేరి సిబిఎస్‌ఇ హయ్యర్ సెకండరీ పరీక్షలో అఖిల భారత స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించారు.

ఆ తర్వాత ఢిల్లీలోని సెయింట్ స్టీఫెన్స్ కాలేజీలో ఆర్థిక శాస్త్రంలో బిఎ (ఆనర్స్), జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో ఎంఎ చదివారు. రెండింటిలోనూ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. ఆర్థిక శాస్త్రంలో పీహెచ్‌డీ కోసం ఆయన జెఎన్‌యులో చేరారు. అత్యవసర పరిస్థితి సమయంలో ఆయనను అరెస్ట్ చేయడంతో చదువు మధ్యలోనే ఆగిపోయింది.

రాజకీయ జీవితం

ఏచూరి 1974లో ఎస్‌ఎఫ్‌ఐలో చేరారు. ఆ మరుసటి సంవత్సరం సిపిఎంలో చేరారు. జెఎన్‌యు విద్యార్థిగా ఉన్నప్పుడే 1975లో ఆయనను అరెస్ట్ చేశారు. అరెస్టుకు ముందు ఏచూరి కొంతకాలం అజ్ఞాతంలో గడిపారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పనిచేశారు. ఎమర్జెన్సీ తర్వాత 1977-78లో జేఎన్‌యూ స్టూడెంట్స్ యూనియన్ అధ్యక్షుడుగా మూడు పర్యాయాలు ఎన్నికయ్యారు. ప్రకాశ్ కరత్‌తో కలిసి జెన్‌యులో అబేధ్యమైన వామపక్ష కోటను నిర్మించేందుకు కృషి చేశారు. 1978లో ఏచూరి ఎస్‌ఎఫ్‌ఐ ఆలిండియా సంయుక్త కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత ఆ విద్యార్థి సంఘానికి అధ్యక్షుడు అయ్యారు. 1984లో ఆయనను సిపిఎం కేంద్ర కమిటీకి ఎన్నుకున్నారు. 1985లో ఏర్పడిన పార్టీ కేంద్ర కార్యదర్శివర్గంలో ఆయన సభ్యుడు. ఏచూరి, కరత్, సునీల్ మొయిత్రా, పి.రామచంద్రన్, ఎస్.రామచంద్రన్ పిళ్ళైలతో



ఏర్పడిన కేంద్ర కార్యదర్శివర్గం పొలిట్‌బ్యూరో ఆదేశానుసారం పనిచేసేది.

1986 వరకూ ఏచూరి ఎస్‌ఎఫ్‌ఐలోనే కొనసాగారు. 1992లో జరిగిన సిపిఎం 14వ అఖిల భారత మహాసభలలో ఆయన పార్టీ పొలిట్‌బ్యూరోకు ఎన్నికయ్యారు. 2015 ఏప్రిల్ 19న విశాఖపట్నంలో జరిగిన పార్టీ 15వ జాతీయ మహాసభలలో సీపీఐ (ఎం)కు ఐదవ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 2018 ఏప్రిల్‌లో హైదరాబాదులో జరిగిన సిపిఎం 22వ జాతీయ మహాసభలలో మరోసారి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 2022 ఏప్రిల్‌లో కేరళలోని కన్నూర్‌లో జరిగిన పార్టీ 23వ జాతీయ మహాసభలలో ఏచూరి మూడోసారి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

సంకీర్ణ రాజకీయాలలో సీపీఐ (ఎం) మాజీ ప్రధాన కార్యదర్శి హరికిషన్ సింగ్ సూర్జిత్ నిర్వహించిన పాత్ర ఎనలేనిది. దానిని ఏచూరి మరింతగా ముందుకు తీసికెళ్లారు. 1996లో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం కోసం కాంగ్రెస్ నేత పి. చిదంబరంతో కలిసి కనీస ఉమ్మడి కార్యక్రమం ముసాయిదాను రూపొందించారు. 2004లో యూపీఏ ప్రభుత్వ ఏర్పాటు సమయంలో సంకీర్ణ కూటమి నిర్మాణంలో క్రియాశీలక పాత్ర పోషించారు. ప్రజల ప్రాథమిక హక్కుల పరిరక్షణ కోసం ఆయన అలుపెరుగని పోరాటం చేశారు. 'భిన్నత్వంలో ఏకత్వం' అనే సిద్ధాంతాన్ని విశ్వసించారు. దేశంలో ఎక్కడ హింస జరిగినా దానికి వ్యతిరేకంగా గళం విప్పే వారు.

పార్టీ అంతర్జాతీయ విభాగానికి ఏచూరి నేతృత్వం వహించారు. పలు సోషలిస్ట్ దేశాలలో పార్టీ మహాసభలు జరిగినప్పుడు సౌహార్ధ ప్రతినిధిగా ఆయన హాజరయ్యేవారు.

రాజ్యసభ సభ్యుడిగా....

ఏచూరి 2005లో పశ్చిమ బెంగాల్ నుండి రాజ్యసభకు ఎన్నికయ్యారు. అనేక కీలక అంశాలను పార్లమెంట్ దృష్టికి తెచ్చే వారు. ముఖ్యమైన విషయాలపై ప్రశ్నలు సంధించే వారు. పార్లమెంట్ సమావేశాలకు తరచూ అంతరాయం కలిగిస్తున్నారంటూ పాలక పక్షం విమర్శలు చేస్తుంటే 'సమావేశాలకు ఆటంకం కలిగిస్తున్నాయని ప్రతిపక్షాలను నిందించడం ద్వారా ప్రభుత్వం తన బాధ్యతల నుండి తప్పించుకోలేదు' అని బదులిచ్చారు. పార్లమెంటును అడ్డుకోవడం ప్రజాస్వామ్యంలో చట్టబద్ధమైన ప్రక్రియ అని చెప్పారు. భారత్-అమెరికా అణు ఒప్పందం కోసం సంప్రదింపులు జరుగుతున్న సమయంలో దానికి తమ పార్టీ విధించిన అన్ని షరతులను ఏచూరి రాజ్యసభలో ప్రస్తావించారు. సీపీఐ (ఎం) షరతులు ప్రధాని మన్మోహన్ సింగ్‌ను సంతృప్తి పరిచాయి.

2015 మార్చి 3న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేసిన ప్రసంగానికి ఏచూరి సవరణ ప్రతిపాదించారు. దానిని రాజ్యసభ ఆమోదించడం మోడీ ప్రభుత్వానికి తలవంపులు తెచ్చిపెట్టింది. ఏచూరి అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకున్నామని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి వెంకయ్య నాయుడు తెలిపారు. రాష్ట్రపతి ప్రసంగానికి సవరణ ప్రతిపాదించడం సంప్రదాయం కాదని, కాబట్టి దానిని ఉపసంహరించుకోవాలని సూచించారు. మామూలుగా అయితే ఈ అభ్యర్థనను అంగీకరించే వాడినని, అయితే 14 గంటల చర్చ తర్వాత కూడా ప్రభుత్వం దిగిరాకపోవడంతో సవరణ కోసం పట్టుబడుతున్నానని ఏచూరి బదులిచ్చారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన సవరణ సభ ఆమోదం పొందడం రాజ్యసభ చరిత్రలో ఇది నాలుగోసారి.

వ్యక్తిగత జీవితం

ఏచూరి భార్య సీమా చిస్తీ పాత్రికేయురాలు. ఆమె 'ది వైర్' పోర్టల్‌కు సంపాదకురాలిగా, అంతకుముందు బీబీసీ హిందీ సర్వీసులకు సంపాదకురాలిగా పనిచేశారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక ఢిల్లీ రెసిడెంట్ ఎడిటర్‌గానూ వ్యవహరించారు. ఏచూరి కుమార్తె అఖిల ఏచూరి యూనివర్సిటీ ఆఫ్ ఎడిన్‌బరో, యూనివర్సిటీ ఆఫ్ సెయింట్ ఆండ్రూస్‌లో అధ్యాపకులు. ఏచూరికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి మోహన్ కందా మేనమామ. ఏచూరి కుమారుడు ఆశిష్ ఏచూరి కోవిడ్ కారణంగా 2021 ఏప్రిల్ 22న కన్నుమూశారు.

2020లో ఢిల్లీలో జరిగిన అల్లర్లకు సంబంధించిన కేసులో ఏచూరి, యోగేంద్ర యాదవ్, మరికొందరిని అనుబంధ ఛార్జిషీటులో చేర్చారు. దీనిపై ఏచూరి స్పందిస్తూ ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకోవడానికి బిజెపి అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని విమర్శించారు.

రచయితగా...

ఏచూరి రచయితగా అనేక పుస్తకాలు రాశారు. వాట్ ఈజ్ దిస్ హిందూ రాష్ట్ర? : ఆన్ గోల్వాల్కర్ ఫాసిస్టిక్ ఐడియాలజీ అండ్ శాఫ్రాన్ బ్రిగేడ్స్ ప్రాక్టీస్, సూడో హిందూయిజం ఎక్స్‌పోజ్డ్ : శాఫ్రాన్ బ్రిగేడ్ మైత్స్ అండ్ రియాలిటీ, కాస్ట్ అండ్ క్లాస్ ఇన్ ఇండియన్ పాలిటిక్స్ టుడే, ఆయిల్ పూల్ డెఫిసిట్ ఆర్ సెస్ పూల్ ఆఫ్ డెసిట్, సోషలిజం ఇన్ ఛేంజింగ్ వరల్డ్, లెఫ్ట్ హ్యాండ్ డ్రైవ్ : కాంక్రీట్ అనాలసిస్ ఆఫ్ కాంక్రీట్ కండిషన్స్, మోడీ గవర్నమెంట్ : న్యూ సర్జ్ ఆఫ్ కమ్యునలిజం, కమ్యునలిజం వర్సెస్ సెక్యులరిజం, గ్రినా కీ రాజ్‌నీతి వంటి పుస్తకాలను ఏచూరి రచించారు. పీపుల్స్ డెయిరీ ఆఫ్ ఫ్రీడమ్ స్ట్రగుల్, ది గ్రేట్ రివోల్ట్ ఎ లెఫ్ట్ అప్రైజల్, గ్లోబల్ ఎకనమిక్ క్రైసిస్ : ఏ మార్క్సిస్ట్ పర్‌స్పెక్టివ్ అనే పుస్తకాలు ఆయన సంపాదకత్వంలో వెలువడ్డాయి. సిపిఎం అధికార వార పత్రిక 'పీపుల్స్ డెమెక్రసీ'కి చాలా కాలం పాటు సంపాదకత్వ బాధ్యతలు నిర్వహించారు.

ఆఖరి సందేశాలు..

కొన్ని రోజులే ఉన్నాయని తెలుసు. అనారోగ్యం ఆస్పత్రిలో అయితే ఉంచగలిగింది కానీ, కామ్రేడ్ ఏచూరిని ప్రజల తరపున పోరాడే నిబద్ధత నుంచి పక్కకు జరపలేకపోయింది. ఆ నిబద్ధతే స్వాతంత్ర్య దినోత్సవం నాడు మోడీ సందేశానికి ప్రజల తరపున ఏచూరిని కౌంటర్ ఇచ్చేలా చేసింది. ఆ బాధ్యతే, బుద్ధదేవ్ భట్టాచార్య సంతాప సభకు ఆస్పత్రిలో విశ్రాంతికి రెస్ట్ ఇచ్చి ఏచూరితో వీడియో విడుదల చేయించింది.

ఆగస్టు 22

పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య మృతికి సంతాపం తెలుపుతూ ఆరు నిమిషాల నిడివి గల వీడియో సందేశాన్ని విడుదల చేశారు. "కామ్రేడ్ బుద్ధదేవ్ భట్టాచార్య స్మారక సమావేశానికి హాజరుకాలేకపోవడం నాకు వ్యక్తిగతంగా పెద్ద లోటు. ఇందుకు విచారం వ్యక్తం చేస్తున్నాను. ఆయన గురించి నా భావాలు, భావోద్వేగాలు ఎయిమ్స్ నుంచి చెప్పాల్సి రావడం మరింత బాధాకరం. లాల్‌సలామ్ బుద్ధా దా.." అంటూ తన అభిప్రాయాలతో కూడిన ఓ వీడియోను ట్విట్టర్‌లో పోస్టు చేశారు.

ఆగస్టు 17.. ప్రధాని ప్రసంగంపై స్పందిస్తూ వ్యాఖ్యానించారు. 'స్వాతంత్ర్య దినోత్సవం నాడు జాతిని ఉద్దేశించి చేసిన ప్రసంగంలో ప్రధాన మంత్రి ఐదు ముఖ్యమైన అంశాలను హైలైట్ చేశారు. అవి రాబోయే సంవత్సరాలకు తమ ఎజెండాగా ఉంటాయని కూడా చెప్పారు. వీటిల్లో ఒకటి ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిల అసంపూర్తి ఎజెండా. అది ఉమ్మడి పౌర స్మృతిని ప్రవేశపెట్టడం. ఇప్పటివరకు మనం "కమ్యూనల్ సివిల్ కోడ్"ను అమలు చేస్తున్నామని చెప్పిన మోడీ తాజా ఉమ్మడి పౌర స్మృతికి సెక్యులర్ సివిల్ కోడ్ అని పేరు పెట్టారు. ఇది చాలా తీవ్రమైన విషయం. దేశంలో గత 78 సంవత్సరాలుగా అమలు చేస్తున్న పౌర స్మృతి మన ఎస్‌సిలు, ఎస్‌టిలు, ఇతర అణగారిన వర్గాలకు సంబంధించినది. మనం అనుభవిస్తు హక్కులు మతపరమైనవి అని భావించలేం. అయితే మతం కార్డ్ ప్లే చేయడం ఇప్పుడు ప్రధాని మోడీ అసలు ఉద్దేశ్యం' అని ఏచూరి స్పందించారు.

ఆర్టికల్ 370 రద్దు సమయంలో ...

న్యూఢిల్లీ 2019లో మోడీ ప్రభుత్వం జమ్ముకాశ్మీర్‌ను బహిరంగ జైలుగా మార్చింది. దాన్ని వ్యతిరేకిస్తూ గొంతెత్తిన తొలి నేత ఏచూరి. ఏచూరి వేసిన ముందడుగు నిర్బంధపు సంకెళ్లకు వ్యతిరేకంగా గళం విప్పే శక్తులకు కొండంత బలం ఇచ్చింది. ఏచూరి పర్యటించిన తరువాతే కాంగ్రెస్ సహా ఇతర పార్టీల నేతలు జమ్ముకాశ్మీర్ పర్యటనకు వెళ్లారు.

ఎలక్టోరల్ బాండ్లకు వ్యతిరేకంగా రాజీలేని పోరు

అవినీతికి తిష్టవేసి కూర్చోబెట్టడానికే మోడీ ప్రభుత్వం ఎలక్టోరల్ బాండ్‌లను ప్రవేశపెట్టింది. దానిని ఏచూరి నికరంగా వ్యతిరేకిస్తూ అటు రాజకీయ పోరాటాన్ని, ఇటు న్యాయపోరాటాన్ని జమిలిగా సాగించారు.

నోట్ల రద్దుకూ, పౌరసత్వ సవరణకూ, విద్యా సాంస్కృతిక రంగాల్లో కాషాయికరణకూ, మైనార్టిలపై దాడులకూ వ్యతిరేకంగా ప్రజల్ని ఏకం చేయడంలో కీలక పాత్ర పోషించారు.

కోవిడ్ సమయంలో నాయకులంతా ఎవరి ప్రాణభయంతో వాళ్లున్నారు. ఆ కష్టకాలంలో ఏచూరి జీవనోపాధి కోల్పోయిన ప్రజల ఆకలి గురించి ఆలోచించారు. ఉచిత ఆహారధాన్యాల పంపిణీ, కోవిడ్ టీకాలు ప్రభుత్వమే ఉచితంగా అందరికీ అందించాలనే డిమాండ్‌ను ముందుకు తెచ్చారు.


ఏచూరి, ప్రధాని మోడీ


ఏచూరి రాహుల్‌గాంధీ


తల్లి కల్పకంతో ఏచూరి


ఏచూరి, జగన్‌మోహన్‌రెడ్డి

ఈ దేశం అందరిదీ...

'భారత్ మాతా కీ జై' అని నినాదాలు చేసేవారు మాత్రమే దేశభక్తులు ఎలా అవుతారు? మనం 'జైహింద్' అంటే అది దేశభక్తిని ఎందుకు ప్రకటించదు! భగత్ సింగ్ నినదించిన 'ఇంక్విలాబ్ జిందాబాద్' ఎందుకు దేశభక్తి నినాదం కాదు? అతను దేశభక్తుడు కాదా...!

దేశభక్తుడికి ఒకే ఒక అర్థం ఉంటుంది. అతను భారతదేశాన్ని ప్రేమిస్తాడు.

మనం హిందూ జాతీయవాదం కోసం కాకుండా భారత జాతీయవాదం కోసం నిలబడాలి. భారత జాతీయతను పెంపొందించుకోవడం మనందరి కర్తవ్యం. అలా చేయకపోవడం వల్లే దేశంలో విద్వేషాలు రెచ్చగొట్టే శక్తులు పేట్రేగిపోతున్నాయి. మూకదాడులు, హత్యలు చోటుచేసుకుంటున్నాయి. ఇది చాలా బాధాకరం.

మోడీ ప్రభుత్వం ఊదరగొడుతున్న జాతీయవాదం హిట్లర్ జాతీయవాదాన్ని పోలి ఉంటుంది. హిట్లర్ జర్మన్ జాతీయవాదాన్ని నాశనం చేయాలని పిలుపునిచ్చాడు. హిందుత్వ జాతీయవాదం హిందువేతరులందరినీ నిర్మూలించాలని చెప్తున్నది..."

భారతదేశం అంతటా మైనారిటీలు, దళితులపై మూక హత్యలు, హింస పెచ్చుమీరడం గురించి 2017 జులై 19న రాజ్యసభలో సీతారాం ఏచూరి చేసిన ప్రసంగంలోని భాగమిది.

• • •

అన్యాయం జరిగినప్పుడు పార్లమెంట్‌లో ఆయన ప్రశ్నిండం ఇదేం మొదటిసారి కాదు. రాజకీయాలకు అతీతంగా ప్రతిపక్షం చేసే పోరాటానికి ఏచూరి వెన్నెముకగా నిలిచేవారు.

'2005 నుండి 2017 వరకు రాజ్యసభలో ఏచూరి అత్యుత్తమ పార్లమెంటేరియన్' - రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ చెప్పే మాట ఇది.

నోట్ల రద్దు, ఆధార్, జెఎన్‌యు-హైదరాబాద్ యూనివర్సిటీలలో పరిస్థితులు, గోసంరక్షణ, సర్జికల్ స్ట్రైక్స్, విదేశాంగ విధానం...ఇలా ప్రతి అంశంపైన ఏచూరి లేవనెత్తిన ప్రశ్నలు, వెల్లడించిన వాస్తవాలు...మోడీ ప్రభుత్వ తప్పిదాలకు ప్రతిరూపాలే. ఏచూరి అంత సమర్థవంతంగా ఇన్ని సమస్యలను ప్రస్తావించిన ఎంపీలు ఎవరైనా ఉన్నారా అని ప్రశ్నిస్తే నిస్సందేహంగా లేరనే చెప్పుకోవచ్చు.

• • •

భారతదేశం మత ప్రాతిపదికన విభజించబడిందనే బాధను, ఈ దేశ పురోగతి పట్ల తనకున్న బలీయమైన కోరికను ఏచూరి ఎప్పుడూ వ్యక్తం చేసేవారు. ఈ దేశం అందరికీ చెందుతుందని, హక్కులు వరాలు కాదని, రాజ్యాంగం అన్నింటి కంటే ఉన్నతమైనదని ఆయన తన ప్రతి ప్రసంగంలోనూ ఉద్ఘాటించేవారు. 2017 ఆగస్టు 10న రాజ్యసభలో తన వీడ్కోలు ప్రసంగంలో...భారత దేశ బహుళత్వాన్ని నిర్వచించడానికి ఏచూరి తన సొంత కుటుంబాన్ని ఉదహరించారు.

"నేను 1952లో మద్రాసు జనరల్ హాస్పిటల్‌లో తెలుగు మాట్లాడే బ్రాహ్మణ కుటుంబంలో పుట్టాను. ఇప్పుడు చెన్నై అని పిలుస్తున్నారు. మా తాత న్యాయమూర్తి. 1954లో మద్రాసు హైకోర్టు ఆంధ్రా బెంచ్ గుంటూరు బదిలీ అయినప్పుడు మేం అక్కడికి మారాము. 1956లో హైదరాబాద్‌కు తరలివెళ్లాము. అప్పట్లో హైదరాబాద్‌లో ముస్లిం సంస్కృతి బలంగా వుండేది. తర్వాత ఢిల్లీ వచ్చాను. మా అబ్బాయి డానిష్...8వ శతాబ్దంలో మైసూరుకు వలస వచ్చిన చిస్తీ సూఫీ మూలాలున్నవాడు. తను హిందువా? బ్రాహ్మణుడా?

ఇది...మన దేశం. నాలాంటి వారు మన చుట్టూ ఎంతమంది ఉన్నారు? అటువంటి భారతదేశాన్ని రక్షించే బాధ్యతను మనం నిర్వర్తించాలి." అని ముగించారు.


ఏచూరి ప్రస్థానంలో విశేషాలు

1952-2024





కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ, సిపిఐ ప్రధాన కార్యదర్శి రాజా, పలువురు ప్రతిపక్ష నేతలతో



ఇందిరాగాంధీ ఓటమి అనంతరం జెఎన్‌యు ఛాన్సలర్ పదవికి రాజీనామా చేయాలని ఆమె సమక్షంలోనే నేరుగా డిమాండ్ చేసిన ఏచూరి. ఆ మరుసటి రోజే ఆమె ఛాన్సలర్ పదవి నుంచి తప్పుకున్నారు.



పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాష్‌కరత్, మాణిక్ సర్కార్‌తో



కింద కూర్చున్న వారిలో మధ్యలో ఉన్నది ఏచూరి, రెండో వరుసలో కుడి వైపు చివరన ఏచూరి తల్లి కల్పకం, నిల్చొన్న వారిలో కుడివైపు ఉన్న మొదటి వ్యక్తి ఆయన తండ్రి సర్వేశ్వరశర్మ



కామ్రేడ్స్ సూర్జిత్‌సింగ్, జ్యోతిబసు తదితరులతో



భార్య సీమా చిస్తీతో



విశాఖలో 2015లో జరిగిన సిపిఎం అఖిల భారత మహాసభ సందర్భంగా ఏర్పాటైన బహిరంగ సభలో మాట్లాడుతున్న ఏచూరి



కేరళ సిఎం పినరయి విజయన్‌తో



హైదరాబాద్ నిజాం కాలేజ్ గ్రౌండ్స్‌లో 2014లో జరిగిన బహిరంగ సభలో మత్స్యకారుని వేషధారణలో ఏచూరి, పక్కన బివి రాఘవులు, తమ్మినేని



విజయవాడలో జరిగిన సిపిఐ అఖిల భారత మహాసభ సందర్భంగా డి.రాజా, పి.మధు, వి.శ్రీనివాసరావులతో



2002లో ప్రజాశక్తి తిరుపతి ఎడిషన్ ప్రారంభం సందర్భంగా

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68